
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM



'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 15 | సంచిక: 134

SUNDAY Special

ఆదివారం 29-1-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



హ్యాపీ జర్నీ

కరోనా బారిన పడకుండా క్షేమంగా వివిధ దేశాలను, మనకు ఇష్టమైన ప్రాంతాలను చుట్టి రావాలంటే ఏం చేయాలి? అనే అంశంపై పానుగోటి నీలిమతో 'సాక్షి' ఇంటర్వ్యూ.


- వివరాలు 11లో



చాంపియన్ అరైనా సబలెంకా

ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో రిబాకినాను ఓడించి బెలారస్ టెన్నిస్ ప్లేయర్ అరైనా సబలెంకా తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలుచుకుంది.

- వివరాలు 12లో



వారి సాధికారతే ధ్యేయం

సమాజంలో అణగారిన వర్గాల సాధికారతే తమ ధ్యేయమని, అందుకోసం అవిశ్రాంతంగా కృషి చేస్తామని ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



జోడో యాత్ర పునఃప్రారంభం

భద్రతా కారణాలతో శుక్రవారం పుల్వామాలో ఆగిన రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర.. శనివారం పునఃప్రారంభమైంది.

వివరాలు 6లో ▸



నేలమీద పడేసి.. చేతులు విరగ్గొట్టి

అమెరికాలోని మెంఫిస్ నగర పోలీసులు ఓ నల్లజాతీయుడిని దారుణంగా హింసించారు. దీంతో అతను ప్రాణాలు కోల్పోయాడు.

వివరాలు 6లో ▸



విదేశీ రుణాలూ గగనమే!

ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న పాకిస్తాన్‌కు విదేశీ రుణాలూ దొరకడం లేదు. ఇప్పటికే విదేశీ మారకం నిల్వలు అడుగంటాయి.

వివరాలు 6లో ▸

సేవల్లో రికార్డు..

సచివాలయాల ద్వారా ఒకేరోజు పరిష్కారమైన వినతులు 2.88 లక్షలు

- ఇప్పటివరకు ఉన్న రికార్డు 1.80 లక్షలు
- వీటి ఏర్పాటు తర్వాత మూడేళ్లలో సొంత ఊళ్లలోనే మొత్తం 6.43 కోట్ల సేవలు పొందిన ప్రజలు
- వీటిల్లో అత్యధికం రెవెన్యూ సంబంధిత సేవలే
- ప్రజలకు మరింత దగ్గరైన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ
- గతంలో కాళ్లరిగేలా తిరిగినా పరిష్కారం కాని సమస్యలు
- ఇప్పుడు ఆ కష్టాలన్నింటికీ చెక్..
- ఉన్న ఊర్లోనే రోజుల వ్యవధిలోనే సచివాలయాల్లో పనులు పూర్తి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ సరికొత్త రికార్డు సృష్టించింది. వీటి ఏర్పాటు తర్వాత తొలిసారిగా ఈనెల 25న ఒక్క రోజులో ఏకంగా 2.88 లక్షల మంది వినతులు పరిష్కారమయ్యాయి. రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక 2019 అక్టోబరు 2న రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రెండు వేల జనాభాకు ఒకటి చొప్పున గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. నగరాలు, పట్టణాలు, గ్రామాలు, కుగ్రామాలు అన్న తేడా లేకుండా ప్రజలెవరూ ప్రభుత్వానికి సంబంధించిన వివిధ పనుల కోసం మండల కేంద్రాలు లేదంటే దగ్గర్లోని పట్టణాలు లేదా జిల్లా కేంద్రాలకో వెళ్లాల్సిన అవసరం లేకుండా వారి సొంత ఊర్లోనే ఆయా పనులయ్యేలా ఓ వినూత్న, విప్లవాత్మక ఆలోచనను ఆచరణలో పెట్టింది. ఈ పనులు దాదాపు పరిష్కారమయ్యేలా 2020 జనవరి 26 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో మొత్తం 545 ప్రభుత్వ సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. మరో 252 రకాల కేంద్ర ప్రభుత్వ సేవలను కూడా

మిగతా 2వ పేజీలో ▶

జిల్లాకొక సాఫ్ట్‌వేర్ నిపుణుడు

సచివాలయాల్లో వినతుల పరిష్కారంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా ఎప్పటికప్పుడే వాటిని పరిష్కరించడానికి జిల్లాకొక సాఫ్ట్‌వేర్ నిపుణుడిని ఏర్పాటుచేస్తోంది. అలాగే, సేవలు అందజేసే సమయంలో తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన శిక్షణనూ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. రాబోయే రోజుల్లో ఇంటినుంచే ఆన్‌లైన్ ద్వారా సచివాలయ సేవలను అందించేందుకు కసరత్తు చేస్తోంది. దరఖాస్తుదారులకు సంబంధిత సర్టిఫికెట్ల సాఫ్ట్ కాపీలను వాట్సాప్ లింక్ ద్వారా పంపేందుకు యత్నిస్తున్నారు.

విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో

ఏపీ కార్యక్రమాలు అద్భుతం

- నాబార్డు చైర్మన్ షాజీ కేవీ ప్రశంసలు
- సీఎం జగన్‌తో సమావేశం.. వివిధ కార్యక్రమాల అమలుపై చర్చ



నాబార్డు చైర్మన్ షాజీ కేవీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

2లో

రెండు యుద్ధ విమానాలు ఢీ

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు సమీపంలో ఢీకొన్న సుఖోయ్ 30ఎంకేఐ, మిరాజ్-2000

ఒక పైలట్ మృతి.. మరో ఇద్దరికి గాయాలు



6లో

న్యూస్‌రీల్

తిరుమలలో వైభవంగా రథ సప్తమి



సూర్య జయంతిని పురస్కరించుకుని తిరుమలలో రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమ, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై మలయప్ప స్వామి విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు.

వివరాలు 13లో ▸

మీకు ప్రాణభిక్ష పెట్టింది పోలీసులే



టీడీపీ నేత అచ్చెన్నాయుడిని గతంలో కొందరు చితకబాదుతుంటే కాపాడింది పోలీసులేనని.. ఆ విశ్వాసం మరిచి ఇప్పుడు అసభ్యకరంగా మాట్లాడుతున్నారని చిత్తూరు జిల్లా పోలీస్ సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేసింది.

వివరాలు 3లో ▸

వాయుగుండంగా మారనున్న అల్పపీడనం



బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం.. ఆదివారం తీవ్ర అల్పపీడనంగా మారనుంది. ఇది సోమవారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణ విభాగం తెలిపింది.

వివరాలు 2లో ▸

మొఘల్ గార్డెన్స్ పేరు మార్పు



ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వద్ద ఉన్న చారిత్రక మొఘల్ గార్డెన్స్ పేరు మారింది. దీనిని అమృత్ ఉద్యాన్‌గా కేంద్ర ప్రభుత్వం మార్చి వేసింది. దీనిపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి.

వివరాలు 6లో ▸



మన మంచికే సార్! మిగిలిన హామీలన్నీ నెక్ట్స్ ఎలక్షన్ల మేనిఫెస్టోలో పెడదాం!!

ఎద్దు ఈనిందట.. గాటికి కట్టేశారట!

ఉద్యోగ విరమణ వయసు 65 ఏళ్లకు పెంపు అంటూ నకిలీ జీవో సృష్టించిన పచ్చ పార్టీ

- సోషల్ మీడియాలో దుష్ప్రచారం
- దానిని నిర్ధారించుకోకుండానే ఈటీవీ సహా పలు చానళ్ల ప్రసారం
- యువతను తప్పుదారి పట్టించాలనే కుతంత్రం
- తీవ్రంగా ఖండించిన ఆర్థిక శాఖ ప్రత్యేక సీఎస్ ఎస్ఎస్ రావత్
- గుంటూరు డీఐజీకి ఫిర్యాదు చేసిన ఆర్థిక శాఖ అధికారులు



నకిలీ జీవోను ప్రసారం చేస్తూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్న ఈటీవీ

- కేసు నమోదు చేయాలని ఎస్పీకి ఆదేశం
- అది తప్పుడు జీవో.. దాన్ని నమ్మొద్దని ఉద్యోగులకు వినతి

- వివరాలు 2లో ▸

విచారణ పారదర్శకంగా జరగాలని కోరాం



- కడప ఎంపీ అవినాష్‌రెడ్డి వెల్లడి
- ఓ వర్గం మీడియా విపరీతంగా వక్రీకరణలు చేస్తోంది
- వీడియో, ఆడియో రికార్డింగ్ కోసం పట్టుబట్టిన న్యాయవాది
- 'సాక్షి'గా మాత్రమే విచారిస్తున్నామన్న సీబీఐ అధికారులు

- వివరాలు 3లో ▸

కొత్త 'బంగారు' లోకం

- ప్రజల అభిరుచిలో మార్పు వచ్చింది. నిన్న మొన్నటి వరకు 22 క్యారెట్ల బంగారు ఆభరణాల కొనుగోలుకు ప్రాధాన్యత ఇచ్చిన వారు.. 14–18 క్యారెట్ల బంగారంతో చేసిన ఆభరణాల వైపు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు దేశంలో 2021లో 611 టన్నుల బంగారు ఆభరణాల అమ్మకాలు జరిగినట్లు తేలింది. కొనుగోళ్లలో గ్రామీణ మధ్య తరగతి ప్రజల వాటా 58 శాతంగా ఉందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ వెల్లడించింది.



- వివరాలు 10లో ▸

అత్యంత విషమంగా తారకరత్న ఆరోగ్యం

- బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో ఎక్మో ద్వారా చికిత్స
- పలువురు కుటుంబ సభ్యుల పరామర్శ
- కోలుకోవడానికి సమయం పడుతుందన్న చంద్రబాబు

2లో



క్లుప్తంగా...

శ్రీసిటీ సిద్ధార్థ లాజిస్టిక్స్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న సిద్ధార్థ లాజిస్టిక్స్ కంపెనీ ఎండీ నిశ్చల్ పాద్య

వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): శ్రీసిటీలోని సిద్ధార్థ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు 'అతిపెద్ద దిగుమతిదారు' అవార్డు లభించింది. అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం సందర్భంగా 2021–2022వ ఆర్థిక సంవత్సరంలో అతిపెద్ద దిగుమతిదారు అవార్డుకు సిద్ధార్థ లాజిస్టిక్స్‌ను ఎంపిక చేశారు. విశాఖపట్నంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సెంట్రల్ ట్యాక్సెస్ చీఫ్ కమిషనర్ నుంచి సిద్ధార్థ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ నిశ్చల్ పాద్య ఈ అవార్డును అందుకున్నారు. ఏడాదిలో సిద్ధార్థ లాజిస్టిక్స్ రూ.1.47 లక్షల కోట్ల దిగుమతులు చేయడంతోపాటు రూ.16,293 కోట్ల దిగుమతి సుంకం చెల్లించిందని నిశ్చల్ పాద్య తెలిపారు. తమ సిబ్బంది అత్యుత్తమ పనితీరు, సమష్టి కృషికి గుర్తింపుగా ఈ అవార్డు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సిద్ధార్థ లాజిస్టిక్స్ బృందానికి ఇది గర్వకారణమన్నారు. సిద్ధార్థ పరిశ్రమ బృందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వం వల్ల పూర్తి 'మద్దతు' లభిస్తోంది

- పశ్చిమగోదావరి జిల్లా దువ్వ గ్రామ రైతులు
- సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



దువ్వ గ్రామంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

తణుకు టౌన్: గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర.. ఒక్క రూపాయి కూడా తగ్గకుండా అందుతోందని పశ్చిమగోదావరి జిల్లా దువ్వ గ్రామ రైతులు తెలిపారు. శనివారం గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద రైతులు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి తమ సంతోషాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గతంలో రైతుల కష్టాన్ని దళారులు, మిల్లర్లు స్వాహా చేసేవారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఆన్‌లైన్ విధానం వల్ల రైతులకు పూర్తిస్థాయిలో మద్దతు ధర లభించిందని చెప్పారు. ధాన్యం అమ్మిన వారం రోజుల్లోనే తమ బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ అయ్యిందని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ధాన్యం కొనుగోలు, అమ్మకాల్లో అనేక అక్రమాలు జరిగేవని గుర్తు చేశారు. రైతులకు అండగా ఉంటున్న సీఎం వైఎస్ జగన్, మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావుకు రుణపడి ఉంటామన్నారు.

వాయుగుండంగా మారనున్న అల్పపీడనం

- ఫిబ్రవరి 1 నాటికి శ్రీలంక తీరానికి..
- రేపటి నుంచి దక్షిణ కోస్తా, సీమ ప్రాంతాల్లో వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో తూర్పు భూమధ్య రేఖను ఆనుకుని ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కూడా విస్తరించి ఉంది. ఇది క్రమంగా పశ్చిమ వాయవ్య దిశగా పయనించి ఆదివారం తీవ్ర అల్పపీడనంగా మారనుంది. అనంతరం అదే దిశలో కదులుతూ సోమవారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శనివారం రాత్రి నివేదికలో వెల్లడించింది. వాయుగుండం నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించి ఫిబ్రవరి 1న శ్రీలంక తీరానికి చేరుకుంటుందని తెలిపింది. దీని ప్రభావంతో ఈ నెల 30వ తేదీ నుంచి దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడక్కడా తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది. మరోవైపు రానున్న రెండు రోజులపాటు రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2నుంచి 3 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్టు తెలిపింది. పలు ప్రాంతాల్లో పొగమంచు కూడా ఏర్పడుతుందని తెలిపింది. కాగా.. రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతల క్షీణత కొనసాగుతోంది. అరకు లోయలో 7.1, పెద ఉప్పరాపల్లి (చిత్తూరు) 8.8, ఆర్.అనంతపురం (శ్రీసత్యసాయి) 9, బెలుగుప్ప (అనంతపురం) 9.5, పెద్ద తిప్పసముద్రం (అన్నమయ్య) 10.3, హలహర్వి (కర్నూలు) 10.5, వల్లివేడు (తిరుపతి)ల్లో 10.8 డిగ్రీల చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మిలటరీ సామర్థ్యంలో స్థిరంగా భారత్



ఎం. విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి

మిలటరీ సామర్థ్యంలో మన దేశం నాలుగో స్థానంలో నిలిచింది. 'గ్లోబల్ ఫైర్ పవర్' (జీఎఫ్‌పీ) సూచీ–2023 ఇటీవల విడుదలైంది. ఈ సూచీలో 2006 నుంచి భారత్ నాలుగో స్థానంలో స్థిరంగా కొనసాగుతోంది. తాజా సూచీలో అమెరికాకు తొలి ర్యాంకు రాగా.. రెండు, మూడు స్థానాల్లో రష్యా, చైనా ఉన్నాయి. జీఎఫ్‌పీ సూచీ రూపొందించిన 2005 నుంచి ఇప్పటివరకు అమెరికా తొలి ర్యాంకులోనే ఉంది. 2005, 2006 సూచీల్లో రెండోస్థానంలో నిలిచిన చైనా.. ఆ తర్వాత రష్యా ఆ స్థానాన్ని కైవసం చేసుకుంది. 2007 నుంచి ఇప్పటివరకు రెండు, మూడు స్థానాల్లో రష్యా, చైనా కొనసాగుతున్నాయి. 2005 సూచీలో పాకిస్తాన్ నాలుగో స్థానంలో ఉండగా, 2006లో 5వ స్థానానికి, 2007లో 20వ స్థానానికి పడిపోయింది. 2010కి కాస్త మెరుగుపడి 15వ స్థానానికి చేరింది. ఇప్పుడు తాజాగా 2022లో 9వ స్థానానికి వచ్చిన పాకిస్తాన్... ఈ సంవత్సరం 7వ స్థానంలో నిలిచింది.

దాదాపు దశాబ్ద కాలంగా మనది నాలుగోస్థానం
తొలి మూడు స్థానాల్లో అమెరికా, రష్యా, చైనా
ఆ తర్వాత యూకే, దక్షిణ కొరియా, పాకిస్తాన్
యుద్ధ ట్యాంకుల సంఖ్య, సామర్థ్యం ప్రకారం చూస్తే భారత్‌కు ఆరో స్థానం

ప్రపంచ యుద్ధాల్లో కదన రీతిని సమూలంగా మార్చేసిన యుద్ధట్యాంకులు.. ఆధునిక యుగంలోనూ సైన్యం శక్తిసామర్థ్యాలకు మూలస్తంభాలుగా యుద్ధట్యాంకులు నిలవడం గమనార్హం.

- ఆధునిక ఆయుధ సంపత్తి సమకూరిన తర్వాత సైన్యం సామర్థ్యాన్ని లెక్కగట్టడంలో ఇప్పటికీ యుద్ధట్యాంకులు కీలక భూమిక పోషిస్తున్నాయి. యుద్ధ ట్యాంకులూ ఆధునికతను సంతరించుకుని, సాయుధ బలగాలకు వెన్నెముకగా నిలుస్తున్నాయి.
- రష్యా వద్ద ఇవి అత్యధికంగా 12,566, భారత్ వద్ద 4,614 ట్యాంకులున్నాయి.
- అర్జున్ లాంటి అత్యాధునిక భారీ యుద్ధ ట్యాంకులతో పాటు తక్కువ బరువైన (గరిష్టంగా 25 టన్నులు) యుద్ధ ట్యాంకులు కూడా భారత్ సైన్యం వద్ద ఉన్నాయి.
- కృత్రిమ మేధస్సును వాడుకునే సామర్థ్యం ఉన్న అత్యాధునిక ట్యాంకులు మన సొంతం.
- ఇక ఎత్తయిన ప్రదేశాల్లోనూ, భౌగోళికంగా అత్యంత అనుకూల పరిస్థితులున్న చైనా సరిహద్దు ప్రాంతాల్లో శత్రువులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి తక్కువ బరువున్న యుద్ధ ట్యాంకులను సమకూర్చుకోవడానికి భారత్ దేశీయ పరిజ్ఞానంతో 'ప్రాజెక్టు జొరావర్' చేపట్టింది.
- భారీ ట్యాంకులకు ఇవి ఏమాత్రం తక్కువ కాదు.

- ప్రపంచ దేశాల సైనిక శక్తి సామర్థ్యాలను విశ్లేషించి ర్యాంకులు ఇచ్చే 'గ్లోబల్ ఫైర్ పవర్' 2023 నివేదికను ఇటీవల విడుదల చేసింది. దీని ప్రకారం ఏ దేశం వద్ద ఎన్ని యుద్ధ ట్యాంకులున్నాయంటే..

రష్యా	12,566
ఉ.కొరియా	6,645
అమెరికా	5,500
చైనా	4,950
ఈజిప్ట్	4,664
భారత్	4,614
ఇరాన్	4,071
పాకిస్తాన్	3,742
సిరియా	2,616
ద.కొరియా	2,331
టర్కీ	2,229
ఇజ్రాయెల్	2,200
ఉక్రెయిన్	1,890
వియత్నాం	1,829
మొరాకో	1,761

అమెరికాలోనే ఎక్కువగా..

అత్యాధునిక యుద్ధ ట్యాంకులు తయారుచేస్తున్న అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్‌లో చూస్తే అమెరికా వద్దే పెద్ద సంఖ్యలో ట్యాంకులు ఉన్నాయి. మిగతా అగ్ర దేశాలు తాము ఉత్పత్తి చేసిన ట్యాంకులను ఇతర దేశాలకు విక్రయించడమే తప్ప తమ సైన్యానికి ఇవ్వలేదు. అత్యాధునిక లెపర్డ్–2 ఉత్పత్తి చేస్తున్న జర్మనీ తన వద్ద ఉంచుకున్న ట్యాంకులు 266 మాత్రమే. ఛాలెంజర్–2లను ఉత్పత్తి చేస్తున్న యూకే.. తన వద్ద ఉన్న ఈ ట్యాంకుల సంఖ్య 227 మాత్రమే. అవి నాటో దేశాలు కావడంవల్లే భారీగా ట్యాంకులు సమకూర్చుకోవడం లేదు.

ఉక్రెయిన్ వద్ద ఆనాటి ట్యాంకులు

ఉక్రెయిన్ ఒకప్పటి యూఎస్ఎస్ఆర్‌లో భాగం. ఉక్రెయిన్ వద్ద ఉన్న యుద్ధ ట్యాంకుల్లో యూఎస్ఎస్ఆర్ కాలం నాటివే ఎక్కువ. రష్యా యుద్ధ ట్యాంకులను కొన్నింటిని స్వాధీనం చేసుకుని వాడుతున్నారు. అత్యాధునిక యుద్ధ ట్యాంకులు ఇస్తే రష్యాతో యుద్ధ స్వరూపాన్ని సమూలంగా మార్చేయాలని ఉక్రెయిన్ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. వీటిని ఇవ్వమని నాటో సభ్య దేశాలను అడుగుతోంది. ఇటీవల జర్మనీలో జరిగిన వివిధ దేశాల రక్షణ మంత్రుల సమావేశంలో ఉక్రెయిన్ విజ్ఞప్తి మీద చర్చ జరిగినా సానుకూల నిర్ణయం రాలేదు.

ర్యాంకుల కథాకమామిషు..

ప్రపంచ దేశాల సైన్యాల కదన సామర్థ్యం ఆధారంగా 'గ్లోబల్ ఫైర్ పవర్' (జీఎఫ్‌పీ) అంతర్జాతీయ సంస్థ 2005 నుంచి ఏటా ర్యాంకులు ఇస్తోంది. సంప్రదాయ పద్ధతుల్లో ఆయా దేశాల నింగి, నేల, జల యుద్ధ సామర్థ్యాలు, సైన్యాలకు అందుబాటులో ఉన్న మానవ వనరులు, ఆయుధ సంపత్తి, సహజ వనరులు, దేశ రక్షణకు చేస్తున్న వ్యయం, భౌగోళిక పరిస్థితులు, పొరుగు దేశాల నుంచి ఒత్తిడి, సరిహద్దు పాయింట్లు.. ఇలా 60కి పైగా అంశాలను పరిగణనలోకి తీసుకుని 145 దేశాలకు 'గ్లోబల్ ఫైర్ పవర్' ర్యాంకులు ఇస్తోంది.

జీఎఫ్‌పీ ఫార్ములా ప్రకారం ర్యాంకుల సూచీలో 'మిలటరీ పర్ఫెక్ట్'కు 'సున్నా' పాయింట్లు ఉండాలి. పాయింట్లు పెరిగే కొద్దీ ఈ ర్యాంకు పెరుగుతూ ఉంటుంది.

2023 సూచీ ర్యాంకులు, పాయింట్లు ఇలా..

1	అమెరికా	0.0712
2	రష్యా	0.0714
3	చైనా	0.0722
4	భారత్	0.1025
5	యూకే	0.1435
6	ద.కొరియా	0.1505
7	పాకిస్తాన్	0.1694
8	జపాన్	0.1711
9	ఫ్రాన్స్	0.1848



విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో ఏపీలో కార్యక్రమాలు అద్భుతం

- నాబార్డు చైర్మన్ షాజీ కేవీ ప్రశంసలు
- సీఎం జగన్‌తో సమావేశం.. వివిధ కార్యక్రమాల అమలుపై చర్చ

సాక్షి, అమరావతి: నాబార్డ్ సాయంతో విద్యారంగంలో చేపడుతున్న మనబడి నాడు–నేడు కార్యక్రమం, కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణంతో పాటు వ్యవసాయ రంగంలో చేపడుతున్న కార్యక్రమాలు సమర్థంగా కొనసాగుతున్నాయని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం అద్భుతంగా నిర్వహిస్తోందని నాబార్డు చైర్మన్ షాజీ కేవీ ప్రశంసించారు. తాడేపల్లిలోని సీఎం నివాసంలో శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నాబార్డ్ చైర్మన్‌తో పాటు.. ప్రతినిధుల బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా నాబార్డ్ సాయంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల అమలుపై చర్చించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో నాబార్డ్ సాయంతో చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు నడుస్తున్నాయని సీఎం వైఎస్ జగన్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య, వ్యవసాయ రంగాల్లోనూ, మహిళా సంక్షేమంలోనూ చేపడుతున్న కార్యక్రమాలు రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను గణనీయంగా మెరుగుపర్చడమే కాకుండా.. రాష్ట్ర భవిష్యత్తుకు మంచి బాటలు వేస్తున్నాయని సీఎం వివరించారు.

ఏపీలో 3 ఏళ్లలో మూడురెట్లు పెరిగిన వ్యాపారం

రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం వల్ల ఏపీలో సహకార బ్యాంకింగ్ రంగం గణనీయమైన పురోగతి సాధిస్తోందని నాబార్డు చైర్మన్ షాజీ కేవీ చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడేళ్లలో మూడు రెట్లు వ్యాపారం పెరగడం నిజంగా గొప్ప విషయమన్నారు. మారుమూల పల్లెలకు సైతం బ్యాంకింగ్ సేవలు అందించేలా కృషి చేయాలన్నారు. విజయవాడలో జరిగిన బ్యాంకర్ల సమ్మేళనం(బ్యాంకర్స్ కాంక్లేవ్)కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే రూ.10 వేల కోట్ల టర్నోవర్ దాటిన తొలి బ్యాంక్‌గా కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ బ్యాంక్‌ను స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన బ్యాంకులు కూడా మారుమూల ప్రజలకు బ్యాంకింగ్ సేవలందించేందుకు కృషి చేయాలని సూచించారు. వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాలకు ఇచ్చే రుణాల్లో కనీసం 40 శాతం సహకార బ్యాంకుల ద్వారా ఇవ్వాలని లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. పాడి, పశుపోషణ, మత్స్య అనుబంధ కార్యకలాపాలకు పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేయాలన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా రెండు గ్రామాలకొకటి చొప్పున ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్)ను ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తున్నట్టు చెప్పారు. నాబార్డ్ నిబంధనలు పాటిస్తూ ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తే ఎలాంటి పెనాల్టీలు పడవని, బ్యాంకింగ్ లావాదేవీలకు కూడా అంతరాయం ఏర్పడదని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఏపీలో సహకార బ్యాంకులు సీడీ రేషియో 140 శాతం సాధించడం పట్ల ఎంపీ బాలశౌరి బ్యాంకర్స్‌కు అభినందనలు తెలిపారు. వ్యవసాయ మార్కెటింగ్ ప్రిన్సిపల్ కార్యదర్శి చిరంజీవిచౌదరి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, నాబార్డు సీజీఎం ఎంఆర్ గోపాల్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ నవనీత్‌కుమార్, ఆప్కాబ్ ఎండీ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యంత విషమంగా తారకరత్న ఆరోగ్యం

- నారాయణ హృదయాలయలో ఎక్మో ద్వారా చికిత్స
- పలువురు కుటుంబ సభ్యుల పరామర్శ

సాక్షి బెంగళూరు: సినీ నటుడు నందమూరి తారకరత్న ఆరోగ్యం అత్యంత విషమంగా ఉందని బెంగళూరులోని నారాయణ హృదయాలయ వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయనకు నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో ఐసీసీయూలో చికిత్స అందిస్తున్నారు. తారకరత్న గుండె పని తీరు సరిగా లేకపోవడంతో ఎక్మో ద్వారా చికిత్స అందిస్తున్నారు. మరో 48 గంటలు గడిస్తేనే కానీ ఏ విషయం చెప్పలేమని వైద్యులు చెబుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కుప్పంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పాదయాత్రలో పాల్గొన్న తారకరత్నకు గుండెపోటు వచ్చిన సంగతి తెలిసిందే. వైద్యుల సూచన మేరకు మరింత మెరుగైన చికిత్స కోసం ఆయన్ని శుక్రవారం అర్ధరాత్రి బెంగళూరు బొమ్మసంద్రలోని నారాయణ హెల్త్ సిటీలో చేర్పించారు. ఆయనకు ఇంట్రా ఆయోర్టిక్ పంప్, వ్యాసో ఆక్టివ్ సహాయంతో చికిత్స ఇస్తున్నట్లు వైద్యులు తెలిపారు. బెలూన్ యాంజియోప్లాస్టీ ద్వారా రక్తాన్ని పంపింగ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక వైద్య బృందాలు ఆయనకు చికిత్స అందిస్తున్నాయన్నారు.

చంద్రబాబు, ఇతర కుటుంబ సభ్యుల పరామర్శ

తారకరత్నను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఇతర కుటుంబ సభ్యులు, పలువురు టీడీపీ ప్రముఖులు శనివారం సాయంత్రం ఆస్పత్రిలో పరామర్శించారు. దగ్గుబాటి పురందేశ్వరి, దివంగత హరికృష్ణ కుమార్తె సుహాసిని, సోదరుడు చైతన్యకృష్ణ, టీడీపీ నేతలు నిమ్మకాయల చిన్నరాజప్ప, పరిటాల శ్రీరామ్, దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు పరామర్శించారు. తారకరత్న త్వరగా కోలుకుంటాడని ఆశిస్తున్నామని కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. సోమవారం మరోసారి కీలక పరీక్షలు చేస్తారని తెలిపారు.

కోలుకోవడానికి సమయం పడుతుంది: చంద్రబాబు

తారకరత్న ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, కోలుకోవడానికి సమయం పడుతుందని చంద్రబాబు చెప్పారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో తారకరత్న ఉన్నారని తెలిపారు. ఆయన త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని అన్నారు.

ఎద్దు ఈనిందట.. గాటికి కట్టేశారట!

- ఉద్యోగ విరమణ వయసు 65 ఏళ్లకు పెంపు అంటూ నకిలీ జీవో సృష్టించిన పచ్చ పార్టీ
- తీవ్రంగా ఖండించిన ఆర్థిక శాఖ ప్రత్యేక సీఎస్ ఎస్ఎస్ రావత్

సాక్షి, అమరావతి : ప్రభుత్వ ఉద్యోగులను అడ్డుపెట్టుకుని తాజాగా మరో కుట్రకు తెరలేపింది టీడీపీ, పచ్చ మీడియా. 'ఎద్దు ఈనిందంటే.. గాటికి కట్టెయ్యండి' అన్న చందంగా ప్రభుత్వంపై సాగిస్తున్న దుష్ప్రచారానికి బ్రేకింగ్ న్యూస్ అంటూ ఆజ్యం పోసింది ఈటీవీ. ఉద్యోగుల పదవీ విరమణ వయసును రాష్ట్ర ప్రభుత్వం 62 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచినట్లు టీడీపీ నకిలీ జీవోను సృష్టించింది. సోషల్ మీడియాలో దాన్ని వైరల్ చేసి, రాజకీయంగా లబ్ధి పొందాలని ఉవ్విళ్లూరింది. ఇందుకు పచ్చ మీడియా వంత పాడింది. ప్రజలు ఏమనుకుంటారన్న కనీస ఇంగిత జ్ఞానం లేకుండా.. నిర్ధారించుకోకుండానే ఆ నకిలీ జీవోను ఈటీవీతో పాటు మరి కొన్ని చానల్స్ పెద్ద ఎత్తున ప్రసారం చేయడం విస్తుగొలుపుతోంది. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 60 నుంచి 62 ఏళ్లకు పెంచింది. అయితే ఇప్పుడు మళ్లీ 62 నుంచి 65 ఏళ్లకు పెంచుతూ జీవో ఇచ్చినట్లు పచ్చ పార్టీ నేతలు కొందరు నకిలీ జీవోను సృష్టించారు. అసలు ఆ జీవో వాస్తవమైనదా? కాదా? అనే విషయాన్ని సరిచూసుకోకుండానే ఈటీవీ బ్రేకింగ్ న్యూస్‌లో ప్రచారానికి తెగపడింది. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచుతూ జీవో 15 జారీ చేసినట్లు వార్తలు ప్రసారం చేశారు. తద్వారా యువతను తప్పుదోవ పట్టించి, లబ్ధి పొందాలనే కుట్ర పూరిత ఆలోచనలో భాగంగానే ఇలా దుష్ప్రచారం సాగించారు.

మోసపోకండి.. అది నకిలీ జీవో

నకిలీ జీవోతో దుష్ప్రచారం సాగిస్తున్న విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో.. అలాంటి జీవో జారీ చేయలేదని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ తీవ్రంగా ఖండించారు. నకిలీ జీవో సృష్టించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఒక ప్రకటన ద్వారా హెచ్చరించారు. తప్పుడు, నకిలీ జీవోను చూసి ఉద్యోగులు, ప్రజలు మోసపోవద్దని సూచించారు. నకిలీ జీవో విషయమూ ఆర్థిక శాఖ అధికారులు గుంటూరు డీఐజీకి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేయాల్సిందిగా ఆయన ఎస్పీని ఆదేశించారు. కాగా, ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయసును 62 నుండి 65 ఏళ్లకు పెంచినట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు ఎవ్వరూ ఆ ప్రచారాన్ని నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు.

సేవల్లో రికార్డు

▶ మొదటి పేజీ తరువాయి

దశల వారీగా అందుబాటులోకి తెచ్చింది. వీటిద్వారా ఇప్పటివరకు గత మూడేళ్లలో 6.43 కోట్ల మంది ప్రభుత్వ సేవలను పొందారు. అయితే, ఇప్పటివరకు ఈ గ్రామ వార్డు సచివాలయాల ద్వారా ఒక్కరోజు వ్యవధిలో అత్యధికంగా 1.80 లక్షల సేవలను మాత్రమే అందజేసిన రికార్డు ఉండేది. కానీ, గత బుధవారం ఒక్కరోజే 2.88 లక్షల మంది వివిధ రకాల సేవలను వినియోగించుకున్నారని ఆ శాఖ అధికారులు వెల్లడించారు. నిజానికి.. ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్‌లో అదేరోజు సాంకేతిక సమస్యలు తలెత్తాయని.. అది లేకుండా ఉంటే సేవల సంఖ్య మరికొంత పెరిగేదని వారు తెలిపారు.

65 శాతానికి పైగా రెవెన్యూ సేవలే..

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గత మూడేళ్లలో ప్రజలకు అందించిన మొత్తం 6.43 కోట్ల ప్రభుత్వ సేవలు చూసినా.. ఈ నెల 25న పరిష్కరించిన 2.88 లక్షల వినతులను చూసినా.. అందులో 65–70 శాతం రెవెన్యూ శాఖకు సంబంధించినవే కావడం గమనార్హం. మూడేళ్ల క్రితం ఒక రైతు తన సొంత పొలం వివరాలను పాస్ పుస్తకంలోగానీ, రెవెన్యూ శాఖ మీ–భూమి రికార్డులోగానీ నమోదు చేసుకోవడానికి నానా ఇబ్బందులు పడేవారు. నెలల తరబడి మండలాఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పరిష్కారం కాని పరిస్థితి. లంచాల బెడద వీటికి అదనం. కానీ, ఇప్పుడు రెవెన్యూ రికార్డులో భూమి బదిలీకి సంబంధించి జరిగే మ్యూటేషన్ ప్రక్రియ వారి సొంత గ్రామాల్లోని గ్రామ సచివాలయాలోనే అత్యంత సులువుగా, ఇబ్బందులు లేకుండా నిర్ణీత గడువులోనే పూర్తిచేసి ఆ సమాచారాన్ని సంబంధిత యజమానికి మెసేజ్ పంపుతున్నారు. వ్యవసాయ భూములకు సంబంధించి ఈసీ జారీ కూడా సచివాలయాల ద్వారానే లభిస్తోంది. అలాగే, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు వంటి వాటికి గతంలో 30 రోజుల సమయం పట్టే పరిస్థితి ఉండగా.. ఇప్పుడు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సగటున ఐదు రోజుల వ్యవధిలో సంబంధిత తహసీల్దార్ ఆమోదం పూర్తయి, సర్టిఫికెట్లను కూడా సచివాలయాల్లోనే జారీచేస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ఈ నెల 25న అందజేసిన సేవలలో కూడా రెవెన్యూ సంబంధిత సేవలే ఎక్కువగా ఉన్నాయని అధికారులు వివరించారు. ప్రస్తుతం జగనన్న చేదోడు పథకం తుది లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్నందున ఆ రోజు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం ఎక్కువగా దరఖాస్తు చేసుకున్నారన్నారు.



సేవల సంఖ్య, నాణ్యతలో పెరుగుదల

ఇక గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటు సమయంలో అందుబాటులోకి తీసుకొచ్చిన సేవలకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం పరిమితం కాలేదు. ఈ మూడేళ్ల కాలంలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలకు తగ్గట్లుగా కొత్త సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అలాగే, సేవల నాణ్యత పెంచడానికి కూడా అనేక చర్యలు చేపట్టింది. ఉదా..

- ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ లబ్ధిదారుల ఆధార్ వివరాలతో అనుసంధానం చేసి అమలుచేస్తుండడంతో ప్రభుత్వం కొత్తగా సచివాలయాల్లో ఆధార్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది.
- రాష్ట్రంలోని ప్రతి ఐదు గ్రామ సచివాలయాల్లో ఒకచోట చొప్పున 2,377 సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. ఇప్పటిదాకా ఆధార్ సేవలు లేని ప్రాంతాలను గుర్తించి ఆయా సచివాలయాల్లోనే ముందుగా వీటిని ఏర్పాటుచేశారు.
- అలాగే, ఇళ్లు, భూ క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సేవలను సైతం ప్రభుత్వం సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకొచ్చే ప్రక్రియను చేపట్టింది. 1,537 సచివాలయాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం స్థానిక సిబ్బందికి శిక్షణ కూడా పూర్తిచేసింది. వీటిల్లో 51చోట్ల ఇప్పటికే ఆ సేవలు ప్రారంభమయ్యాయి.
- గత ఏడాది కాలంలో కొత్తగా మున్సిపల్ ప్రాంతాలకు సంబంధించి నీటి, ఆస్తిపన్నులు, ట్రాఫిక్ చలానాలు, రైతుల నీటి తీరువా బిల్లుల చెల్లింపులనూ ప్రభుత్వం సచివాలయాల పరిధిలోకి తీసుకొచ్చింది.

ప్రజల డబ్బు, సమయం ఎంతో ఆదా..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థకు నాంది పలికిన తర్వాత ప్రభుత్వంతో ఏ చిన్న పనిపడినా రోజుల తరబడి పట్టణ, మండల, జిల్లా కేంద్రాల్లోని ఆఫీసుల చుట్టూ తిరిగే పనిలేకుండా ప్రజల డబ్బు, సమయం ఎంతో ఆదా అవుతోంది. ప్రభుత్వ కార్యక్రమాల్లో పారదర్శకత పెరిగి లంచాలకు తావులేకుండా పోయింది. రాబోయే రోజుల్లో సచివాలయాల్లో మరిన్ని కొత్త సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోంది.
– బూడి ముత్యాలనాయుడు, ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ)

అడవి బిడ్డలపై మమకారం.. అడుగడుగునా సహకారం

- గిరిపుత్రులకు అండగా గిరిజన సహకార సంస్థ
- అటవీ ఫలసాయం, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర
- గిరిజన ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజ్
- వారి ఆదాయం పెంపే లక్ష్యంగా అడుగులు

సాక్షి, అమరావతి: అడవి బిడ్డల ప్రయోజనమే లక్ష్యంగా గిరిజన సహకార సంస్థ(జీసీసీ) సరికొత్త విప్లవం సృష్టిస్తోంది. రాష్ట్రంలో గిరిజనులు పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులు, అడవి నుంచి సేకరిస్తున్న ఫలసాయానికి మంచి ధర అందించేలా విస్తృత సేవలందిస్తోంది. చింతపండు, కరక్కాయ, నల్ల జీడిపిక్కలు, నారమామిడి బెరడు, కొండ చీపుర్లు, ముషిణి గింజలు, షీకాయ్, కుంకుడు కాయలు, కొండ తేనె, కానుగ విత్తనాలు, మారేడు గడ్డలు, తానికాయలు, రాజ్మా, వరి ధాన్యం, పసుపు కొమ్ములు, బొబ్బర్లు వంటి వాటిని గిరిజనుల నుంచి జీసీసీ సేకరిస్తోంది. వాటికి విలువను జోడించి మార్కెటింగ్ చేయడం ద్వారా బ్రాండ్ ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో ఫలసాయం, ఉత్పత్తుల కొనుగోలుకు జీసీసీ ప్రత్యేకంగా 26 గిరిజన సొసైటీల(జీసీసీ బ్రాంచి)ను ఏర్పాటు చేసింది. మరోవైపు 962 రేషన్ డిపోలు, వారపు సంతల ద్వారా మార్కెటింగ్ చేస్తోంది. ఇందుకోసం 250 మంది రెగ్యులర్, సుమారు 230 మంది కాంట్రాక్టు ఉద్యోగులు నిరంతరం సేవలందిస్తున్నారు. 962 రేషన్ డిపోలు, 11 సూపర్ బజార్ల ద్వారా నాణ్యమైన కిరాణా సామగ్రిని విక్రయిస్తున్నారు. 3,89,472 కార్డుదారులు జీసీసీ ద్వారానే నెలకు సుమారు రూ.118.99 లక్షల విలువైన నిత్యావసర సరుకులు పొందుతున్నారు. సేకరించిన అటవీ ఫలసాయం, వ్యవసాయ ఉత్పత్తులకు 'గిరిజన్' బ్రాండ్ పేరుతో మార్కెటింగ్ కార్యకలాపాలను విస్తరించడంలో దూకుడు పెంచింది. గిరిజనులకు సహకారం అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఫలితంగా 67 ఏళ్ల జీసీసీ ప్రస్థానంలో మూడున్నరేళ్లలోనే మేలైన.. మెరుగైన ఫలితాలు సాధిస్తోంది.

జీసీసీ చరిత్రలో మైలురాయి

తిరుమలలో శ్రీవారి అభిషేకానికి ఉపయోగించే తేనె, పసుపు వంటి వాటిని సరఫరా చేసేలా టీటీడీతో ఒప్పందం చేసుకోవడం జీసీసీ చరిత్రలోనే గొప్ప మైలురాయి. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలతోనూ ఒప్పందాలు చేసుకునేలా కార్యాచరణ సిద్ధం చేసింది. మరోవైపు కొత్త ఉత్పత్తులను సైతం తయారుచేసి వినియోగదారులకు అందుబాటులోకి తేనుంది. ఆర్గానిక్ డిటర్జెంట్ సబ్బులు, ఆర్గానిక్ హ్యాండ్ వాష్, ఆర్గానిక్ ఫ్లోర్ క్లీనర్ వంటి ఉత్పత్తుల తయారీపైనా దృష్టి పెట్టింది. అరకు ప్రాంతంలో పండిస్తున్న కాఫీ గింజలను బెంగళూరులో ప్రాసెసింగ్ చేయిస్తున్న జీసీసీ.. రానున్న రోజుల్లో అరకు ప్రాంతంలోనే ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని సంకల్పించింది. మారుమూల ప్రాంతాల్లో పెట్రోల్ బంక్‌లు, సూపర్ మార్కెట్లు వంటివి ఏర్పాటు చేయడంతో పాటు ఇతర రాష్ట్రాల మార్కెట్ పైనా కన్నేసింది. తద్వారా గిరిజన ఉత్పత్తులకు దేశవ్యాప్త మార్కెటింగ్ కల్పించడం ద్వారా అడవి బిడ్డల ఆదాయాన్ని పెంపొందించే దిశగా అడుగులేస్తోంది.

క్లుప్తంగా...

8,421 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి

- మరింత వేగంగా డ్రోన్, ఏరియల్ సర్వే చేసేందుకు చర్యలు
- ఫిబ్రవరిలో మరో 2 వేల గ్రామాల్లో భూ హక్కు పత్రాల పంపిణీకి సన్నాహాలు

సాక్షి, అమరావతి: భూముల రీ సర్వేలో డ్రోన్లతో భూమిని కొలిచే ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటివరకు 8,421 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయ్యింది. 15 రోజుల్లోనే 700 గ్రామాల్లో సర్వేను పూర్తి చేయడం విశేషం. సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన డ్రోన్లు 4,769 గ్రామాల్లో సర్వే పూర్తి చేయగా.. ప్రైవేటు ఏజెన్సీల డ్రోన్లు 3,652 గ్రామాల్లో సర్వేను పూర్తి చేశాయి. అత్యధికంగా విజయనగరం జిల్లాలో 807 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయ్యింది. మిగిలిన గ్రామాల్లో డ్రోన్, ఏరియల్ సర్వే చేసేందుకు.. సర్వే బృందాలు విస్తృతంగా పని చేస్తున్నాయి. మరోవైపు డ్రోన్ సర్వే పూర్తయిన 4,006 గ్రామాల ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్(చాయాచిత్రాలు)ను ఇప్పటికే విడుదల చేశారు. వీటితోనే సర్వే బృందాలు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాల్సి ఉంటుంది. డ్రోన్ చిత్రాల ఆధారంగా ఇప్పటికే 3,031 గ్రామాల్లో క్షేత్రస్థాయి నిజ నిర్ధారణ(గ్రౌండ్ ట్రూతింగ్)ను పూర్తి చేశారు. ఆయా గ్రామాల్లోని 3.58 లక్షల ఎకరాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయ్యింది. 975 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రస్తుతం జరుగుతోంది. చివరిగా నిర్వహించే గ్రౌండ్ వ్యాలిడేషన్‌ను కూడా 2,409 గ్రామాల్లో పూర్తి చేశారు. 622 గ్రామాల్లో ఈ ప్రక్రియ జరుగుతోంది. గ్రౌండ్ వ్యాలిడేషన్ పూర్తయిన గ్రామాల్లో 19,355 అభ్యంతరాలు రాగా.. వాటిలో 19,299 అభ్యంతరాలను మొబైల్ మెజిస్ట్రేట్ బృందాలు పరిష్కరించాయి. మొత్తంగా ఇప్పటి వరకు అన్ని దశల్లో రీ సర్వే పూర్తయిన గ్రామాలు 2,913 ఉన్నాయి. ఈ గ్రామాలకు సంబంధించి సర్వే పూర్తయినట్లు నంబర్ 13 నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఇంకా 1,800 గ్రామాల్లో కూడా నంబర్ 13 నోటిఫికేషన్లు జారీ చేసే దిశగా సర్వేను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి నెలలో మరో 2 వేల గ్రామాల్లో సర్వేను పూర్తి చేసి భూ హక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు రెవెన్యూ, సర్వే సెటిల్‌మెంట్ యంత్రాంగం కృషి చేస్తోంది.

నేను మూర్ఖుడిని

- యువగళం పాదయాత్రలో నారా లోకేశ్
- మా వారిపై కేసులు పెట్టిన అధికారులను వదిలిపెట్టం
- మేము కుప్పానికి పరిశ్రమలు తెచ్చాం



శాంతిపురం (చిత్తూరు జిల్లా): తాను మూర్ఖుడినని, తమ వారిపై కేసులు పెట్టిన అధికారులను వదిలి పెట్టేది లేదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. చక్రవడ్డీతో కలిపి రుణం తీర్చుకుంటామని అన్నారు. భయం తమ బ్లడ్‌లోనే లేదని అన్నారు. కేసులకు భయపడకుండా పోరాటం చేయాలని పార్టీ కార్యకర్తలకు చెప్పారు. లోకేశ్ యువగళం పాదయాత్ర శనివారం ఉదయం గుడుపల్లె మండలంలోని పీఈఎస్ ఆస్పత్రి వద్ద ప్రారంభమై సాయంత్రం శాంతిపురం మండలంలోని టి.కొత్తూరు క్రాస్ వద్ద ముగిసింది. ఆయన టీడీపీకి చెందిన కురబ, బీసీ నాయకుల సమావేశాల్లో, పలుచోట్ల రోడ్లపై మాట్లాడారు. తమ హయాంలో కుప్పంలో పరిశ్రమలు తెచ్చామని, 25వేల మందికి ఉపాధి కల్పించామని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక బీసీల కుల వృత్తులకు కావాల్సిన పరికరాలు ఇస్తామని, తొలి ఏడాదిలోనే అన్ని కులాలకు కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తామని అన్నారు. వ్యవసాయ బోర్లకు మీటర్ల పేరుతో రైతులకు ఉరి వేస్తున్నారని, అకౌంట్లలో వేస్తామన్న బిల్లు సొమ్ము గ్యాస్ సబ్సిడీలాగా తగ్గిపోతోందని విమర్శించారు. 80శాతం రైతులకు రుణమాఫీ చేసిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు.

చంద్రబాబు ఇచ్చిన 5లక్షల ఉద్యోగాలు చూపిస్తావా?

- టీడీపీ నేత లోకేశ్‌కు ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం సవాల్



సాక్షి, అమరావతి: రాష్ట్ర యువత గురించి మాట్లాడే అర్హత నీకు ఎక్కడిదంటూ టీడీపీ నేత నారా లోకేశ్‌ను ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ప్రశ్నించింది. బాబు వస్తేనే జాబు అంటూ యువతను, నిరుద్యోగులను నిండా ముంచేశారని మండిపడింది. విజయవాడలో శనివారం ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ మీడియాతో మాట్లాడుతూ.. ఫైబర్ నెట్, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర విభాగాలను అడ్డం పెట్టుకొని రూ.వందల కోట్లను దారి మళ్లించిన వ్యక్తి లోకేశ్ అని దుయ్యబట్టారు. యువత పేరు చెప్పి రాష్ట్ర ఖజానాను దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాల్లో చంద్రబాబును లోకేశ్ మించిపోయారని చెప్పారు. టీడీపీ హయాంలో తాను 40 వేల ఉద్యోగాలిస్తే.. తన తండ్రి 5 లక్షల ఉద్యోగాలిచ్చారంటూ సిగ్గు లేకుండా అసత్యాలు వల్లె వేస్తున్నారని దుయ్యబట్టారు. ఆ 5 లక్షల ఉద్యోగాలు ఎక్కడ, ఎవరికి ఇచ్చారో చూపించాలని లోకేశ్‌కు సవాల్ విసిరారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇచ్చిన లక్షలాది ఉద్యోగాలను, పర్మినెంట్ చేసిన ఉద్యోగులను లోకేశ్‌కు పాదయాత్ర మార్గంలోనే చూపిస్తామన్నారు.

పంగాసియస్.. కేరాఫ్ ఏపీ



సమృద్ధిగా పోషకాలు ● స్టార్ హోటళ్లలో మంచి డిమాండ్

సాగు.. దిగుబడిలోనూ ఏపీ నంబర్ వన్

- పశ్చిమ బెంగాల్‌కే మూడో వంతు చేపల ఎగుమతి
- ఏపీలోనే ఏకైక సీడ్ ఉత్పత్తి కేంద్రం
- ఏటా 50 లక్షల బ్రూడర్ సీడ్ ఉత్పత్తి

పంగాసియస్‌గా పిలిచే ఈ చేపకు వెన్ను ముల్లు తప్ప చూద్దామంటే మరో ఎముక కనిపించదు. పైగా నీచు వాసన రాదు. దీంతో చేసే ఏ వంటకమైనా చాలా మృదువుగా.. రుచికరంగా ఉంటుంది. తింటే ఇట్టే జీర్ణమైపోతుంది. పిల్లల నుంచి వృద్ధుల వరకు వీటిని ఇష్టపడని వారుండరు. అందుకే స్టార్ హోటల్స్‌తోపాటు సాధారణ హోటళ్లలోనూ ఈ చేప వంటకాలకు డిమాండ్ ఎక్కువ. అపోలో ఫిష్‌గా దీనిని ఎక్కువగా వండుతారు. వియత్నాంలో పుట్టిన ఈ చేపలు మన ప్రాంతంలో పెరిగే ఏటి జెల్లను పోలి ఉంటాయి. దేశీయంగా వీటిని పంగా, పంగస్, అపోలో, వెండి చేప అని కూడా పిలుస్తారు.



సాక్షి, అమరావతి: పంగాసియస్ చేపల సాగులోను.. అధిక దిగుబడులు సాధించడంలోను దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా 50 వేల హెక్టార్లలో ఈ చేపల్ని పెంచుతుండగా.. అందులో 20 వేల హెక్టార్లు మన రాష్ట్రంలోనే ఉండటం విశేషం. ఏటా 80 లక్షల టన్నుల పంగాసియస్ చేపలు ఉత్పత్తి అవుతుండగా.. వాటిలో 30నుంచి 35 లక్షల టన్నులు ఏపీ నుంచే దిగుబడి వస్తుండటం గమనార్హం. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, ఉభయ గోదావరి, కోనసీమ జిల్లాల్లో వీటి సాగు విస్తరించి ఉంది. స్థానికంగా ఈ చేపల వినియోగం కేవలం 2 శాతమే కాగా.. మిగిలిందంతా పొరుగు రాష్ట్రాలకే ఎగుమతి అవుతోంది. అత్యధికంగా పశ్చిమ బెంగాల్‌కు 10 లక్షల టన్నుల వరకు వెళుతోంది. బిహార్, ఒడిశా, ఉత్తర ప్రదేశ్, అస్సాం, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, జమ్మూ కశ్మీర్‌లోనూ వీటికి డిమాండ్ ఎక్కువే.

నీటిపైకి వచ్చి ఆక్సిజన్ తీసుకోగలవు

వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉండడంతో ఈ చేపలు ఎలాంటి తెగుళ్లు, వ్యాధులనైనా తట్టుకుంటాయి. మొప్పలు కాకుండా వీటికి ఉండే గాలి తిత్తుల ద్వారా గాలి పీల్చుకుంటాయి. నీటిలో ఆక్సిజన్ తగ్గినప్పుడు నీటి ఉపరితలానికి చేరి వాతావరణంలోని ఆక్సిజన్‌ను తీసుకుంటాయి. ఎలాంటి వాతావరణంలో అయినా చాలా ఆరోగ్యకరంగా పెరుగుతాయి. వేసిన ప్రతి పిల్ల బతకడం వీటి ప్రత్యేకత. రెండేళ్లలో మూడు పంటలు తీస్తున్నారు. గరిష్టంగా ఏడాది పాటు పెంచగలిగితే ఒక్కో చేప 3నుంచి 4 కేజీల వరకు పెరుగుతుంది. ఎకరాకు సైజును బట్టి 12 నుంచి 20 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

పోషకాలు పుష్కలం

ప్రొటీన్స్, ఐరన్, జింక్, కాల్షియం, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు సమృద్ధిగా ఉండే ఈ చేపల్లో కార్బోహైడ్రేట్స్, సోడియం తక్కువగా ఉంటాయి. 100 గ్రాముల చేపలో ప్రొటీన్ 15.2 గ్రాములు, కొవ్వు 2.9 గ్రాములు, కార్బోహైడ్రేట్స్, యాష్ గ్రాము, నీరు 60 గ్రాములు, 89 కిలో కేలరీల శక్తి లభిస్తుంది. హాని కల్గించే కొవ్వు పదార్థాలు తక్కువగా ఉండటం వల్ల గుండె సంబంధిత వ్యాధులను నివారిస్తుంది. అధికంగా ఉండే కాల్షియం ఎముకలు, కీళ్ల బలోపేతానికి, సేంద్రియ ఆమ్లాలు కంటిచూపు మెరుగుదలకు ఉపయోగపడతాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్‌ను నిరోధిస్తాయి.

బ్రూడర్ కేంద్రం ఏపీలోనే..

కేంద్రీయ మంచినీటి మత్స్య పరిశోధనా సంస్థ (భువనేశ్వర్)కు అనుబంధంగా కృష్ణా జిల్లా కానూరు వద్ద గల ప్రాంతీయ పరిశోధనా కేంద్రం పంగాసియస్ బ్రూడర్‌గా కేంద్రం గుర్తింపు పొందింది. 2013లో వియత్నాం నుంచి తీసుకొచ్చిన బ్రూడర్స్ ద్వారా తల్లి చేపలను ఉత్పత్తి చేసి కనీసం 4 ఏళ్లపాటు పెంచి పిల్లలను ఉత్పత్తి చేస్తూ వస్తున్నారు. ఇక్కడ ఉత్పత్తి అయిన 30-40 గ్రాముల సైజు పిల్లలను హేచరీలకు ఇస్తుంటారు. హేచరీల్లో మరో మూడేళ్ల పాటు సీడ్ ఉత్పత్తి జరుగుతుంది. ఏటా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సీడ్ ఉత్పత్తి చేస్తారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో 6 టన్నుల బ్రూడర్స్ ఉన్నాయి. ఏటా 100 లక్షల సీడ్ అవసరం కాగా.. 50 లక్షల సీడ్ ఈ కేంద్రం అభివృద్ధి చేసిన బ్రూడర్స్ నుంచే ఉత్పత్తి చేస్తారు. అపోలో ఫిష్‌గా, ఫిష్ స్టాటర్స్‌గా ఉపయోగించే ఈ చేపకు స్టార్ హోటల్స్ నుంచి సాధారణ హోటల్స్ వరకు డిమాండ్ ఎక్కువ. ఈ కారణంగానే వీటికి అపోలో ఫిష్ అనే పేరొచ్చింది.

పదేళ్లుగా ఇదే సాగు



పదేళ్లుగా వంద ఎకరాల్లో పంగాసియస్ సాగు చేస్తున్నా. మిగిలిన చేపలతో పోలిస్తే వీటి సాగులో ఏమాత్రం నష్టాలు ఉండవు. కేజీ, కేజీన్నర సైజులో చేపలు పట్టుబడి చేస్తా. ఎకరాకు 9నుంచి 12 టన్నుల వరకు దిగుబడులొస్తాయి. మంచి ఆదాయం వస్తుంది.

– ఉమాశంకర్‌రెడ్డి, రైతు, గుడివాడ, కృష్ణా జిల్లా

బ్రూడర్స్ ఉత్పత్తిలో..



పదేళ్లుగా పంగాసియస్ తల్లి చేపల(బ్రూడర్స్)ను ఉత్పత్తి చేస్తున్నాం. జన్యుపరమైన సమస్యలు లేకుండా వీటిని అభివృద్ధి చేసి హేచరీలకు ఇస్తున్నాం. వీటి సాగు, దిగుబడుల్లో ఏపీ మొదటి స్థానంలో ఉంది. 2013లో 200 బ్రూడర్స్ తీసుకొచ్చాం. ప్రస్తుతం 6వేల కిలోల బ్రూడర్స్ ఉన్నాయి.

– బి.శేషగిరి, ప్రిన్సిపల్ సైంటిస్ట్, ప్రాంతీయ మత్స్య పరిశోధనా కేంద్రం

మీకు ప్రాణభిక్ష పెట్టింది పోలీసులే

- ఆ విశ్వాసం మరిచి అసభ్యంగా తిడతారా?
- అచ్చెన్నాయుడుపై చిత్తూరు జిల్లా పోలీసు సంఘం ధ్వజం
- ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు



ఎస్పీ రిషాంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న పోలీసు సంఘం నేతలు

చిత్తూరు రూరల్/కుప్పం(చిత్తూరు జిల్లా)/తిరుపతి మంగళం: టీడీపీ నేత అచ్చెన్నాయుడికి ప్రాణభిక్ష పెట్టింది పోలీసులేనని.. ఆ విశ్వాసం మరిచి ఇప్పుడు అసభ్యకరంగా మాట్లాడుతున్నారని చిత్తూరు జిల్లా పోలీసు యూనియన్ అసోసియేషన్ ధ్వజమెత్తింది. కుప్పంలో శుక్రవారం జరిగిన నారా లోకేశ్ పాదయాత్రలో అచ్చెన్నాయుడు పోలీసులను అసభ్య పదజాలంతో దూషించడం పట్ల పోలీసు సంఘం నేతలు తీవ్రంగా మండిపడ్డారు. శనివారం వారు చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. సంఘం అధ్యక్షుడు ఉదయ్ మాట్లాడుతూ పోలీసులు భద్రత విషయంలో బాధ్యతగా వ్యవహరిస్తారన్నారు. ఆ విషయంలో దేశంలోనే రాష్ట్ర పోలీసుశాఖ మొదటిస్థానంలో ఉందన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం లోకేశ్ పాదయాత్రకు దాదాపు 700 మంది భద్రత సిబ్బందిని కేటాయించిందన్నారు. అచ్చెన్నాయుడు పోలీసులపై అసభ్య పదజాలంతో మాట్లాడడం సరికాదన్నారు. పోలీసులంతా తిండి కోసం రాలేదన్నారు. ఆయన సోదరుడు కూడా ఓ పోలీసు అధికారి అని.. ఈ మాట అతన్ని అడిగి మాట్లాడాలని సూచించారు. గతంలో అచ్చెన్నాయుడిని కొందరు చితకబాది పడేసుంటే.. ప్రాణభిక్ష పెట్టింది పోలీసులేనని గుర్తుచేశారు. ఇటీవల టీడీపీ నేతలంతా పోలీసులను తిట్టడం ఓ ఫ్యాషన్‌గా మార్చుకున్నారని మండిపడ్డారు. అచ్చెన్నాయుడు పోలీసులకు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డిని కలిసి అచ్చెన్నాయుడుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఖాదర్‌బాషా, శరవణ, రమేష్ పాల్గొన్నారు.

కించపరిచేలా మాట్లాడితే ఊరుకునేది లేదు..

కులమతాలు, అధికార, ప్రతిపక్ష పార్టీలు అన్న తేడా లేకుండా నిత్యం ప్రజాసేవే పరమావధిగా సేవలందిస్తున్న పోలీసులను ఎవరైనా కించపరిచేలా మాట్లాడితే సహించేదిలేదని పోలీసు అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సోమశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. తిరుపతిలో ఏపీ పోలీసు అసోసియేషన్ నాయకులు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పంలో అచ్చెన్నాయుడు పోలీసులపై చేసిన వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా, పోలీసుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయన్నారు. అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు శంకర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసులను లెక్కచేయకపోవడం వల్ల చంద్రబాబు సభల్లో 11 మంది ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. అచ్చెన్నాయుడును అరెస్ట్ చేసి పోలీసులకు క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు.

అచ్చెన్నపై కేసు ..

నారా లోకేశ్ పాదయాత్రలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో అచ్చెన్నాయుడు పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో కుప్పం పోలీసులు కేసు నమోదు చేశారని సీఐ శ్రీధర్ వెల్లడించారు. కుప్పం ఎస్‌ఐ శివకుమార్ చేసిన ఫిర్యాదు మేరకు సెక్షన్ 153 కింద పోలీసులు కేసు నమోదు చేశారన్నారు.

ఎస్ఈబీకి 16 మంది ఏఎస్పీల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 16 మంది ఏఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. వారికి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) బాధ్యతలు అప్పగించింది. ఇందుకు సంబంధించి డీజీపీ, ప్రభుత్వ ఎక్స్-అఫీషియో ముఖ్య కార్యదర్శి కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి శనివారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఏఎస్పీల వివరాలు ఇలా ఉన్నాయి..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పి.రామచంద్రరావు	విజయనగరం	అనకాపల్లి
ఎం.జయరాజు	కాకినాడ	కోనసీమ
వై.శ్రీనివాసచౌదరి	ఏలూరు	పశ్చిమ గోదావరి
ఎన్.సుర్జిత్‌సింగ్	విజయవాడ	బాపట్ల
టి.శ్రీనివాసరావు	గుంటూరు	మంగళగిరి
కె.శ్రీనివాసాచారి	కర్నూలు	నెల్లూరు
టి.విజయశేఖర్	కడప	అన్నమయ్య
సీహెచ్ మధుసూదనరావు	చిత్తూరు	నంద్యాల
కె.శ్రీనివాసులు	అనంతపురం	మంగళగిరి
కె.శ్రీలక్ష్మి	నెల్లూరు	చిత్తూరు
ఏటీవీ రవికుమార్	పశ్చిమ గోదావరి	ఏలూరు
కేపీ గోపాల్	పలాస	శ్రీకాకుళం
ఆర్.సుధాకర్	పార్వతీపురం	విజయనగరం
సతుపాటి రవికుమార్	గూడూరు	నెల్లూరు
ఎస్.రవికుమార్	పెనుకొండ	పుట్టపర్తి
జి.మధుసూదన్	మదనపల్లి	రాయచోటి

విచారణ పారదర్శకంగా జరగాలని కోరాం

- కడప ఎంపీ అవినాష్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఒక సాక్షిగా శనివారం సీబీఐ విచారణకు హాజరయ్యారు. విచారణ పారదర్శకంగా జరగాలని కోరారు. సీబీఐ అధికారులు సీఆర్‌పీసీ సెక్షన్ 160 (సాక్షిగా పిలవడం) కింద జారీ చేసిన నోటీసులను గౌరవిస్తూ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆయన కోఠిలోని సీబీఐ కార్యాలయానికి వచ్చారు. ఆయనతో పాటు న్యాయవాదులు తప్పెట నాగార్జునరెడ్డి, నాగిరెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కూడా ఉన్నారు. రాత్రి 7.30 గంటల వరకు అవినాష్‌రెడ్డి నుంచి సీబీఐ అధికారులు పలు అంశాలపై సమాచారాన్ని సేకరించారు. ఇదే సమయంలో అవినాష్‌రెడ్డి తరఫు న్యాయవాది తప్పెట నాగార్జునరెడ్డి సీబీఐ అధికారులను కలిశారు. అవినాష్‌రెడ్డి వాంగ్మూలాల నమోదు ప్రక్రియను మొత్తం వీడియో, ఆడియో రికార్డింగ్ చేయాలని కోరారు. ఈ కేసుకున్న సున్నితత్వం, వీడియో, ఆడియో రికార్డింగ్ చేయాల్సిన అవసరాన్ని, ఈ విషయంలో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను ఆయన సీబీఐ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే ఈ కేసులో మీడియా ట్రయల్ నిర్వహిస్తోందని, అందువల్ల వాంగ్మూల నమోదు ప్రక్రియను వీడియోగ్రఫీ చేయాలని గట్టిగా ఆయన పట్టుబట్టారు. ఓ వర్గం మీడియా అవినాష్‌ను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కథనాలు రాస్తోందని, అందువల్ల నిష్పాక్షిక దర్యాప్తులో భాగంగా వీడియో ఆడియో రికార్డింగ్ చేయడం తప్పనిసరి అని చెప్పారు. అవినాష్‌రెడ్డిని ఓ సాక్షిగా మాత్రమే విచారిస్తున్నామని, ఆయన పట్ల ఏ రకంగానూ అమర్యాదగా, అనుచితంగా వ్యవహరించడం లేదని న్యాయవాదులకు సీబీఐ అధికారులు చెప్పినట్లు తెలిసింది. వాంగ్మూలం నమోదు అనంతరం అవినాష్‌రెడ్డి సీబీఐ కార్యాలయం నుంచి బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. 'సీబీఐ దర్యాప్తు అధికారి అడిగిన ప్రశ్నలకు నాకు తెలిసిన మేర సమాధానాలు చెప్పాను. మళ్లీ అవసరమైతే పిలుస్తామని సీబీఐ అధికారులు చెప్పారు. వారు పిలిస్తే మళ్లీ విచారణకు హాజరవుతా. వారికి సహకరిస్తా. వారి సందేహాలను నివృత్తి చేస్తా' అని తెలిపారు. విచారణ పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతోనే న్యాయవాదిని అనుమతించాలని కోరామని చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన విచారణలో కొద్ది రోజులుగా ఓ వర్గం మీడియా విపరీతంగా వక్రీకరణలు చేస్తోందన్నారు. వాస్తవాలను, వార్తలను వక్రీకరించి దర్యాప్తును తప్పుదోవ పట్టించేలా, వ్యక్తిత్వ హననం చేసే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. ఇకపై ఇలాంటివి జరగకూడదనే వీడియో, ఆడియో రికార్డింగ్‌తోపాటు న్యాయవాదిని అనుమతించాలని కోరామన్నారు.

అజ్మీర్ దర్గాలో ప్రభుత్వం తరఫున చాదర్ సమర్పణ



దర్గాలో చాదర్ సమర్పిస్తున్న ఏపీ బృందం

సాక్షి, అమరావతి: అజ్మీర్‌లోని ఖాజా గరీబ్ నవాజ్ దర్గాలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వక్ఫ్‌బోర్డు సభ్యుడు అబ్దుల్ బషీరుద్దీన్ శనివారం చాదర్ సమర్పించారు. అజ్మీర్‌లో 811వ ఉరుసు మహోత్సవం ఆదివారం నిర్వహించనున్న నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం తరఫున ఈ చాదర్ సమర్పించారు. ఇందుకోసం రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా ప్రతినిధి బృందాన్ని పంపించారు. చాదర్ సమర్పించిన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, ఏపీలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావాలని ప్రార్థించినట్లు వారు తెలిపారు.

యువ గరళం.. టీడీపీకి మంగళం

- ఐరన్ లెగ్ ఎఫెక్ట్‌తో తారకరత్న పరిస్థితి విషమం
- అచ్చెన్నాయుడి వ్యాఖ్యలు టీడీపీ పతనానికి నాంది
- మీరంతా జగన్నాథ రథ చక్రాల కిందపడి నలిగిపోక తప్పదు
- అంతా గందరగోళం.. తింగరి మేళం
- చంద్రబాబు సైకో.. నారా లోకేశ్ ఐరన్ లెగ్ సైకో
- నోరు అదుపులో పెట్టుకోకపోతే అచ్చెన్న నాలుక కోస్తాం
- మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, రోజా, నారాయణ స్వామి

గుంటూరు ఎడ్యుకేషన్/ సాక్షి, విశాఖపట్నం/ శ్రీరంగరాజపురం/ చిలకలూరిపేట: 'యువగళం పేరుతో నారా లోకేశ్ చేపట్టిన పాదయాత్రతో టీడీపీ భూ స్థాపితం కానుంది. లోకేశ్‌ది ఐరన్ లెగ్. ఆ లెగ్ ఎఫెక్ట్‌తో తారకరత్న పరిస్థితి విషమంగా ఉంది. లోకేశ్‌కు ఏ విషయంపైనా కూడా స్పష్టత లేదు. అంతా గందరగోళం.. తింగరి మేళం. లోకేశ్ రాజకీయాల్లోకి వచ్చింది మొదలు టీడీపీకి అన్నీ అపశకునాలే' అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, పర్యాటక శాఖ మంత్రి రోజా, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. శనివారం వారు వేర్వేరు చోట్ల మీడియాతో మాట్లాడారు.

అది గరళం అని త్వరలోనే తెలుస్తుంది



నారా లోకేశ్ యువగళం టీడీపీని భూస్థాపితం చేస్తుంది. పాదయాత్ర కొంత దూరం పోయిన తర్వాత అది యువగళమో లేక యువగరళమో అనేది ప్రజలకు తెలుస్తుంది. లోకేశ్ ఒక్కడే కాకుండా చంద్రబాబు సైతం ఆ గరళాన్ని తాగుతారు. లోకేశ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టగానే టీడీపీ 23 సీట్లకు పరిమితమైపోయింది. పాదయాత్రలో పాల్గొన్న తొలి రోజే ఆస్పత్రి పాలైన నందమూరి తారకరత్న పరిస్థితి విషమంగా ఉండటం బాధాకరం. నారా కుటుంబ రాజకీయాలకు బలవ్వడం తప్ప, నందమూరి కుటుంబానికి మిగిలేది ఏదీ లేదు. లోకేశ్, బాబు దత్త పుత్రుడు పవన్‌కళ్యాణ్‌లు బఫూన్‌లు. ఒకాయన పాదయాత్రతో వచ్చినా, మరొకరు వారాహి మీద వచ్చినా అంతా హాస్యమే. పవన్ నానమ్మ దేవుడి దగ్గర దీపం వెలిగిస్తే, దాంతో ఆయన తండ్రి సిగరెట్ వెలిగించుకున్న హేతువాది అన్నారు. ఇది నిజమో, అబద్ధమో చిరంజీవి, నాగబాబు సమాధానం చెప్పాలి. అచ్చెన్నాయుడు పోలీసులను ఉద్దేశించి చాలా దారుణంగా బూతులు మాట్లాడటం టీడీపీ పతనానికి నాంది. ఎంత మంది కలిసొచ్చినా జగన్నాథ రథ చక్రాల కింద పడి నలిగి పోవాల్సిందే.

– అంబటి రాంబాబు, జల వనరుల శాఖ మంత్రి


పథకాలను ఆపేస్తామని చెప్పే ధైర్యం ఉందా?



ఏ విషయంలోనూ స్పష్టత లేకుండా పాదయాత్ర చేస్తున్న వ్యక్తిగా నారా లోకేష్ చరిత్రలో నిలిచి పోతారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పాలనలో రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. లోకేశ్ పాదయాత్రలో అమ్మ ఒడి పథకం అవసరం లేదని చెప్పగలరా? రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, ఆరోగ్యశ్రీ పథకాలేవీ రాష్ట్ర ప్రజలకు వద్దని చెప్పే ధైర్యం ఉందా? నాడు- నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేయాల్సిన అవసరం లేదని చెప్పగలరా? కనీసం వారి సీఎం అభ్యర్థి ఎవరో లోకేశ్ చెబుతారా? ఏమీ చెప్పలేరు. అంతా గందరగోళం. వైఎస్సార్, వైఎస్ జగన్‌ల పాదయాత్రలు చరిత్రలో నిలిచిపోయాయి.

– విడదల రజిని, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

అచ్చెన్నా.. నోరు అదుపులో పెట్టుకో



అచ్చెన్నాయుడూ.. నోరు ఉంది కదా అని ఎలా పడితే అలా మాట్లాడితే నాలుక కోస్తా. గతంలో పార్టీ లేదు.. బొక్కా లేదు.. లోకేశ్ రాజకీయానికి పనికిరాడు.. తినడం తప్ప రాజకీయ పరిణతి లేదని మీరు చెప్పలేదా? పోలీస్ వ్యవస్థపై, సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి.

– నారాయణస్వామి, డిప్యూటీ సీఎం

ఐరన్‌లెగ్ సైకో



మహిళలు, ప్రజల ప్రాణాలపై కనీస గౌరవం లేని చంద్రబాబు సైకో అయితే.. ఆయన కుమారుడు లోకేశ్ అలియాస్ పులకేశ్ ఐరన్‌లెగ్ సైకో. లోకేశ్ గోదావరి పుష్కరాలకు వెళ్లి.. 29 మందిని పొట్టన పెట్టుకున్నారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో వాళ్ల నాన్న చంద్రబాబుకు ఓటుకు నోటు కేసులో నోటీసులు వచ్చాయి. పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరించిన రోజు చంద్రబాబు రోడ్‌షోలో తొక్కిసలాట జరిగి 8 మంది మృతి చెందారు. ఈ ఐరన్‌లెగ్ రాష్ట్రమంతటా పాదయాత్ర చేస్తే ఏం జరుగుతుందోనని ప్రజలంతా భయపడుతున్నారు.

– ఆర్కే రోజా, పర్యాటక శాఖ మంత్రి

● తెలంగాణ

26న కొలకలూరి పురస్కారాల ప్రదానం

సాక్షి, హైదరాబాద్: కొలకలూరి పురస్కారాలను వచ్చే నెల 26వ తేదీన ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. మూడు కేటగిరీల్లో పురస్కారాలను అందచేస్తామని, ఒక్కో పురస్కారానికి రూ.15 వేలతో పాటు మెమెంటోతో సత్కరిస్తామని కొలకలూరి మధుజ్యోతి, కొలకలూరి సుమకిరణ్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కవితా విభాగంలో 'పచ్చి కడుపు వాసన' కవితా సంపుటి రాసిన యార్లగడ్డ రాఘవేంద్రరావుకు రూ.15 వేలతో పాటు సత్కారం, 'ఇక ఇప్పుడు' కవితా సంపుటి రాసిన కటుకోజ్వల ఆనందాచారికి రూ. 5వేలతో పాటు సత్కారం ఉంటుందన్నారు. నాటక విభాగంలో 'ఆకెళ్ల నాటికలు' నాటికా సంపుటి రాసిన ఆకెళ్ల వెంకట సూర్యనారాయణకు రూ.15 వేలతో పాటు సత్కారం, మూడో విభాగంలో 'తెలంగాణ కథ- వర్తమాన జీవన చిత్రణ' పరిశోధన గ్రంథానికి డాక్టర్ ఎం.దేవేంద్రకు రూ.15 వేలతో పాటు సత్కారం 'రాచపాళెం- సాహిత్య విమర్శ- సమగ్ర అధ్యయనం' పరిశోధన గ్రంథానికి డాక్టర్ ఏఏ నాగేంద్రకు రూ.5 వేలతో పాటు సత్కారం ఉంటుందని వారు వివరించారు.

సర్వీస్ మ్యాటర్ మాట్లాడేందుకే వెళ్లాను..

బంజారాహిల్స్ (హైదరాబాద్): తనతో పాటు మరో తొమ్మిది మంది డిప్యూటీ తహసీల్దార్ల పదోన్నతి విషయంపై మాట్లాడేందుకే ముఖ్యమంత్రి కార్యాలయ సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌ను కలిసేందుకు ఆమె క్వార్టర్‌కు వెళ్లినట్లు మేడ్చల్ జిల్లా పౌర సరఫరాల శాఖ మాజీ డిప్యూటీ తహసీల్దార్ చెరుకు ఆనంద్‌కుమార్‌రెడ్డి శనివారం పోలీస్ కస్టడీలో వెల్లడించారు. సర్వీస్ మ్యాటర్ డిస్కస్ చేసేందుకే ఆమె ఇంటికి వెళ్లానని చెప్పిన ఆనంద్‌కుమార్, అర్ధరాత్రి ఎందుకు వెళ్లావని పోలీసులు అడిగిన ప్రశ్నకు సమాధానం దాటవేశారు. 1999లో గ్రూప్-2కు సెలెక్ట్ అయిన మొత్తం ఉమ్మడి రాష్ట్ర 26 మంది అభ్యర్థుల పోస్టింగ్‌లు కోర్టు వివాదంతో రద్దయ్యాయి. అయితే 2018లో కోర్టు జోక్యంతో మొత్తం 26 మందికి డిప్యూటీ తహసీల్దార్లుగా పోస్టింగ్‌లురాగా, ఇందులో 16 మందిని ఏపీకి కేటాయించారు. మిగతా పది మందికి తెలంగాణలో పోస్టింగ్‌లురాగా అందులో ఆనంద్‌కుమార్ కూడా ఒకరు. అయితే ఏపీలో 16 మందికి తహసీల్దార్లుగా ప్రమోషన్లు రాగా తెలంగాణలో మాత్రం నాలుగేళ్లు గడుస్తున్నా ఇంకా డీటీలుగానే ఉన్నామని, ఈ విషయం పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఆనంద్‌కుమార్ వెల్లడించినట్లు తెలుస్తున్నది. సీఎంవోలో కీలక బాధ్యతల్లో ఉన్న స్మితా సబర్వాల్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తే సీఎంతో మాట్లాడి న్యాయం చేస్తారన్న ఉద్దేశంతోనే కలవడానికి వెళ్లినట్లుగా చెప్పాడు. అయితే ఆమెను కలవడానికి క్వార్టర్‌కు వెళ్లడం ఒక తప్పయితే, అర్ధరాత్రి వెళ్లడం మరో తప్పని పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆనంద్ కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేసిన విషయం కూడా విదితమే. ఇదిలా ఉండగా బంజారాహిల్స్ రోడ్ నెం.12లో నీలోఫర్ ఛాయ్ తాగుదామని తనను మేడ్చల్‌నుంచి తీసుకొచ్చాడని స్మితా సబర్వాల్ ఇంటికి వెళ్లే విషయం తనకు తెలియదని, తనను అనవసరంగా ఇందులో ఇరికించాడని మరో నిందితుడు కొత్త బాబు కస్టడీలో పోలీసులకు వెల్లడించాడు.



> జ్ఞానము లేనివారు దేవుని విసర్జించి నాశనమగుదురు.
> బుద్ధిహీనులు క్షేమము కలిగినదని మైమరచి నిర్మూలమగుదురు.
> – క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.అష్టమి ప.2.02 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** భరణి రా. 12.52 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** ఉ.10.15 నుండి, 11.50 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.20నుండి 5.04 వరకు, **అమృతఘడియలు:** రా.7.54 నుండి 8.34 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.49
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

రాజ్‌కుమార్ సంతోషీ (డైరెక్టర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

"మూడేళ్ల క్రితం... ఇదే రోజు... జనవరి 29న... గాంధీజీ హత్య జరగడం గురించి ఒకానొక అనాలోచనలో నేను పడకపో యుంటే, ఇప్పడిలా ఏకాకిగా ఆలోచనలో పడే అవసరమే ఉండకపోయేది హిరానీజీ.." అన్నాను.. నిట్టూరుస్తూ.

మున్నాభాయ్ ఎంబీబీఎస్, లగేరహో మున్నాభాయ్, త్రీ ఇడియట్స్, పీకే, సంజూ... అన్నీ హిట్‌లే హిరానీవి.

'గాంధీజీ హత్య జరిగింది 30న కదా సంతోషీజీ..' అన్నారు హిరానీ.

"హత్య జరిగింది 30నే హిరానీజీ. కానీ జరిగిన హత్య గురించి నేను అనాలోచనలో పడింది 29న అని చెప్పడం నా ఉద్దేశం. నన్ను అర్థం చేసుకోడానికి కాస్త ప్రయత్నించండి.." అన్నాను ఆవేదనగా.

హిరానీని నేను ఈ ఉదయం ఇంటికి ఆహ్వానించింది కూడా ఆయన నన్ను అర్థం చేసుకుంటారనే. ఆయన కాకుండా ఈ సమయంలో నన్ను అర్థం చేసుకోగలవారు మరొకరున్నారు కానీ, వారిని గాడ్సే అనేవారు.



నేను జన్మించడానికి ఎనిమిదేళ్ల ముందే తుపాకీతో కాల్చి చంపేశారు.

"హిరానీజీ.. చూశారుగా.. 'గాంధీ గాడ్సే : ఏక్ యుద్ధ్'.. డిజాస్టరస్! థియేటర్‌లలో జనమే లేరు. మూడేళ్ల క్రితం ఆ రోజున కనుక నేను నా అనాలోచనతో గాంధీజీపై క్రియేటివ్‌గా ఒక సినిమా తీయాలని అనుకుని ఉండకపోతే, ఇప్పుడిలా.. ఎందుకు తీశానా అని ఆలోచనలో పడవలసి వచ్చేది కాదేమో కదా.." అన్నాను.

"గాంధీజీపై క్రియేటివ్‌గా సినిమా తీయాలని అనుకోవడం అనాలోచన ఎలా అవుతుంది సంతోషీజీ. నేననుకోవడం సినిమాకు మీరు ఎంపిక చేసుకున్న టైటిల్‌లోనే అనాలోచన ఉండి ఉంటుందని. 'గాంధీ గాడ్సే : ఏక్ యుద్ధ్' అని కదా అన్నారు. ఎవరైనా గాడ్సే పక్కన గాంధీజీని కానీ, గాంధీజీ పక్కన గాడ్సేని కానీ పెడతారా చెప్పండి? టైటిల్‌లో ఇంకొక అనాలోచన కూడా నాకు కనిపిస్తోంది. 'ఏక్ యుద్ధ్' అన్నారు. గాంధీజీ అసలు యుద్ధాలు చేసే మనిషా ఏమైనా?! ఆయన మహాత్ముడు అనే సంగతిని మనం మరచిపోయామా!!" అన్నారు హిరానీ.

"సరే చెప్పండి. ఎక్కడ దెబ్బ పడిందంటారు?" అని అడిగాను.

"గాంధీజీని గాడ్సే తుపాకీతో కాల్చాక గాంధీజీ అక్కడికక్కడే నేలకొరిగి కన్నుమూశారు. ఆ తర్వాత గాడ్సేని జైల్లో పెట్టారు. కానీ మీరు మీ సినిమాలో గాంధీజీని బతికించి, జైల్లో ఉన్న గాడ్సేని పరామర్శించేందుకు గాంధీజీ వెళ్లినట్లుగా చూపించారు. అక్కడితో మీరు ఆగిపోలేదు. జైల్లో వాళ్లిద్దరి మధ్యా డిబేట్ నడిపించారు.." అన్నారు హిరానీ.

"కానీ ఇదొక క్రియేటివ్ థాట్ కదా హిరానీ! గాంధీజీ ఆ రోజు మరణించకుండా ఉంటే ఎలా ఉండేది అనే యాంగిల్‌లో తీసిన సినిమా..." అన్నాను.

"క్రియేటివిటీనే అనుకోండి. అయితే జనవరి 30కి ముందు కూడా గాంధీజీపై హత్యాయత్నాలు జరిగి ఆయన తప్పించుకోలేదా? ఆ తర్వాత గాంధీజీ తరఫున, గాంధీజీని హత్యచేయబోయిన వారి తరఫున దేశంలో జరిగినవన్నీ డిబేట్‌లే కదా.. మళ్లీ మన డిబేట్ ఎందుకు?" అన్నారు హిరానీ!

నేను మౌనంగా ఉన్నాను.

"ఫీల్ అవకండి సంతోషీజీ.. ఒక్కోసారి అంతే. ఘాయల్, దామిని, ఘాతక్, చైనా గేట్, పుకార్.. ఎన్ని గొప్ప సినిమాలు తీశారు మీరు!" అన్నారు హిరానీ. గొప్ప చిత్రాలు అన్నారే గానీ, హిట్ చిత్రాలు అనలేదు.

హిరానీ వెళ్లిపోయాక, పదహారేళ్ల క్రితం గాంధీజీపై ఆయన తీసిన 'లగేరహో మున్నాభాయ్'ని ప్లే చేసి గమనించాను. టైటిల్‌లో గాంధీజీ లేరు. సినిమాలో కూడా ఒక భ్రాంతిగా తప్ప గాంధీజీ లేరు.

చనిపోయిన గాంధీజీని నేను బతికిస్తే.. గాంధీజీని కాకుండా గాంధీజీ విలువల్ని హిరానీ బతికించారు!

అది నచ్చినట్లుంది ఆడియన్స్‌కి.

హైపర్ బాబు – సుడిగాలి పవర్!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

''తమ కార్యంబు బరిత్యజించియు బరార్థ ప్రాపకుల్ సజ్జనుల్, తమ కార్యంబు ఘటించుచున్ బర హితార్థ వ్యాపృతుల్ మధ్యముల్, తమకై యన్య హితార్థ ఘాతుక జనుల్ దైత్యుల్, వృథాన్యార్థ భంగము గావించెడి వారలెవ్వరొ యెఱుంగన్ శక్యమే యేరికిన్?''

భర్తృహరి సంస్కృతంలో రాసిన సుభాషితాలకు ఏనుగు లక్ష్మణకవి చేసిన తెలుగు సేతలో ఒక పద్యం ఇది. సొంత పనిని పక్కన పెట్టయినా సరే అవసరంలో ఉన్నవారికి తోడ్పడేవాడు సజ్జనుడు. తన పని చేసుకుంటూనే ఇతరులకు కూడా తోడ్పడేవాడు మధ్యముడు. తన స్వార్థం కోసం ఇతరులను పణంగా పెట్టేవాడు దైత్యుడు... అంటే రాక్షసుడు అని ఈ సుభాషితానికి అర్థం.

ఎన్టీ రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో తన తదుపరి స్థానం తన వారసుడైన లోకేశ్‌బాబుకే దక్కాలనేది చంద్రబాబు సంకల్పం. కానీ ఆ పార్టీలోని దిగువశ్రేణి కార్యకర్తల నుంచి నాయకుల దాకా ఈ వ్యవహారం మింగుడుపడటం లేదనేది బహిరంగ రహస్యం. ఆయనకు నాయకత్వ ప్రతిభ లేనే లేదని పార్టీ శ్రేణుల ఏకాభిప్రాయం. ఈ పూర్వరంగంలో ఎల్లో మీడియా రుషిపుంగవులు చంద్రబాబు చెవిలో ఒక తరుణోపాయాన్ని ఉపదేశించారట. కాశీయాత్ర చేసి గంగలో మునకేస్తే చేసిన పాపాలన్నీ కొట్టుకొని పోయి పుణ్యాత్ముడుగా తిరిగి వస్తారన్న నమ్మకం పూర్వకాలంలో ఉండేది. అలాగే, ''మన లోకేశ్‌బాబును రోడ్ల వెంట నడిపిస్తే ఎల్లో మీడియా ప్రతిరోజూ టాప్ న్యూస్‌గా ప్రచారంలో పెడుతుంది. ఏడాది తిరిగేసరికల్లా నాయకుడిగా తయారుచేసే బాధ్యత మాదేన''ని విశ్వామిత్రుడు దశరథ మహారాజుకు ఇచ్చినంత గట్టి హామీని ఇచ్చారట!

ఇంతవరకు బాగానే ఉన్నది. లోకేశ్‌బాబు పాదయాత్ర అనుకున్నట్టుగానే ప్రారంభమైంది. పది అడుగులు పడ్డాయో లేదో, లోకేశ్ వెనకనే నడుస్తున్న నందమూరి తారకరత్న దురదృష్టవశాత్తు కుప్పకూలిపోయాడు. వెంటనే స్పృహ కూడా కోల్పోయాడు. పరిస్థితి కొంత విషమంగా ఉన్నట్టు అర్థమౌతూనే ఉన్నది. అయినా లోకేశ్ వెనక్కి తిరిగి చూడకుండా ముందుకే కదిలారు. నందమూరి వారసుడూ, ఎన్టీఆర్ మనుమడూ మీకు సంఘీభావం ప్రకటించడానికి వచ్చి ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు, మీ కార్యక్రమాన్ని కాస్సేపు పక్కన పెట్టడం సంస్కారం కదా? కనీసం సాయంత్రం జరిగే సభనైనా రేపటికి వాయిదా వేద్దామని కొందరు సూచించారట. జనసమీకరణ కోసం పేమెంట్లు కూడా పూర్తయినందున ఆపేయలేమని నిర్వాహకులు అంగీకరించలేదు. ఏడాదిపాటు చేయవలసిన పాదయాత్రకు ఆదిలోనే అపశ్రుతి దొర్లినందున కనీస సంస్కారాన్నయినా ప్రదర్శించి ఉంటే ఎంతోకొంత ప్రాయశ్చిత్తం లభించేదేమో. భర్తృహరి వర్గీకరణ ప్రకారం ఈ రకమైన కుసంస్కారం దైత్యుల కిందకు వస్తుందా? ఇంతకంటే కఠినమైన మాటను ఉపయోగించాలా?

పూర్వకాలంలో రాజులు దండయాత్రలు చేసినట్టే ప్రస్తుత కాలంలో రాజకీయ నాయకులు రథయాత్రలు, పాదయాత్రలు చేయడం రివాజుగా మారింది. ఇందులో తప్పులెన్నవలసిన అవసరం కూడా లేదు. రథ గజ తురగ పదాతి తదాది యాత్రికులందరినీ స్వాగతించవలసినదే. విరాట రాజకుమారుడూ – ప్రగల్భ వీరుడైన ఉత్తర కుమారుడు మహావీరులైన కౌరవ సేనపైకి యుద్ధానికి వెళ్తానంటే ఎవరు అడ్డుకున్నారు? అంతఃపుర కాంతలు ఆశీర్వచనాలు చెప్పి హారతులు కూడా ఇచ్చారు. బృహన్నల రూపంలో ఉత్తర కుమారుడికి ఓ తోడు దొరకడం వేరే కథ. ఇక్కడ అప్రస్తుతం. లోకేశ్‌బాబు పాదయాత్రకు కూడా ఆలయాల్లో ఆశీర్వచనాలు, అంతఃపురంలో హారతులు, వీరతిలకాలు వగైరాలన్నీ సమకూరాయి. ఈ పాదయాత్రలో తాను ఒంటరిని కాదనీ, పవన్ కల్యాణ్ వారాహి రథయాత్ర కూడా తన వెంట తోడుగా ఉంటుందనీ పరోక్షంగానైనా సభాముఖంగానే ప్రకటించారు. వారాహినీ, యువగళాన్నీ ఆపలేరంటూ గట్టిగా హెచ్చరించి రాష్ట్ర ప్రభుత్వాన్ని గజగజలాడించేందుకు లోకేశ్‌బాబు శక్తి మేరకు ప్రయత్నించారు. రిపబ్లిక్ డే నాడు అచ్చుగుద్దినట్టు ఇదే ప్రయత్నాన్ని పవన్ కల్యాణ్ కూడా చేశారు. 'ఎవడ్రా నా వారాహిని ఆపేది'ని ఆయన గర్జించారు. నాటకాల్లో రాజు వేషం వేసే నటుడు గట్టిగా చప్పట్లు చరిచి 'ఎవరక్కడ?' అంటాడు. ఎవరూ రారు. ఇదీ అంతే! వారాహిని అడ్డుకుంటామని అధికార పార్టీ వారు గానీ, ప్రభుత్వంలోని వారుగానీ ఎవ్వరూ అనలేదు. పైపెచ్చు స్వాగతించినట్టున్నారు కూడా!

మనసు నిండా మాలిన్యం నింపుకొని గంగలో మునకేసినంత మాత్రాన ఎవరూ పవిత్రులు కాలేరు. సహజంగా నాయకత్వ లక్షణాలున్న వారిని, ప్రజల పట్ల అంకితభావం, సమాజంపై ప్రేమ ఉన్నవారిని పాదయాత్రలు మరింత సానబడతాయి. అంతే తప్ప అసమర్థుడిని సమర్థుడిగా మలచలేవు. లోకేశ్‌బాబు పాదయాత్ర నేపథ్యంలో ఆయనను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో పోల్చడానికి ఎల్లో మీడియా తెగ ప్రయాస పడిపోతున్నది. కొంతమంది తటస్థులమని చెప్పు

> లోకేశ్‌బాబు పాదయాత్ర అనుకున్నట్టుగానే ప్రారంభమైంది. పది అడుగులు పడ్డాయో లేదో, లోకేశ్ వెనకనే నడుస్తున్న నందమూరి తారకరత్న దురదృష్టవశాత్తు కుప్పకూలిపోయాడు. వెంటనే స్పృహ కూడా కోల్పోయాడు. పరిస్థితి కొంత విషమంగా ఉన్నట్టు అర్థమౌతూనే ఉన్నది. అయినా లోకేశ్ వెనక్కి తిరిగి చూడకుండా ముందుకే కదిలారు. నందమూరి వారసుడూ, ఎన్టీఆర్ మనుమడూ మీకు సంఘీభావం ప్రకటించడానికి వచ్చి ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు, మీ కార్యక్రమాన్ని కాస్సేపు పక్కన పెట్టడం సంస్కారం కదా? కనీసం సాయంత్రం జరిగే సభనైనా రేపటికి వాయిదా వేద్దామని కొందరు సూచించారట. జనసమీకరణ కోసం పేమెంట్లు కూడా పూర్తయినందున ఆపేయలేమని నిర్వాహకులు అంగీకరించలేదు. ఏడాది పాటు చేయవలసిన పాదయాత్రకు ఆదిలోనే అపశ్రుతి దొర్లినందున కనీస సంస్కారాన్నయినా ప్రదర్శించి ఉంటే ఎంతోకొంత ప్రాయశ్చిత్తం లభించేదేమో. భర్తృహరి వర్గీకరణ ప్రకారం ఈ రకమైన కుసంస్కారం దైత్యుల కిందకు వస్తుందా? ఇంతకంటే కఠినమైన మాటను ఉపయోగించాలా?

కునే విశ్లేషకులు కూడా వీరి మాయలో పడిపోతున్నారు. ఇద్దరి మధ్యన ఉన్న హస్తిమశ కాంతారాన్ని గుర్తించకపోవడం కళ్లకు గంతలు కట్టుకోవడంతో సమానం.

తాతగారు నిర్మించిన పార్టీని నాన్నారు కబ్జా చేస్తే, ఆ కబ్జాను వంశపారంపర్యం చేసుకోవడానికి తండ్రి చాటున నిలబడి, ఎల్లో మీడియా నీడలో ఆపసోపాలు పడుతున్నవారు లోకేశ్‌బాబు. సొంతంగా పార్టీని నిర్మించుకొని తొమ్మిదేళ్లపాటు అధికార పీఠాలకు, గోబెల్స్ మీడియాలకు ఎదురొడ్డి పోరాడి, ఒంటిచేత్తో తన పార్టీని విజయ తీరాలకు చేర్చిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి. తండ్రి ముఖ్యమంత్రిగా ఉండి, తన చేతికో మూడు కీలక శాఖల్ని అప్పజెప్పి, అప్రకటిత నెంబర్ టూగా చలామణి చేసినా ఎమ్మెల్యేగా గెలవలేక చతికిలబడిన గతం లోకేశ్‌బాబుది. అధినేత్రి అహంభావానికి నిరసనగా ఆ పార్టీ టిక్కెట్‌పై లభించిన పార్లమెంట్ సభ్యత్వాన్ని గడ్డి పరకలా విసిరేసి, స్వతంత్రంగా నిలబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ధనప్రవాహం, శత్రు మీడియాలను తట్టుకొని అఖండ మెజారిటీతో జాతీయ రికార్డులను బద్దలుకొట్టిన చరిత్ర జగన్‌మోహన్‌రెడ్డిది.

వారసత్వ రాజకీయాల కోటాలో లోకేశ్‌తోపాటు జగన్‌మోహన్‌రెడ్డిని కూడా చేర్చడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. వీరిలో బీజేపీ వగైరా పార్టీలతోపాటు విశ్లేషకులమని చెప్పుకునేవారు కూడా కొందరున్నారు. ఇందుకు కారణం వారి అజ్ఞానమైనా కావచ్చు లేదా ఉద్దేశపూర్వకంగా విషం చిమ్మడమైనా కావచ్చు. తండ్రిగారు ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ తరఫున జగన్‌మోహన్‌రెడ్డి లోక్‌సభకు ఎన్నికైన విషయం వాస్తవం. గెలిచిన నాలుగు నెలలకే వైఎస్సార్ మరణించారు. ఆ తర్వాత ఏడాదిపాటు కాంగ్రెస్ నాయకత్వంతో ఒకపక్క పోరాడుతూనే మరోపక్క ఓదార్పు యాత్ర చేయవలసి వచ్చింది. చివరకు పార్టీ నుంచే నిష్క్రమించవలసి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఎంపీగా నిండా ఏడాదిన్నర కూడా ఆయన లేరు. ఆ పదవికి కూడా పార్టీతో పాటు రాజీనామా చేసి స్వతంత్రంగా నిలిచి గెలిచి సొంతంగా పార్టీని స్థాపించుకున్నారు. ఆ పార్టీని నిలబెట్టడం కోసం, ఆ పార్టీ ప్రజల విశ్వాసం చూరగొనడం కోసం ఎండనకా, వాననకా తొమ్మిదేళ్లపాటు కాలికి బలపం కట్టుకొని పడిన కాయకష్టం ఫలితమిచ్చింది. కష్టార్జితం మీద లోకేశ్‌తో సమానంగా వారసత్వం ముసుగు కప్పేందుకు ఎల్లో మీడియా చేస్తున్న కుయుక్తుల్నీ, దగుల్బాజీ విశ్లేషకుల జిత్తులమారితనాన్నీ ఇప్పుడు మనం చూస్తున్నాము.

తన పాదయాత్రను ప్రారంభించే నాటికే రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ కలిగిన నెంబర్‌వన్ రాజకీయ నాయకుడిగా జగన్ ఎదిగారు. అందుకు కారణాలున్నాయి. కష్టాలున్నాయి. కన్నీళ్లున్నాయి. కడగండ్లున్నాయి. అడుగడుగున మందు పాతరల్లా పొంచివున్న గండాలున్నాయి. ఆ గండాలను అధిగమించి సాగిన ప్రస్థానం ఉన్నది. ప్రజలకు ఇచ్చిన ఒక్క మాట కోసం ఆనాడు ప్రపంచంలో సర్వశక్తిమంతురాలుగా చలామణి అవుతున్న అధినేత్రి ముందు తలవంచని ఆత్మస్థైర్యం ప్రజలకు నచ్చింది. ఒక లక్ష్యం కోసం పదవుల్ని గిరాటేయడాన్ని జనం మెచ్చారు. లక్షలాదిమంది అవ్వాతాతలను, అక్కా చెల్లెళ్లను కలిసి వారి గుండె చప్పుళ్లను ఆత్మీయంగా ఆలకించినప్పుడు, ఇంటింటికి వెళ్లి తడారని కళ్లను తుడిచినప్పుడు, పుండ్లు పడిన దేహాలను సైతం ఆదరాలింగనం చేసుకున్నప్పుడు ఆ మానవీయ స్పర్శకు ఆంధ్ర దేశం పులకరించింది.

పాదయాత్రను ప్రారంభించే నాటికే అఖండ ప్రజాదరణతోపాటు ఆయన చేతిలో ఒక ప్రత్యామ్నాయ మేనిఫెస్టో ఉన్నది. ఆ మేనిఫెస్టోలో పేదరికం నుంచి ప్రజలను విముక్తి చేసే మార్గాలున్నాయి. వాటికి 'నవరత్నాల'నే పేరును ఆయన పెట్టుకున్నారు. ఆ మేనిఫెస్టోను ఆయన భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్‌గా ప్రకటించుకున్నారు. దానికితోడు ఆనాటి ప్రభుత్వపు వైఫల్యాలున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ఎగవేత ఉన్నది. రుణమాఫీ పేరుతో రైతుల్ని మోసం చేయడం ఉన్నది. డ్వాక్రా మహిళలను వంచించడం ఉన్నది. ఇంటికో ఉద్యోగం వాగ్దానభంగంగా మిగిలింది. జన్మభూమి కమిటీల దాష్టీకం అసహ్యం పుట్టిస్తున్నది. కాల్‌మనీ సెక్స్ రాకెట్‌లో పాలక పార్టీ నేతలే దుశ్శాసనులై వెదజల్లిన దుర్గంధం ముక్కుల్ని బద్దలు కొడుతున్నది. బీసీ కులాలను, ఎస్సీ కులాలను ఈసడించుకుంటున్న రాజకీయ పెత్తందార్ల పుండాకోర్ చేష్టలు జుగుప్స కలిగిస్తున్నవి. ఇదిగో... ఈ నేపథ్యంలో నెంబర్‌వన్ ప్రజాదరణ కలిగిన రాజకీయ నాయకుడు తన మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా ప్రకటిస్తూ పాదయాత్ర ప్రారంభించాడు. అది సూపర్ హిట్‌గా చరిత్రలో నిలబడిపోయింది. సముద్ర తీరాలను కలుపుతూ జనవారధులను నిర్మించినట్టు, వీధులన్నీ జీవనదులై పోటెత్తినట్టు ప్రజలు పాలుపంచుకున్నారు.

మరి లోకేశ్‌బాబు పాదయాత్ర సంగతి? ఆయన నాయకుడుగానే ఎదగలేదు. ఎమ్మెల్యేగానే గెలవలేదు. ఆయన వారసత్వంపై పార్టీలోనే అంగీకారం లేదు. ఆయన చేతిలో ప్రత్యామ్నాయ ప్రణాళిక లేదు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రకు ముందు తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను దాచేసినట్టుగా ఈ ప్రభుత్వం దాచేయలేదు. పటాలు కట్టించి ఆఫీసుల్లో పెట్టింది. 98 శాతం హామీలను నెరవేర్చినట్టు ప్రకటించింది. ఈ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను రద్దుచేస్తామని లోకేశ్ చెప్పలేదు. గోబెల్స్ విషప్రచారం తప్ప మరో కార్యక్రమమే లేదు. ఎల్లో మీడియా అందజేసే తప్పుడు కథనాల సారాంశమే తప్ప ఆయన మెదడంతా నిస్సారమే! అయినప్పటికీ తొలిరోజు

> లోకేశ్ నాయకుడుగానే ఎదగలేదు. ఎమ్మెల్యేగానే గెలవలేదు. ఆయన వారసత్వంపై పార్టీలోనే అంగీకారం లేదు. ఆయన చేతిలో ప్రత్యామ్నాయ ప్రణాళిక లేదు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రకు ముందు తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను దాచేసినట్టుగా ఈ ప్రభుత్వం దాచేయలేదు. పటాలు కట్టించి ఆఫీసుల్లో పెట్టింది. 98 శాతం హామీలను నెరవేర్చినట్టు ప్రకటించింది. ఈ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను రద్దుచేస్తామని లోకేశ్ చెప్పలేదు. గోబెల్స్ విషప్రచారం తప్ప మరో కార్యక్రమమే లేదు. ఎల్లో మీడియా అందజేసే తప్పుడు కథనాల సారాంశమే తప్ప ఆయన మెదడంతా నిస్సారమే! అయినప్పటికీ తొలిరోజు పాదయాత్రను 'ఘనంగా ముందడుగు' అనే పతాక శీర్షికతో 'ఈనాడు' ప్రకటించింది. వారెవ్వా... కాకిపిల్ల కాకికి ముద్దు. రామోజీరావుకు 'తాను మునిగిందే గంగ, తాను వలచిందే రంభ'. పాఠకుల్ని కూడా అదే నమ్మమంటాడు, ఖర్మ!

పాదయాత్రను 'ఘనంగా ముందడుగు' అనే పతాక శీర్షికతో 'ఈనాడు' ప్రకటించింది. వారెవ్వా... కాకిపిల్ల కాకికి ముద్దు. రామోజీరావుకు 'తాను మునిగిందే గంగ, తాను వలచిందే రంభ'. పాఠకుల్ని కూడా అదే నమ్మమంటాడు, ఖర్మ!

'యువగళం' పాదయాత్ర భూపాలం పాడితే... 'వారాహి రథయాత్ర' కోరస్ పాడుతుందా! లోకేశ్ మాటల్ని వింటే అంతే అనుకోవాలి. వారాహి, యువగళాలను ఎవరూ ఆపలేరని ఆయన చెప్పారు. రెండూ తమ ఆస్తులేనన్నంత ధీమాగా ఆ రెంటినీ ఎవరూ తాకలేరని చెప్పుకొచ్చారు. దానికి తగ్గట్టుగానే పవన్ కల్యాణ్ ఉపన్యాసాలు కూడా సాగుతున్నాయి. పవన్ కల్యాణ్ ఉపన్యాసాలను మొదటి నుంచీ వింటున్న వారికి ఒక మనిషిలో ఇన్ని వైరుధ్యాలు ఎలా సాధ్యమన్న అనుమానం రాకుండా ఉండదు. మొదట్లో చేగువేరా మీద తనకున్న అభిమానాన్ని ఆయన దాచుకునేవాడు కాదు. అప్పుడప్పుడూ ఆయన చేతిలో కన్పించే పుస్తకాల్లో, ఆయన నటించే సినిమాల్లో చే బొమ్మలు కనిపించేవి. ఇప్పుడెందుకో చేగువేరాకు గుడ్‌బై చెప్పినట్టు కనిపిస్తున్నది. ఇటీవల గువేరా కూతురు తెలుగు రాష్ట్రాల్లో పాల్గొన్న సభల్లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులూ పాల్గొన్నారు – ఒక్క జనసేన తప్ప! పవన్ కల్యాణ్ నుంచి ఏదైనా పత్రికా ప్రకటనైనా వస్తుందేమోనని చూశారు. అలాంటిదేమీ లేదు.

రాజకీయాల్లోకి వచ్చి పదేళ్లవుతున్నా ఆయన ఉపన్యాసాలపై సినిమాల ప్రభావం పోలేదు. ఆయన చెబుతున్న చాలా విషయాలు వినేవాళ్లకు నమ్మశక్యంగా అనిపించవు. ఇటీవల తానొక బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో బిజినెస్ క్లాస్‌లో ప్రయాణం చేస్తున్నప్పుడు వర్ణవివక్షను ఎదుర్కొన్నాననీ, ఎయిర్ హోస్టెస్ తనకు మంచినీళ్లు ఇవ్వలేదనీ చెప్పారు. బ్రిటీష్ ఎయిర్‌వేస్‌లో వేలమంది భారతీయులు ఎకానమీ క్లాస్‌లో కూడా ప్రయాణిస్తుంటారు. ఎవ్వరూ ఇటీవలి కాలంలో ఇలాంటి ఆరోపణ చేయలేదు. అలాంటిది బిజినెస్ క్లాసులో ఉన్న పవన్‌కు అవమానం జరగడమేమిటి?... మహాత్మాగాంధీ కూడా తొలినాళ్లలో దక్షిణాఫ్రికా రైల్లో వర్ణవివక్షను ఎదుర్కొన్నట్టే తాను కూడా ఎదుర్కొన్నట్టు చెబితే సెంటిమెంట్ బాగా పండుతుంది, సినిమా గ్రాండ్‌గా ఉంటుందనుకున్నారా? ఇలాంటి అనేక నమ్మశక్యం కాని విషయాలను పవన్ ప్రసంగాల నుంచి వెతికి మరీ ఔత్సాహికులు సోషల్ మీడియాలో పెడుతున్నారు. సుమారు ఒక డజన్ వరకు ఇటువంటి కామెడీ పీస్‌లు చక్కర్లు కొడుతున్నాయి.

రిపబ్లిక్ డే నాడు మాట్లాడుతూ కమ్యూనిస్టు భావాలు కలిగిన వారి తండ్రిగారు దీపారాధనతో సిగరెట్ వెలిగించుకున్నారని చెప్పారు. కమ్యూనిస్టు భావజాలం మీద ద్వేషం కలిగించడానికి కాకపోతే ఈ సంగతి ఎందుకు చెప్పినట్టు? తెలుగు రాష్ట్రాల్లో కమ్యూనిస్టు భావజాలం కలిగినవాళ్లు వేల సంఖ్యలో ఉంటారు. ఎవరైనా ఈ రకంగా ప్రవర్తించినట్టు ఎప్పుడైనా ఒక వార్త వచ్చిందా? అలాంటప్పుడు నిన్న మొన్నటి దాకా తనకు చేగువేరా ఆదర్శమనీ, నక్సలైట్ అవుదామని అనుకున్నాననీ ఎందుకు చెప్పుకున్నట్టు? ఒక స్థిరత్వం లేదా? నాయకుడన్నవాడు నిజాయితీగా ఉండాలని జనం కోరుకుంటారు. నిజాలు మాట్లాడాలని కోరుకుంటారు. ప్రజల పట్ల, బలహీన వర్గాల పట్ల ముఖ్యంగా మహిళల పట్ల గౌరవం చూపాలని కోరుకుంటారు. ఆంధ్రప్రదేశ్ మంత్రి రోజా పట్ల పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు, చూపిన హావభావాలు గౌరవపూర్వకంగానే ఉన్నాయా? ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడు మాట్లాడే తీరేనా? యువగళం, వారాహి యాత్రలు రెండూ ఆదిలోనే సంస్కారం అనే పట్టాలను తప్పాయి. పట్టాలు తప్పిన ఈ ప్రయాణాలను ఎవరూ ఆపలేరట! ఈ యాత్రలు ఏ తీరాలకు చేరుతాయో చూడాలి.

vardhelli1959@gmail.com



గర్వం, స్వాభిమానం సమంగా నటించే తార

నివాళి



వనం జ్వాలా నరసింహారావు

తెలుగు చలన చిత్ర రంగంలో ధ్రువ తారామణిగా దశాబ్దాలపాటు వెలిగిన నటీమణి జమున మరణ వార్త విన్న తరువాత, స్వర్గీయ కేబీ తిలక్ ఆత్మకథ నేను రాస్తున్నప్పుడు ఆమె గురించి ఆయన చెప్పిన కొన్ని విషయాలు గుర్తుకొచ్చాయి. 'అనుపమ' చలన చిత్ర దర్శక-నిర్మాతగా, స్వాతంత్ర్య సమరయోధునిగా, సామాజిక సేవకునిగా తిలక్ చాలామందికి సుపరిచితుడే. పాతిక సంవత్సరాల క్రితం ఆయన జీవిత చరిత్రను ఆయన మాటల్లోనే విని, రికార్డ్ చేసి, అక్షరీకరణ చేశాను.

అనుపమ ఫిలిమ్స్ స్థాపించి, శరత్ బాబు నవల ఆధారంగా ఆరుద్ర రూపొందించిన స్క్రిప్టుతో స్వీయ దర్శకత్వంలో తన తొలి ప్రయత్నంగా 'ముద్దుబిడ్డ'(1956) తీశారు తిలక్. ఆయనతో అప్పటికే ప్రముఖ నటిగా పేరు తెచ్చుకున్న జి.వరలక్ష్మి ప్రధాన భూమిక తనకే ఇవ్వాలన్న ప్రతిపాదన చేశారు. అయితే కథానాయకుడు జగ్గయ్యతో పాటు ఆ సినిమాలో ప్రధాన భూమికకు 'గర్వం', 'స్వాభిమానం' సమపాళ్లలో నటించగల జమునను ఎంపిక చేశారు తిలక్. ఆ పాత్ర కావాలని ఆశపడ్డ జి.వరలక్ష్మిని జమున వదిన పాత్రకు తీసుకున్నారు. (8 రీళ్లపాటు షూట్ చేశాక ఒక డైలాగ్ మార్చమనడంతో ఆమెను తొలగించడం వేరే కథ!) ప్రజానాట్య మండలికి చెందిన పలువురు కళాకారులు ఇందులో నటించారు.

జమున, జగ్గయ్యల కాంబినేషన్‌లో ఓ నాటక బృందం ఉండేదా రోజుల్లో. ఆ పాటికే జమున 'పుట్టిల్లు' సినిమాలో నటించారు. అయితే ఆమె సినీ కళాకారిణిగా స్థిరపడేందుకు 'ముద్దుబిడ్డ' సినిమానే కారణమని తిలక్ అభిప్రాయం. ఇందులో జమున క్యారెక్టర్ మొదట్లో ఓ బొమ్మతో ఆటపాటలతో కాలం గడిపే అమాయక 'రాధ' పాత్ర. మొదటి షాట్‌లోనే జమున 'రాధ' పాత్రలో బొమ్మను పట్టుకుని ''చిట్టి పొట్టి వరాల మూట- గుమ్మడి పండు గోగు పువ్వు'' అనే పాట పాడుతుంది.



అలా పాడుకుంటూ, బొమ్మతో ఆడుకుంటున్న రాధను ఫలహారానికి పిలిస్తే రాలేదని కినుక వహించిన అత్త సుభద్ర ఆమె చేతిలోని బొమ్మ లాక్కోవటంతో మూర్ఛ పోతుంది. మూర్ఛ జబ్బు గల ఆమెను డాక్టర్‌గా పనిచేసే జగ్గయ్యకు ఇచ్చి పెళ్లి చేస్తే మంచి దన్న ఆలోచన కలగటమే తాపీ గారు సూచించిన 'ముడి'.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, వితంతు వివాహాలకు మద్దతుగా వుండే థీమ్‌తో... ఇష్టంలేని వివాహం రద్దయి, కోరుకున్న వానితో వివాహం జరిపించటం ఇతివృత్తంగా వుండే ఓ సామాజిక స్పృహతో తిలక్ తీసిన 'ఈడూ జోడూ'(1963) సినిమాలో కూడా జమున నటించారు. మహాబలిపురంలో ఔట్ డోర్ షూటింగ్ చేస్తున్న సందర్భంలో జపాన్ దేశం నుండి అక్కడకు వచ్చింది ఓ సాంస్కృతిక కళాకారుల బృందం. వారి సమక్షంలో ఆరుద్ర రచించిన 'ఇదేమి లాహిరి ఇదేమి గారడి' అనే చక్కటి పాటను ఘంటసాల, సుశీల పాడగా జగ్గయ్య, జమునలపై చిత్రీకరించామని చెప్పారు తిలక్.

జమునను జగ్గయ్యతో వివాహం జరిపించేటందుకు నిర్ణయించుకున్న తర్వాత ఆమె మెళ్లో తాళి తీయించే సీన్ ఉంటుంది సినిమాలో. జమునను గుమ్మడి బెదిరించి నేను కట్టని తాళి నీ మెళ్లో వుంటానికి వీల్లేదు అంటాడు. ఈ సీన్ చూసిన నాటి సెన్సార్ అధికారి జి.పి.శాస్త్రి గారు, తిలక్‌ను తప్పుచేస్తున్నావని హెచ్చరించారు. అట్లా తీయకుండా, సెంటిమెంట్లను దెబ్బతీయకుండా, ఫ్లాష్ బ్యాక్‌లో విడాకులు ఇప్పించినట్లు చూపించమన్నారు. ఎట్లాగో ఆ సీన్‌ను మానేజ్ చేశారు తిలక్. గుమ్మడి, జమున చాలా కాంపిటీటివ్‌గా నటించారీ సినిమాలో.

ఇలా ఈ రెండు సినిమాలైన 'ముద్దుబిడ్డ', 'ఈడూ జోడూ'లలో జమున అద్భుతంగా నటించిన విషయం ఎంతో గొప్పగా చెప్పారు కేబీ తిలక్. ఆ మహానటి ఆత్మకు శాంతి కలగాలి.

వ్యాసకర్త సీఎం చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ । తెలంగాణ

2023 కొలకలూరి పురస్కారాలు

'కొలకలూరి పురస్కారాలు-2023' ప్రదాన ప్రకటనను ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య కొలకలూరి సుమకిరణ్ వెల్లడించారు. కొలకలూరి భాగీరథీ కవితా పురస్కారం-2023ను 'పచ్చికడుపు వాసన' సంపుటికి గానూ యార్లగడ్డ రాఘవేంద్రరావుకు ప్రకటించారు. కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం-2023ను 'ఆకెళ్ల నాటికలు' సంపుటికిగానూ ఆకెళ్ల వెంకట సూర్యనారాయణకు బహూకరించనున్నారు.

కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారం-2023ను 'తెలంగాణ కథ- వర్తమాన జీవన చిత్రణ' గ్రంథానికిగానూ డాక్టర్ ఎం. దేవేంద్ర స్వీకరిస్తారు. విజేతలందరికీ పదిహేను వేల నగదు, సత్కారం ఉంటుంది. ఈ యేడు అదనంగా 'ఇక ఇప్పుడు' కవితా సంపుటికి గానూ కటుకోజ్వల ఆనందాచారికీ, 'రాచపాళెం సాహిత్య విమర్శ- సమగ్ర అధ్యయనం' గ్రంథానికిగానూ డాక్టర్ ఎ.ఎ.నాగేంద్రకూ చెరో ఐదు వేల నగదు పురస్కారం ఇవ్వనున్నారు. కొలకలూరి భాగీరథి జయంతి, వర్ధంతి అయిన ఫిబ్రవరి 26 రోజున పురస్కారాల ప్రదాన సభ జరగనుంది.



కర్నూలు నగరంలోని చిత్తారి వీధిలో కూరగాయలు విక్రయిస్తున్న మహిళకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



పశ్చిమగోదావరి జిల్లా తణుకులో మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



కాకినాడ 8వ డివిజన్ రాజ్యలక్ష్మినగర్‌లో మహిళకు ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

వరి వంగడాల పంట

నెల్లూరు వరి పరిశోధన కేంద్రంలో నూతన వంగడాల సృష్టి

ఇప్పటికే 29 రకాలను సృష్టించిన శాస్త్రవేత్తలు

తాజాగా ఎస్‌ఎల్‌ఆర్ 3238 వంగడం మార్కెట్లోకి..



సాక్షి ప్రతినిధి, నెల్లూరు : నెల్లూరు వరి పరిశోధన కేంద్రంలో 1948 నుంచి వివిధ రకాల వరి వంగడాలపై పరిశోధనలు చేస్తున్నారు. అనేక మంది శాస్త్రవేత్తలు ఇప్పటి వరకు దాదాపుగా 29 కొత్త వంగడాలను రైతులకు అందించారు. ఇక్కడ పరిశోధన చేసిన వివిధ వంగడాలు రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ ప్రాచుర్యంలో ఉంటున్నాయి. 1948లో బీసీపీ-1, బీసీపీ-2 అనే రెండు రకాల వంగడాలను శాస్త్రవేత్తలు సృష్టించారు. 1950లో బీసీపీ-3, 4, 1951లో 5ని, 1965లో 6తో పాటు బల్క్‌హెచ్ 9ని సృష్టించారు. అనంతరం మొలగొలుకులు -72 అనే రకాన్ని 1977లో మార్కెట్లోకి తెచ్చారు. తర్వాత కొత్త మొలగొలుకులు-74 పేరుతో మరో రకాన్నీ తెచ్చారు. అనంతరం పినాకిని, తిక్కన, సింహపురి, శ్రీరంగ, స్వర్ణముఖి, భరణి, శ్రావణి, స్వాతి, పెన్నా, సోమశిల, వేదగిరి, అపూర్వ, మసూరి, స్వేత, ధన్యరాశి, సిరి, సుగంధ రకాలనూ తయారు చేశారు. ఒక్కో వంగడం తయారీకి దాదాపు రెండు నుంచి మూడేళ్ల సమయం పడుతోంది. కొన్ని వంగడాలైతే ఐదేళ్ల సమయం కూడా తీసుకుంటున్నాయి. తాజాగా ఎస్‌ఎల్‌ఆర్-3238ను వ్యవసాయ శాస్త్రవేత్తలు సృష్టించారు. ఇది తెగుళ్లను తట్టుకునే శక్తి కలది. ఇందులో జింక్ పుష్కలంగా ఉండటంతో రబీలో పండించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

బీపీటీ 5204తో సమానంగా దిగుబడి

ఎంటీయూ 1010, బీపీటీ 5204 సంకరంతో ఎస్‌ఎల్‌ఆర్ 3238ను సృష్టించినట్టు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. స్వల్పకాలంలో అధిక దిగుబడినిచ్చే వంగడాల సృష్టిలో భాగంగా ఈ రకాన్ని వృద్ధి చేశారు. అనేక ప్రయోగాలు, క్షేత్రస్థాయి ప్రదర్శనల అనంతరం ఐదేళ్ల తర్వాత ఈ వంగడం బయటకొచ్చింది. బీపీటీ 5204తో సమానంగా ఈ వంగడం దిగుబడినిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

స్వల్ప కాలంలో అధిక దిగుబడులిచ్చేలా..



రైతులకు అవసరమయ్యేలా వంగడాల సృష్టిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఒక వంగడం పూర్తి స్థాయిలో బయటకు రావాలంటే చాలా సమయం పడుతుంది. అప్పటి వరకు అనేక విధాలుగా పరిశీలన చేస్తుంటాం. తాజాగా ఎస్‌ఎల్‌ఆర్ 3238ను రూపొందించాం. ఇది స్వల్ప కాలంలో అధిక దిగుబడులిచ్చి రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– వినీత, ప్రధాన శాస్త్రవేత్త

ఇతర ప్రాంతాల్లోనూ వినియోగం



తాము పరిశోధన చేసి సృష్టించిన వరి వంగడాలలో చాలా వరకు మంచి ఫలితాలిస్తున్నాయి. జిల్లా నుంచి తయారు చేసిన సీడ్స్‌ను ఇతర ప్రాంతాల్లోనూ ఎక్కువగా వినియోగిస్తున్నారు. రానున్న రోజుల్లో మరికొన్ని వంగడాలను రైతులకు అందించేలా అన్ని విధాలుగా పరీక్షలు నిర్వహిస్తున్నాం.

– సీహెచ్ శ్రీలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త

టీడీపీ నేత కుటుంబానికి రూ.1.30 లక్షల లబ్ధి



టీడీపీ నేత చంద్రారెడ్డి తల్లి సీతారామమ్మకు పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్(తిరుపతి జిల్లా): పార్టీలు, కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చెప్పారు. ఆయన శని వారం పూడేరు సచివాలయం పరిధిలో అరవపెరిమెడి పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఇంటికి ఎమ్మెల్యే సంజీవయ్య వెళ్లారు. చంద్రారెడ్డి కుటుంబానికి వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.40,500, సున్నా వడ్డీ ద్వారా రూ.7,978, ఆయన తల్లి సన్నారెడ్డి సీతారామమ్మకు పింఛన్ కానుక ద్వారా ఇప్పటివరకు రూ.82,000, మొత్తం రూ.1,30,478 లబ్ధి పొందినట్లుగా ఎమ్మెల్యే వివరించారు. ఈ మేరకు సంక్షేమ పథకాల లబ్ధి బుక్‌లెట్‌ను టీడీపీ నేత తల్లి సీతారామమ్మకు ఎమ్మెల్యే అందించారు.

బాబు అండ్ కో యాత్రలన్నీ దొంగ యాత్రలే

- 853వ రోజు రిలే దీక్షలో మండిపడ్డ బహుజన నాయకులు



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: బాబు అండ్ కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాత్రలన్నీ దొంగ యాత్రలేనని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా 853వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శనివారం పలువురు మాట్లాడారు. అమరావతి పేరుతో పెయిడ్ ఆర్టిస్టులతో న్యాయస్థానం టు దేవస్థానం, అమరావతి టు అరసవల్లి పేరిట పారిపోయిన దొంగ యాత్రలన్నీ చందాలు దండుకోవడం కోసం కాదా అని ప్రశ్నించారు. ఆ యాత్రలను ప్రజలు తిరస్కరించడంతో యూటర్న్ తీసుకున్న చంద్రబాబు తన కుమారుడు లోకేశ్, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌తో యాత్రలు చేయిస్తున్నాడని చెప్పారు. మూడు రాజధానులు చేస్తే తన బినామీ ఆస్తులకు ధరలు పెరగవనే భయంతోనే బాబు ఈ దొంగ యాత్రలన్నీ చేస్తున్నాడనేది బహిరంగ సత్యమన్నారు. నిజమైన సైకో చంద్రబాబే అని నేడు ప్రజలు సైకోతో పాటు సైకిల్ కూడా పోవాలని బలంగా కోరుకుంటున్నారని తెలిపారు. ఎన్ఆర్ఐ చందాలతో చేస్తున్న దొంగ యాత్రలను ఎల్లో మీడియాలో లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు సృష్టించేందుకు నానా తంటాలు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అందరూ అండగా నిలుస్తారనడంలో సందేహం లేదని తెలిపారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, బట్టు రవి తదితరులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి

- పాదయాత్ర ఎవరు చేసినా ఒకే తరహా నిబంధనలు
- ఎవరినీ అడ్డుకోలేదు.. ఆటంకాలు కల్పించలేదు
- డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజేంద్రనాథ్‌రెడ్డి. చిత్రంలో డీఐజీ పాలరాజు, ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: రాష్ట్రంలోని పోలీస్ కేసుల సత్వర పరిష్కారానికి కోర్టు మానిటరింగ్ సిస్టం ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టామని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. శనివారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకున్నామని, గతేడాదితో పోలిస్తే ప్రమాదాల సంఖ్య తగ్గిందని చెప్పారు. మహిళలపై దాడుల నివారణ మీద ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. గంజాయి సమస్య గత 25 ఏళ్లుగా ఉందని.. గత నాలుగేళ్లుగా పటిష్ట చర్యలు తీసుకోవడంతో 7,500 ఎకరాల్లో సాగును ధ్వంసం చేయగలిగామన్నారు. గంజాయి సాగుచేసేవారు మళ్లీ అటువైపు వెళ్లకుండా ప్రభుత్వ సహకారంతో ఆహార, వాణిజ్య పంటలు సాగు చేసేవిధంగా వారిలో మార్పు తెస్తున్నామని చెప్పారు. పోలీసు కానిస్టేబుల్ పరీక్షలు పారదర్శకంగా జరిగాయని, ఎస్ఐ పరీక్షలు కూడా అదే రీతిలో జరుగుతాయన్నారు. జీవో 1 విషయం కోర్టు పరిధిలో ఉన్నదని డీజీపీ చెప్పారు. పాదయాత్రలకు రాజకీయాలకు అతీతంగా అందరికీ ఒకే నిబంధనలు అమలు చేస్తున్నామన్నారు. అడ్డుకోవడం గానీ ఆటంకాలు కల్పించడం గానీ చేయలేదని స్పష్టం చేశారు. ఏ జిల్లాలో యాత్ర చేపడితే.. ఆ జిల్లా ఎస్పీకి రోడ్ మ్యాప్ వివరాలను పూర్తిగా అందిస్తే అనుమతులిస్తారని డీజీపీ స్పష్టం చేశారు. సమావేశంలో ఏలూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజు, జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాజశ్యామల యాగం



శ్రీశారదాపీఠంలో స్వామీజీలతో పంజాబ్ గవర్నర్ భన్వర్‌లాల్ పురోహిత్



స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్రతో తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణ రవి

సింహాచలం (పెందుర్తి) : విశాఖ శ్రీశారదాపీఠం వార్షికోత్సవాల్లో భాగంగా రాజశ్యామల యాగం శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారిని పంజాబ్ గవర్నర్ భన్వర్‌లాల్ పురోహిత్, రాష్ట్ర డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె. రోజా దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీనివాస చతుర్వేద హవనానికి హాజరయ్యారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీల ఆశీస్సులు తీసుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున పండితులు ప్రసాదం అందజేశారు. రథ సప్తమిని పురస్కరించుకుని పీఠంలో నిర్వహించిన సౌర యాగం, అరుణ పారాయణం, సూర్య నమస్కారాలను వీక్షించారు.


రాజశ్యామల వైభవమ్ గ్రంథం ఆవిష్కరణ: రాజశ్యామల అమ్మవారిని శనివారం సాయంత్రం తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణ రవి దర్శించుకుని పూజలు నిర్వహించారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా రాజశ్యామల వైభవమ్ గ్రంథాన్ని ఆవిష్కరించారు.

ఫిబ్రవరి 16 నుంచి మహానందిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు

మహానంది(నంద్యాల): మహానందిలో ఫిబ్రవరి 16 నుంచి 21వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర్‌రెడ్డి శనివారం తెలిపారు. శ్రీకామేశ్వరి, మహానందీశ్వర స్వామివార్లకు ప్రతిరోజూ వాహన సేవలు ఉంటాయన్నారు. 16న అంకురార్పణ, ధ్వజారోహణం, 17న సూర్యప్రభ, రావణ వాహన సేవలు, 18న శేష, నందివాహన సేవలు, అదే రోజు మహాశివరాత్రిని పురస్కరించుకుని రాత్రి 12 గంటల నుంచి లింగోద్భవకాల రుద్రాభిషేకం, అనంతరం కళ్యాణోత్సవం జరుగుతాయన్నారు. 19న సింహ వాహన సేవ, పుష్పపల్లకీ సేవ, 20న గజ వాహన సేవ, రథోత్సవం, పుష్పోత్సవం, 21న మహాపూర్ణాహుతి, త్రిశూలస్నానం, ధ్వజావరోహణం, తెప్పోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

దూసుకుపోతున్న ఎలక్ట్రిక్ వాహనాలు

దేశంలో 2019 నుంచి ఈ నెల 23 వరకు 16.85 లక్షల వాహనాలు	రాష్ట్రంలో 2019లో కొన్న వాహనాలు 1,473
2022లో రాష్ట్రంలో 25,721 వాహనాల కొనుగోలు	2019 నంచి ఈ నెల 23 వరకు రాష్ట్రంలో 38,026కు చేరిన వాహనాలు



సాక్షి, అమరావతి: దేశంలో విద్యుత్ వాహనాలు దూసుకుపోతున్నాయి. ఏటేటా ఈ వాహనాల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలోనూ నాలుగేళ్లుగా వీటి సంఖ్య పెరుగుతోంది. పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోల్చితే విద్యుత్ వాహనాల ధరలు, ఇంధన వ్యయం తక్కువగా ఉండటంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు ఇస్తుండటంతో గత నాలుగేళ్లలో దేశంలో ఏకంగా 16.85 లక్షలకు ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరిగింది. గత ఏడాది దేశవ్యాప్తంగా 10 లక్షలకు పైగా వాహనాలు అమ్ముడుపోయాయి. కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఫేమ్ ఇండియా-1, ఫేమ్ ఇండియా-2 అమలు చేస్తోంది. ఫేమ్-ఇండియా-2 కింద ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని ఇటీవల పార్లమెంట్‌లో భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు డిమాండ్ ప్రోత్సాహక రాయితీని రూ. 10,000 నుంచి రూ. 15,000కు పెంచినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఫేమ్ తొలి దశ ఏప్రిల్ 2015 నుంచి 2019 మార్చి నెలాఖరు కొనసాగింది. ఏప్రిల్ 2019 నుంచి ఫేమ్-2 ప్రారంభమైంది. ఇది 2024 వరకు కొనసాగుతుంది. ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్‌ను సృష్టించడంతో పాటు చార్జింగ్ సౌకర్యాలు కల్పనకు, అన్ని రకాల వాహనాలను ప్రోత్సహించడానికి రూ.10 వేల కోట్లు కేటాయించినట్లు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఎలక్ట్రిక్ వాహనాలపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి, అలాగే చార్జర్‌లు, చార్జింగ్‌పైన జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించినట్లు పేర్కొంది.

రాష్ట్రంలో 2022లో భారీగా పెరిగిన ఎలక్ట్రికల్ వాహనాలు

రాష్ట్రంలోనూ వీటి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2019లో రాష్ట్రంలో 1,474 ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు జరగ్గా.. 2022 సంవత్సరంలో ఏకంగా 25,721 వాహనాల కొనుగోళ్లు జరిగాయి. ఈ నెలలో 23వ తేదీ వరకు 1,675 వాహనాల కొనుగోళ్లు జరిగాయి. దీంతో రాష్ట్రంలో మొత్తం ఎలక్ట్రికల్ వాహనా సంఖ్య 38,026కు చేరింది. రాష్ట్రంలో ఎక్కువగా ద్విచక్ర వాహనాలు, ఆటోల సంఖ్య పెరుగుతోంది. ఎలక్ట్రిక్ కార్ల కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయని రవాణా శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

చార్జింగ్ స్టేషన్లు వస్తే మరింతగా పెరగనున్న వాహనాల సంఖ్య

పెట్రోల్, డీజిల్ బంక్‌లు తరహాలో విరివిగా బ్యాటరీ చార్జింగ్ స్టేషన్లు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తే రాష్ట్రంలో ఈ వాహనాల సంఖ్య మరింత పెరుగుతుందని రవాణా శాఖ అదనపు కమిషనర్ ప్రసాదరావు తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాలపై పన్ను లేకపోవడంతో ఇటీవలి కాలంలో వాటి వినియోగం పెరుగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయని, దీంతో భవిష్యత్‌లో మరింతగా వీటి వినియోగం పెరుగుతుందని ఆయన తెలిపారు.

వినియోగంలోకి విస్తరించిన అప్రాన్

ఈ నెల 26న ప్రారంభించిన ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి



విస్తరించిన అప్రాన్‌లో పార్కింగ్ చేస్తున్న ఇండిగో విమానం

విమానాశ్రయం(గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)లో సుమారు రూ.32 కోట్లతో నూతనంగా నిర్మించిన అప్రాన్‌ను గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26వ తేదీన ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి ప్రారంభించారు. ఈ అప్రాన్‌లోకి తొలిసారిగా పార్కింగ్ చేసిన హైదరాబాద్ నుంచి వచ్చిన ఇండిగో విమానానికి ఎయిర్‌పోర్ట్ అగ్నిమాపక శాఖ వాటర్ క్యానన్ సెల్యూట్ పలికింది. విస్తరించిన కొత్త అప్రాన్‌లో ఆరు ఎయిర్‌బస్ ఎ321 విమానాలను పార్కింగ్ చేసుకునే సదుపాయం ఉంది. అంతే కాకుండా కొత్తగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ నుంచి ఆరు ఏరో బ్రిడ్జిల ద్వారా నూతన అప్రాన్‌ను అనుసంధానించనున్నారు. దీనివల్ల ప్రయాణికులు ఏరో బ్రిడ్జిల ద్వారా నేరుగా విమానాల్లోకి రాకపోకలు సాగించవచ్చు. భవిష్యత్ అవసరాల నిమిత్తం విస్తరించిన భారీ అప్రాన్‌ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావడం విమానాశ్రయ చరిత్రలో మరో మైలురాయి అని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ పేర్కొన్నారు.

ఇంటర్నేషనల్ టెర్మినల్ నుంచి బస్ సర్వీస్‌లు...

అంతర్జాతీయ విమానాశ్రయ టెర్మినల్ నుంచి విజయవాడ మీదుగా ఈ నెల 30వ తేదీ నుంచి గుంటూరు వరకు ఆర్టీసీ బస్ సర్వీస్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మేరకు శనివారం ఆర్టీసీ అధికారులు ఎయిర్‌పోర్ట్ నుంచి గుంటూరు వరకు ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులు స్వస్థలాలకు వెళ్లేందుకు గాను ఈ సర్వీస్‌ను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రతి సోమ, బుధ, శనివారాల్లో సాయంత్రం వేళ ఈ బస్ సర్వీస్ నడపనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఈ సర్వీస్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

తమిళనాడు సోనా బోట్లు మళ్లీ హల్‌చల్

నిబంధనలు అతిక్రమించి చేపల వేట



ఊళ్లపాలెం తీరంలోకి వచ్చిన కడలూరు సోనా బోట్లు

సింగరాయకొండ: తమిళనాడు రాష్ట్రం కడలూరుకు చెందిన సోనా బోట్లు నిబంధనలు అతిక్రమించి ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం సముద్రతీరానికి వచ్చి శనివారం చేపలవేటకు దిగడంతో స్థానిక మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల కొత్తపట్నం, పాకల తీరానికి వచ్చిన కడలూరు బోట్లు నిబంధనలను అతిక్రమించి చేపల వేట సాగించడంతో మత్స్యశాఖ, మెరైన్ శాఖలు సంయుక్తంగా స్థానిక మత్స్యకారుల సహకారంతో తరిమికొట్టాయి. ఇకపై కడలూరు మత్స్యకారులు బోట్లతో ఇటువైపు రావడానికి సాహసం చేయరని ఆశించిన నేపథ్యంలో.. మళ్లీ కొద్ది రోజులకే శనివారం ఉదయం 7.30 గంటల సమయంలో తీరంలో కనిపించడంతో స్థానిక మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పాకల పంచాయతీ పోతయ్యగారిపట్టపుపాలెం మత్స్యకారుడు ప్రళయకావేరి రోశయ్య, ఊళ్లపాలెం మత్స్యకారుడు గొల్లపోతు నాగరాజు తదితరులు రామాయపట్నం మెరైన్ సీఐ ఆర్‌ఎస్ కిషోర్‌కుమార్, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆ రెండు శాఖల అధికారులు మళ్లీ కడలూరు బోట్లను తరిమికొట్టేందుకు సమాయత్తమయ్యారు. ఆ సమాచారం అందుకున్న కడలూరు మత్స్యకారులు వెంటనే అప్రమత్తమై బోట్లతో పలాయనం చిత్తగించారు.

బీజేపీ, జనసేన కలిసే పోటీ

- రాజ్యసభ సభ్యుడు జీవీఎల్

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): వచ్చే ఎన్నికల్లో బీజేపీ, జనసేన రెండు కలిసే పోటీ చేస్తాయని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు స్పష్టం చేశారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీకి బీజేపీనే అసలైన ప్రత్యామ్నాయమన్నారు. వచ్చే మంగళవారం నుంచి ప్రారంభం కానున్న కేంద్ర బడ్జెట్ సమావేశాల ద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రాజెక్టుల వేగవంతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

పర్యాటకం.. ప్రగతి పథం

కైకలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పర్యాటక రంగం కొత్త సొబగులు సంతరించుకుంటోంది. కరోనా విపత్తు నుంచి తేరుకుని పర్యాటకుల సంఖ్య పెరగడంతో ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) రూ.2 కోట్లతో అభివృద్ధికి పనులకు శ్రీకారం చుట్టింది. ప్రధానంగా టెంపుల్, ఎకో టూరిజంపై దృష్టి సారించారు. ప్రముఖ ఆలయాల సందర్శనకు వచ్చే భక్తులకు సమీప పర్యాటక ప్రాంతాల విశేషాలను తెలియజేసేలా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నారు. రిసార్ట్‌ల వద్ద రెస్ట్ రూమ్‌లను నిర్మిస్తున్నారు. రాష్ట్రంలో అత్యధిక భక్తులు వచ్చే 100 ఆలయాల్లో ద్వారకాతిరుమల, మద్ది ఆంజనేయ స్వామి, పంచారామక్షేత్రాలైన భీమవరం ఉమాసోమేశ్వరస్వామి, పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయాలు, భీమవరం మావుళ్లమ్మ దేవస్థానాలు ఉన్నాయి. ఆయా ఆలయాల వద్ద పర్యాటక శాఖ హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే పాలకొల్లులో ఆలయం వద్ద 300 అడుగుల స్థలాన్ని హెల్ప్‌డెస్క్ కోసం పరిశీలించారు. అలాగే తాడేపల్లిగూడెం వద్ద వే సైడ్ ఎమినిటీ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఒకే ప్రాంతంలో రెస్టారెంట్లు, పెట్రోల్ బంకులు, కాటేజీలు, వెహికల్ పార్కింగ్‌లు అందుబాటులోకి రానున్నాయి.

అదనపు గదులు.. అతిథి గృహాలు

కోవిడ్ వల్ల కోలుకోలేని దెబ్బతిన్న పర్యాటక శాఖకు ఉపశమనం కలిగించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.198.50 కోట్ల ప్యాకేజీని కేటాయించింది. దీనిలో భాగంగా ప్రస్తుతం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రూ.2 కోట్లతో పనులు జరుగుతున్నాయి. పాపికొండల యాత్రికులు వెళ్లే కొరటూరు రిసార్ట్స్ వద్ద రూ.70 లక్షలతో యూత్ ఫంక్షన్ హాల్, సోలర్ సిస్టం, పైప్‌లైన్, విద్యుత్ పనులను చేస్తున్నారు. అలాగే జల్లేరు జలాశయం వద్ద పర్యాటకుల కోసం రూ.40 లక్షలతో రెండు గదులు, జీలకర్రగూడెం గుంటుపల్లి గుహల వద్ద రూ.30 లక్షలతో అతిథి గృహాలు నిర్మిస్తున్నారు. పేరుపాలెం బీచ్, సిద్ధాంతం, పట్టిసీమ వద్ద అదనపు గదులను ఏర్పాటు చేస్తున్నారు. ఇలా పర్యాటకాభివృద్ధికి ప్రణాళికతో అధికారులు ముందుకెళుతున్నారు.

కొల్లేరు ఎకో టూరిజానికి..

జిల్లాల పునర్విభజన తర్వాత కొల్లేరు ప్రాంతమంతా ఏలూరు జిల్లా పరిధిలోకి చేరింది. కొల్లేరు ఎకో టూరిజానికి రూ.187 కోట్ల ప్రణాళికతో ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. కొల్లేరు పరివాహక ప్రాంతాల్లో 20 ప్రదేశాలను గుర్తించి బోటు షికారు, సంప్రదాయ గేలాలతో చేపలు పట్టుకోవడం, పక్షుల వీక్షణ వంటివి ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే 10 ప్రదేశాలను పర్యాటక శాఖ గుర్తించింది. రానున్న రోజుల్లో కొల్లేరు ఎకో టూరిజం పర్యాటక శాఖకు ప్రధాన ఆదాయ వనరుగా మారనుంది.

క్లుప్తంగా

అమెరికాలో మళ్లీ తుపాకీ గర్జన
ముగ్గురి దుర్మరణం

బెవెర్లీ క్రెస్ట్: అగ్రరాజ్యం అమెరికాలో కాల్పుల మోత కొనసాగుతూనే ఉంది. శనివారం ఉదయం కాలిఫోర్నియా రాష్ట్రంలో జరిగిన కాల్పుల ఘటనలో కనీసం ముగ్గురు మరణించారని, మరో నలుగురు గాయపడ్డారని పోలీసు అధికారులు వెల్లడించారు. లాస్‌ఏంజెలెస్ సమీపంలోని బెవెర్లీ క్రెస్ట్‌లో ఓ ఇంటి వద్ద తెల్లవారుజామున 2.30 గంటలకు కాల్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. గుర్తుతెలియని వ్యక్తి మొత్తం ఏడుగురిపై తుపాకీ గురిపెట్టాడని పేర్కొన్నారు. బాధితులను ఇంకా గుర్తించలేదని చెప్పారు. గాయపడినవారిని ఆసుపత్రికి తరలించామని, వారి పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు. కాలిఫోర్నియాలో గత నెల రోజుల వ్యవధిలో ఇది నాలుగో కాల్పుల సంఘటన కావడం గమనార్హం. వారం రోజుల క్రితం లాస్ ఏంజెలెస్ శివారులో ఓ డ్యాన్స్ హాల్‌లో జరిగిన కాల్పుల్లో ఏకంగా 11 మంది బలైన సంగతి తెలిసిందే.

మార్చి 1 నుంచి గ్రీవెన్స్ అప్పిలేట్ కమిటీలు

న్యూఢిల్లీ: ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం వంటి సోషల్ మీడియా వేదికలపై ప్రజల ఫిర్యాదులను పరిశీలించి, చర్యలు తీసుకోవడానికి కేంద్రం ఏర్పాటు చేసిన మూడు గ్రీవెన్స్ అప్పిలేట్ కమిటీ (జీఏసీ)లు మార్చి 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. ప్రతి జీఏసీకి ఒక చైర్‌పర్సన్ నేతృత్వం వహిస్తారు. కేంద్ర ప్రభుత్వం, పరిశ్రమ నుంచి మరో ఇద్దరు సభ్యులు ఉంటారు. వీరి పదవీ కాలం మూడేళ్లు. ఫిర్యాదులను ఆన్‌లైన్‌లోనే పంపాల్సి ఉంటుంది. 30 రోజుల్లోగా జీఏసీలు పరిష్కరిస్తాయి.

ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం.. డాక్టర్ దంపతులు సహా ఐదుగురు మృతి

ధన్‌బాద్: జార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్‌లోని ఓ నర్సింగ్ హోంలో శనివారం చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో డాక్టర్ దంపతులు సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ధన్‌బాద్‌లోని బ్యాంక్ మోర్ ఏరియాలో డాక్టర్ వికాస్ హజ్రాకు చెందిన నర్సింగ్ హోం ఉంది. ఆయన కుటుంబంతోపాటు అందులోనే నివాసం ఉంటారు. ఆస్పత్రి స్టోర్‌రూంలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక మంటలు మొదలయ్యాయి. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న డాక్టర్ వికాస్ హజ్రా(64), భార్య డాక్టర్ ప్రేమ హజ్రా(58), బంధువు సోహన్ కుమారి, పనిమనిషి తారాదేవి దట్టమైన పొగ కారణంగా ఊపిరాడక చనిపోయారు. మృతి చెందిన ఐదో వ్యక్తిని గుర్తించాల్సి ఉందని అధికారులు చెప్పారు. ఘటనలో డాక్టర్ దంపతుల పెంపుడు కుక్క కూడా చనిపోయింది. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

‘ఓటు జోడో’ యాత్ర అయ్యేనా?



ముగింపుకు రాహుల్ భారత్ జోడో యాత్ర
ఈ పాదయాత్రపైనే కాంగ్రెస్‌కు గంపెడాశలు

ఎస్.రాజమహేంద్రారెడ్డి

కాంగ్రెస్ పార్టీ గంపెడాశలు పెట్టుకున్న రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ఈ నెల 30వ తేదీతో ముగియనుంది. కన్యాకుమారి నుంచి కశ్మీర్ దాకా సాగిన ఈ యాత్ర విజయవంతమైనట్టేనా? నూటా పాతికేళ్ల పై చిలుకు సుదీర్ఘ చరిత్రలో ఎన్నడూ లేనంత నైరాశ్యంలో కూరుకుపోయి ఉన్న కాంగ్రెస్‌కు కాస్తయినా కొత్త ఊపిరులూదేనా...? వచ్చే ఎన్నికల్లో పార్టీకి ఆశించిన మేరకు ఓట్లను ‘జోడి’ంచేనా...?

కాంగ్రెస్. గ్రాండ్ ఓల్డ్ పార్టీ. ఎంతో ఘనచరిత్ర ఉన్న పార్టీ. మహా మహా నాయకులెందరినో దేశానికి అందించిన పార్టీ. సుదీర్ఘకాలం పాటు దేశాన్ని ఏలిన జన సమ్మోహన పార్టీ. దేశాన్ని ఒక్కతాటిపై నడిపిన పార్టీ. కానీ కొన్నేళ్లుగా సొంత నేతలనే ఒక్కతాటిపై నడపలేక ఆపసోపాలు పడుతోంది. ఏదో చెయ్యాలి. మళ్లీ ఎలాగైనా పార్టీకి పునర్వైభవాన్ని తీసుకురావాలి. ఈ తపన, మథనం నుంచి పుట్టిన ‘భారత్ జోడో యాత్ర’ పార్టీని మళ్లీ పట్టాలెక్కిస్తుందా? లేదా లెక్క తప్పుతుందా? వేచి చూడాల్సిందే! దేశ ప్రజలను ఈ యాత్ర ద్వారా రాహుల్‌గాంధీ ఏ మేరకు ప్రభావితం చేయగలిగారన్నది కూడా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చే సీట్ల సంఖ్య ద్వారానే తేలుతుంది.

చకచకా.. చలాకీగా...

రాహుల్‌గాంధీ. కాంగ్రెస్‌కు చివరి ఆశాకిరణం. జోడో యాత్ర. రాహుల్‌గాంధీకి చివరి ఆశాకిరణం. ఈ యాత్రపై కాంగ్రెస్ గంపెడాశలు పెట్టుకుంది. అందుకు తగ్గట్టుగానే కన్యాకుమారిలో యాత్రను ప్రారంభించిన రాహుల్‌గాంధీ చలాకీగా నడుస్తూ, జనంతో మమేకమవుతూ చివరి మజిలీకి చేరుకున్నారు. భారత్ జోడో యాత్ర అనబడే 3,570 కిలోమీటర్ల రాహుల్ పాదయాత్ర జనవరి 30న జమ్మూ కశ్మీర్‌లో ముగుస్తుంది. దేశానికి ముగ్గురు ప్రధానులను ఇచ్చిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ రాజకీయ ప్రస్థానం మిగతా రాజకీయ నాయకులకు విభిన్నంగా ఉంటుంది. పట్టాభిషేకమే తరువాయి అనే యువరాజు హోదాలో రాజకీయాల్లోకి వచ్చిన ఆయనలో సహజసిద్ధమైన చొరవ, దూకుడు ఒకింత తక్కువేనని చెప్పుకోవాలి. రాజకీయాల్లోకి వచ్చాక కూడా చాలాకాలం పాటు అమ్మచాటు బిడ్డలానే కొనసాగడం, నాయకత్వం వహించాల్సిన అవసరం వచ్చినప్పుడల్లా వెనక్కు తగ్గడం ఆయన రాజకీయ శైలికి అద్దం పడుతుంది. ఇవాళ్టికీ కాంగ్రెస్‌కు అన్నీ ఆయనే. అయినప్పటికీ, ప్రతిపక్షాలకు మాత్రం ‘పప్పూ’గా మిగిలిపోయారు. ప్రతిపక్షాల అక్కసు ఎలా ఉన్నా, తనేమిటో నిరూపించుకోవడానికి జోడో యాత్ర రాహుల్‌కు మంచి అవకాశాన్నిచ్చింది. దాన్ని ఆయన హుందాగా సద్వినియోగం చేసుకున్నారని చెప్పుకోవచ్చు. జనం నుంచి యాత్రకు మంచి స్పందనే వచ్చింది. చాలామంది ప్రముఖులు, మేధావులు రాహుల్‌తో కదం కలిపి సంఘీభావం తెలిపారు. ఆయన ఆత్మవిశ్వాసాన్ని ఓ మెట్టు పైకి లేపారు. అయితే కాంగ్రెస్ పునరుజ్జీవానికి ఈ యాత్ర ఒక్కటే దోహదపడుతుందా అన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ ఆదరణ ఓటుగా మారుతుందా అన్నది మరో చిక్కు ప్రశ్న.

వరుస ఓటములే నేపథ్యం...

ప్రస్తుతం కేవలం మూడంటే మూడే రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి పుంజుకోవడం కష్టమే! మహా అయితే లోక్‌సభలో తమ సీట్ల సంఖ్యను కొద్దో గొప్పో పెంచుకోగలదు. అంతే. నిజానికి కాంగ్రెస్ ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా అదే గొప్ప విజయంగా భావించవచ్చు. 2014 ఎన్నికల్లో కేవలం 44 సీట్లతో బొక్కబోర్లా పడ్డ కాంగ్రెస్ ఆ తర్వాత సంస్థాగత మార్పులపై కసరత్తు చేసి 2017లో యువరాజు రాహుల్‌గాంధీని అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టింది. అప్పటి దాకా అధ్యక్షురాలిగా కొనసాగిన తల్లి సోనియాగాంధీ నుంచి పార్టీ రాజదండం అందుకున్న రాహుల్ ఊహించినంతగా ప్రభావం చూపలేకపోయారు. ఆయనలో చొరవ, దూకుడు, సామాన్య కార్యకర్తలకు అందుబాటులో ఉండే కలుపుగోలుతనం లోపించాయనేది ఈ సమయంలోనే స్పష్టమైంది. పద్మవ్యూహంలాంటి రాజకీయ రణాంగణంలో మెతగ్గా, హుందాగా ఉంటే నడవదు. యుద్ధాన్ని ముందుండి నడిపించే సైన్యాధిపతిలా ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ప్రత్యర్థి ఊహకందని వ్యూహాలతో ముందుకురకాలి. ఆలోచిద్దాం, చేద్దాంలతో పని నడవదు. ఆ తర్వాత 2019లో జరిగిన ఎన్నికలు రాహుల్‌గాంధీ పనితీరుకు అగ్నిపరీక్ష పెట్టాయి. కానీ ఈసారి కూడా కాంగ్రెస్ కేవలం 52 సీట్లతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా కుదేలైంది. అధ్యక్ష పదవి సోనియా నుంచి రాహుల్‌కు మారినా కాంగ్రెస్ పరిస్థితిలో ఎలాంటి మార్పూ రాలేదు. పరాజయానికి బాధ్యత వహిస్తూ రాహుల్ రాజీనామా చేసి కొన్నాళ్లపాటు నిస్తేజంగా ఉండిపోయారు. ఏం చేయాలో తెలియని పరిస్థితిలో కాంగ్రెస్ పెద్దలంతా కూడా సుదీర్ఘ ఆలోచనల్లో మునిగిపోయారు. గత మేలో ఉదయ్‌పూర్‌లో జరిగిన కాంగ్రెస్ చింతన్ శిబిరంలో మేధోమథనం చేసి భారత్ జోడో యాత్రకు రూపకల్పన చేశారు.

‘జోడో యాత్ర’ ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లో ఆగుతూ.. కదులుతూ... సాగుతోంది. వివాదాలకూ, వివాదాస్పద వ్యాఖ్యలకూ దూరంగా ఉంటూ, మనసులోని మాటను జనాలతో పంచుకుంటూ రాహుల్ యాత్రను కొనసాగిస్తున్నారు. సామాజిక సమస్యలు, మత సామరస్యం, ఆర్థిక అసమానతలు, రాజకీయ పెత్తందారీ పోకడల వంటి అంశాలే అజెండాగా ప్రజలతో మమేకమై చిట్టిపొట్టి విలేకరుల సమావేశాల్లో తన గళం వినిపిస్తూ వచ్చారు. ప్రధాన మీడియా చానళ్లు, పత్రికలకు సాధ్యమైనంత దూరంగా ఉన్నారు. యాత్ర సాగుతున్న తీరు, అభిమానుల ఆత్మీయ స్పర్శ, విలేకరుల సమావేశాలను తన హ్యాండ్లర్ ద్వారా యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడాన్ని యాత్ర తొలి రోజు నుంచి

ఆదరణ ఓటుగా మారేనా?

ఏనాడూ మిస్ కాలేదు. ప్రతిపక్షాలు రుద్దిన ‘పప్పూ’ ట్యాగ్ నుంచి బయట పడటానికి ఇది బాగా దోహదపడింది. యాత్ర మొదలైన సెప్టెంబర్ నుంచి ఇప్పటిదాకా ఈ యూట్యూబ్ చానల్‌కు లక్షల్లో కొత్త వీక్షకులు జతగూడారు. ప్రధాని మోదీ పనితీరు, బీజేపీ అధికార దర్పం పట్ల అసంతృప్తిగా ఉన్నవాళ్లను రాహుల్ తన కొత్త వ్యవహార శైలితో ఆకర్షించగలిగారు. గత జనవరితో పోలిస్తే ఆయనకు స్వల్పంగా జనాదరణ పెరిగిందని పలు చానళ్ల సర్వేలు చెబుతున్నాయి. అయితే ఈ ఆదరణ వచ్చే జనవరికి పెరుగుతుందో, తరుగుతుందో చూడాలి. ఈ యాత్ర కాంగ్రెస్‌లో కచ్చితంగా కొత్త ఆశలు రేపిందనడంలో సందేహం లేదు. అయితే ఇదొక్కటే చాలదు. అటు లోక్‌సభలోనూ, ఇటు ప్రజల్లోనూ నిర్మాణాత్మక విమర్శలు, చేతలతో ప్రజల విశ్వాసం చూరగొనడానికి కాంగ్రెస్ ప్రయత్నించాలి. సొంతింట్లోనే చిచ్చు రాజేసే క్యాంపు రాజకీయాలకు స్వస్తి పలకాలి. అధికారం లేనిచోట ఒక్కతాటిపై నిలిచే ప్రయత్నం చేయాలి. తాను మారిన మనిషినని ఈ పాదయాత్ర ద్వారా రాహుల్‌గాంధీ నిరూపించుకున్నట్టే యాత్ర ద్వారా చేకూరిన లబ్ధిని కాంగ్రెస్ సద్వినియోగం చేసుకోగలగాలి. లేదంటే రాహుల్ భారత్ జోడో యాత్ర ఓటు జోడో యాత్రగా మారకుండా సుదీర్ఘ ‘ఈవినింగ్ వాక్’గానే మిగిలిపోతుంది!

నేలమీద పడేసి చేతులు విరగ్గొట్టి

- మరో నల్లజాతీయుడిపై అమెరికా పోలీసుల హింసాకాండ
- జార్జ్ ఫ్లాయిడ్ ఉదంతాన్ని తలపిస్తున్న నికోల్స్ మరణం
- పోలీసుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు

టెన్నెసీ: అమెరికాలో పోలీసుల క్రూరత్వం ఏ స్థాయిలో ఉంటుందో తెలిపే ఘటన మరొకటి వెలుగులోకి వచ్చింది. టెన్నెసీ రాష్ట్రంలోని మెంఫిస్ నగర పోలీసులు 29 ఏళ్ల నల్లజాతీయుడ్ని దారుణంగా హింసించడంతో ఆ దెబ్బలకు తాళలేక అతను ప్రాణాలు కోల్పోయాడు. ఈ నెల మొదట్లో జరిగిన దారుణానికి సంబంధించిన వీడియో తాజాగా వెలుగులోకి రావడంతో పోలీసుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు ఎగిసిపడుతున్నాయి. 2020 మేలో జార్జ్ ఫ్లాయిడ్ అనే నల్లజాతీయుడ్ని శ్వేతజాతీయుడైన పోలీసు అధికారి గొంతుపై బూటు కాలుతో తొక్కి చంపిన ఘటనని తలపించేలా ఈ దౌర్జన్య కాండ కూడా సాగింది. కాకపోతే తాజా ఘటనకు పాల్పడ్డ పోలీసులు కూడా నల్లజాతీయులే! ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ ఫెడెక్స్‌లో పనిచేసే 29 ఏళ్ల టైర్ నికోల్స్‌ను ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలపై మెంఫిస్ పోలీసులు జనవరి 7న ఆపారు. వాహనంలోంచి లాగి నేలమీద పడేసి దారుణంగా కొట్టారు. తాను ఏ తప్పు చేయలేదంటూ వెళ్లిపోవడానికి ప్రయత్నిస్తుండగా ఆరుగురు పోలీసులు అతనిపై పెప్పర్ స్ప్రే చల్లి, ఎలక్ట్రిక్ పరికరాలతో షాకిచ్చి కిందపడేశారు. ముఖంపై ఇష్టారాజ్యంగా కొట్టారు. వికృతానందంతో నవ్వుతూ భుజం విరిగేలా కొట్టారు. ‘మామ్ , మామ్’ అంటూ నికోల్స్ దీనంగా రోదిస్తున్నా రెండు నిమిషాల పాటు ఆపకుండా చితక్కొట్టారు. అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జనవరి 10న మరణించాడు. పోలీసులు కొడుతున్న వీడియో చూసి ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ దౌర్జన్యాలు ఇంకా ఎన్నాళ్లంటూ రోడ్లపైకి వచ్చి నిరసనలకు దిగుతున్నారు. పోలీసులపై హత్యానేరం కింద అభియోగాలు నమోదు చేశారు. నికోల్స్‌కు నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. నికోల్స్ తన భుజంపై తల్లి వెల్స్ పేరును టాటూగా వేసుకున్నాడు. తన కొడుకు దారుణ హింసకు గురై మరణించాడంటూ విలపిస్తున్న ఆమెను ఓదార్చడం ఎవరి వల్ల కావడం లేదు.

బైడెన్ దిగ్భ్రాంతి

టైర్ నికోల్స్‌పై పోలీసుల హింసాకాండపై బైడెన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అత్యంత దారుణమైన ఆ ఘటనకు సంబంధించిన వీడియో చూస్తే మనసు కలచివేసిందని ఒక ప్రకటనలో తెలిపారు. నల్లజాతీయులకు దేశంలో ఎదురవుతున్న ఎదురుదెబ్బలకి ఇది మరొక ఉదాహరణన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తానన్నారు. నికోల్స్ కుటుంబ సభ్యులతో మాట్లాడి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.



పోలీసుల చేతిలో దెబ్బలు తిని నిస్తేజంగా పడున్న నికోల్స్. (ఇన్‌సెట్‌లో) అతనిపై పెప్పర్ స్ప్రే జల్లుతున్న పోలీసులు

అణగారిన వర్గాల సాధికారతే ధ్యేయం

- గుజ్జర్ యోధులకు గుర్తింపు దక్కలేదు
- శ్రీదేవనారాయణ్ వేడుకల్లో ప్రధాని మోదీ



జైపూర్: ‘‘సమాజంలో అణగారిన వర్గాల సాధికారతే మా ప్రభుత్వ ధ్యేయం. అందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాం’’ అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. వంచిత్ కో వరీయత (పీడితులకు తొలి ప్రాధాన్యం) నినాదంతో సాగుతున్నామన్నారు. శనివారం రాజస్తాన్‌లో భిల్వారా జిల్లా మాలాసేరీ దుంగ్రీలో గుజ్జర్ల ఆరాధ్యుడు శ్రీదేవనారాయణ్ ఆధ్యాత్మిక వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ‘‘ప్రపంచ దేశాలు ఆశలు, ఆకాంక్షలతో భారత్ వైపు చూస్తున్నాయి. భారత్ తన బలాన్ని, అధికారాన్ని ప్రదర్శిస్తోంది, అంతర్జాతీయ వేదికలపై శక్తిని నిరూపించుకుంటోంది’’ అన్నారు.

పొరపాట్లను సరిదిద్దుకుంటున్న ‘నవ భారత్’

స్వాతంత్య్ర పోరాటంతోపాటు ఇతర ఉద్యమాల్లో గుజ్జర్ల పాత్ర మరువలేనిదని మోదీ ప్రశంసించారు. వారికి చరిత్రలో తగిన గుర్తింపు దక్కకపోవడం దురదృష్టకరమని అన్నారు. ‘‘గత పొరపాట్లను ‘నవ భారత్’ సరిదిద్దుకుంటోంది. దేశాన్ని సిద్ధాంతపరంగా విచ్ఛిన్నం చేసేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగినా విఫలమయ్యాయి. నాగరికత, సంస్కృతి, సామరస్యం, శక్తి సామర్థ్యాల వ్యక్తీకరణే భారత్’’ అన్నారు. దేశ ఐక్యతను భగ్నం చేసే వాటికి దూరంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

మన వారసత్వం మనకు గర్వకారణం

వేలాది సంవత్సరాల భారతదేశ ప్రయాణంలో సామాజిక బలం గణనీయమైన పాత్ర పోషించిందని నరేంద్ర మోదీ వివరించారు. మన వారసత్వం మనకు గర్వకారణమని, బానిస మనస్తత్వం నుంచి బయటపడాలని ఉద్బోధించారు. దేశం పట్ల మనం నిర్వర్తించాల్సిన విధులను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని కోరారు. ‘‘ప్రజాసేవకు శ్రీదేవనారాయణ్ ప్రాధాన్యమిచ్చారు. ఆయన కమలంలో ఉద్భవించారు. భారత్ సారథ్యం వహిస్తున్న జీ–20 లోగోలో కమలం ఉంది. బీజేపీ ఎన్నికల గుర్తయిన కమలంతో నాకెంతో అనుబంధముంది. గుజ్జర్ సామాజిక వర్గంతోనూ చక్కటి స్నేహ సంబంధాలున్నాయి’’ అన్నారు.

ఐక్యతా మంత్రమే విరుగుడు

న్యూఢిల్లీ: ప్రజల మధ్య విభేదాలు, అంతరాలను సృష్టించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు ఎన్నడూ విజయవంతం కాబోవని మోదీ అన్నారు. ఢిల్లీ కంటోన్మెంట్‌లోని కరియప్ప గ్రౌండ్‌లో ఎన్‌సీసీ ర్యాలీనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ‘‘దేశ పునర్వైభవ సాధనకు ఐక్యతే ఏకైక మార్గం. అన్నింటికీ అదే ఏకైక విరుగుడు. యువత తన ముంగిట ఉన్న అపార అవకాశాలను వాడుకోవాలి’’ అన్నారు. ఎన్‌సీసీ 75వ వ్యవస్థాపక దినం సందర్భంగా ముద్రించిన 75 రూపాయల నాణేన్ని, కవర్‌ను విడుదల చేశారు.

భారత్ జోడో యాత్ర పునఃప్రారంభం

రేపు శ్రీనగర్‌లో బహిరంగ సభ



అవంతిపురా/శ్రీనగర్/న్యూఢిల్లీ: కాంగ్రెస్ భారత్ జోడో యాత్ర జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య శనివారం పునఃప్రారంభమైంది. రాహుల్ గాంధీ ఉదయం 9.20 గంటలకు పాదయాత్ర ప్రారంభించారు. భద్రతాపరమైన లోపాలున్నాయంటూ శుక్రవారం మధ్యాహ్నం యాత్రను నిలిపేయడం తెలిసిందే. దాంతో శనివారం మూడంచెల భద్రత కల్పించారు. 2019 ఫిబ్రవరిలో పుల్వామా జిల్లాలో ఉగ్రవాద దాడిలో మరణించిన 40 సీఆర్‌పీఎఫ్ జవాన్లకు రాహుల్ గాంధీ శనివారం నివాళులర్పించారు. జమ్మూ–శ్రీనగర్ జాతీయ రహదారిపై జైషే మొహమ్మద్ ఉగ్రవాది ఆత్మాహుతి దాడిలో బస్సు ధ్వంసమైన చోట పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

యాత్రలో ప్రియాంకా గాంధీ

భారత్ జోడో యాత్రలో కాంగ్రెస్ పార్టీ నేత ప్రియాంకా గాంధీ వాద్రా కూడా పాల్గొన్నారు. శనివారం లెథ్‌పురాలో సోదరుడు రాహుల్ గాంధీపాటు పాదయాత్రలో భాగస్వాములయ్యారు. దక్షిణ కశ్మీర్ జిల్లాలోని చుర్సూలో పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ, ఆమె కుమార్తె ఇల్తిజా ముఫ్తీ సైతం రాహుల్ గాంధీతోపాటు జోడో యాత్రలో పాల్గొన్నారు.

తాజా గాలి పీల్చుకున్నట్లే ఉంది: ముఫ్తీ

కశ్మీర్‌లో జోడో యాత్ర జరగడం తాజా గాలి పీల్చుకున్నట్లుగా ఉందని మెహబూబా ముఫ్తీ శనివారం ట్వీట్ చేశారు. 2019 తర్వాత తొలిసారిగా భారీ సంఖ్యలో జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చారని చెప్పారు. యాత్రలో రాహుల్ గాంధీతో కలిసి నడవడం గొప్ప అనుభవమని పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం జోడో యాత్ర ఆదివారం ఉదయం పంథాచౌక్ నుంచి పునఃప్రారంభం కానుంది. శ్రీనగర్‌లో బోలివార్డ్ రోడ్డులోని నెహ్రూ పార్కు వరకూ యాత్ర సాగుతుంది. సోమవారం శ్రీనగర్ ఎంఏ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్ గాంధీ జెండా ఎగురవేస్తారు. అనంతరం ఎస్‌కే స్టేడియంలో విపక్ష పార్టీల నేతలతో కలిసి బహిరంగ సభలో పాల్గొంటారు.

అమిత్ షాకు మల్లికార్జున ఖర్గే లేఖ

జమ్మూకశ్మీర్‌లో కొనసాగుతున్న భారత్‌జోడో యాత్రకు తగిన భద్రత కల్పించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కోరారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. యాత్రలో భద్రతాపరమైన లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ విషయంలో వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవాలని అమిత్ షాకు విజ్ఞప్తి చేశారు.

సుఖోయ్, మిరాజ్ ఢీ.. పైలట్ మృతి

మరో ఇద్దరికి గాయాలు • మధ్యప్రదేశ్‌లో ఘటన



న్యూఢిల్లీ/భరత్‌పూర్/మొరెనా: భారత వైమానిక దళం(ఐఏఎఫ్)నకు చెందిన సుఖోయ్ 30ఎంకెఐ, మిరాజ్–2000 యుద్ధ విమానాలు ఢీకొన్న అరుదైన ఘటనలో ఒక పైలెట్ మృతి చెందారు. మరో ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌కు సమీపంలో శనివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఐఏఎఫ్ బేస్‌గా ఉన్న గ్వాలియర్ విమానాశ్రయం నుంచి ఈ రెండు విమానాలు రోజువారీ సాధారణ శిక్షణలో భాగంగా బయలుదేరాయి. మొరెనా జిల్లా పహార్‌గఢ్ సమీపంలోని బహిరంగ ప్రదేశంలో అవి ప్రమాదవశాత్తు ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఘటనలో సింగిల్ సీటర్ మిరాజ్–2000 పైలెట్ వింగ్ కమాండర్ హనుమంతరావు సారథి చనిపోగా ట్విన్ సీటర్ సుఖోయ్ ఫ్లయిట్‌లోని ఇద్దరు పైలెట్లు ఎజెక్ట్ అయి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతి చెందిన వింగ్ కమాండర్ శరీర భాగాలు పహార్‌గఢ్ ప్రాంతంలో లభ్యమైనట్లు అధికారులు తెలిపారు. విమాన శకలాలు కొన్ని పొరుగునే ఉన్న రాజస్తాన్‌లోని భరత్‌పూర్ జిల్లాలోనూ పడిపోయాయి. దీనిపై ఐఏఎఫ్ దర్యాప్తునకు ఆదేశించింది. ఘటనకు సంబంధించిన వివరాలను ఐఏఎఫ్ చీఫ్ వీఆర్ చౌదరి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు. ఫ్లయిట్ డేటా రికార్డుల విశ్లేషణ అనంతరమే ఘటనకు దారి తీసిన కారణాలు తెలుస్తాయన్నారు. ఐఏఎఫ్ చరిత్రలో మిరాజ్, సుఖోయ్ ఢీకొనడం ఇదే తొలిసారి. దేశంలో గత 70 ఏళ్లలో ఇలాంటి 64 ప్రమాదాల్లో 39 మంది పైలట్లు ప్రాణాలు కోల్పోయారని వైమానిక నిపుణుడు అంచిత్ గుప్తా తెలిపారు.

కొలీజియం సిఫార్సులపై సాగదీత... ప్రజాస్వామ్యానికి పెను ముప్పు

న్యాయవ్యవస్థ కుప్పకూలుతుంది • జస్టిస్ నారిమన్

ముంబై: కొలీజియం వ్యవస్థపై కేంద్ర న్యాయ మంత్రి కిరెన్ రిజిజు చేస్తున్న విమర్శలను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రోహింటన్ ఫాలీ నారిమన్ శనివారం తీవ్రంగా తప్పుబట్టారు. ‘‘సాధారణ పౌరునిగా కొలీజియంతో పాటు ప్రతి వ్యవస్థనూ విమర్శించవచ్చు. కానీ ఒక బాధ్యతాయుతమైన మంత్రిగా మాత్రం నియమ నిబంధనలకు, కట్టుబాట్లకు లోబడి ఉండాల్సిందే’’ అన్నారు. కొలీజియం సిఫార్సు చేసిన పేర్లను కేంద్ర ప్రభుత్వం సుదీర్ఘకాలం పాటు పెండింగ్‌లో పెడుతున్న వైనాన్ని ప్రజాస్వామ్యానికి పెను ముప్పుగా ఆయన అభివర్ణించారు. ‘‘నిర్భీతితో కూడిన స్వతంత్ర న్యాయమూర్తులు లేకుండా పోతే పరిస్థితేమిటి? న్యాయ వ్యవస్థ మన చివరి ఆశా కిరణం. అది కూడా కుప్పకూలితే దేశానికిక చీకటి రోజులే. తప్పో, ఒప్పో.. 1993 నాటి సుప్రీంకోర్టు తీర్పు ద్వారా కొలీజియం వ్యవస్థ పుట్టుకొచ్చింది. దాన్ని గౌరవించడం కేంద్రం విధి. ఎందుకంటే అన్ని వ్యవస్థలూ సుప్రీంకోర్టు తీర్పులకు కట్టుబడాల్సిందే’’ అన్నారు. తనకు అనుకూలమైన కొలీజియం వచ్చి పాత సిఫార్సులపై పునరాలోచన చేస్తుందనేది కేంద్రం వైఖరి అని అభిప్రాయపడ్డారు. అందుకే కొలీజియం సిఫార్సులపై 30 రోజుల్లోగా కేంద్రం స్పందించని పక్షంలో దాన్ని అంగీకారంగానే పరిగణించేలా ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించాలన్నారు.

త్రిపురలో 54 మందితో బీజేపీ జాబితా

న్యూఢిల్లీ: ఫిబ్రవరి 16న జరగనున్న త్రిపుర అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ 54 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. ఇందులో కేంద్ర మంత్రి ప్రతిమా భౌమిక్ పేరు కూడా ఉన్నారు. ఆమె ధన్‌పూర్ నుంచి, సీఎం మాణిక్ సాహా బోర్దోవాలి నుంచి బరిలో దిగుతున్నారు. ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపీఎఫ్‌టీ)తో సీట్ల సర్దుబాటు ఖరారైందని సాహా చెప్పారు. బీజేపీ 55 చోట్ల, ఐపీఎఫ్‌టీ 5 స్థానాల్లో పోటీ చేస్తాయన్నారు. అసెంబ్లీలోని 60 సీట్లకు 2018 ఎన్నికల్లో బీజేపీ, ఐపీఎఫ్‌టీ 43 స్థానాలను గెలుచుకున్నాయి. మరోవైపు విపక్ష సీపీఎం, కాంగ్రెస్ కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయి.

అడుగంటిన విదేశీ మారక నిల్వలు

అల్లాడుతున్న పాకిస్తాన్

ఇస్లామాబాద్: పీకల్లోతు ఆర్థిక సంక్షోభంతో అష్టకష్టాలు పడుతున్న పాకిస్తాన్‌కు విదేశీ రుణాలు సైతం దొరకడం లేదు. 2022లో జూలై నుంచి డిసెంబర్ వరకు కేవలం 5.6 బిలియన్ డాలర్ల రుణాలు లభించాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) రుణ కార్యక్రమాన్ని పునరుద్ధరించే విషయంలో సకాలంలో నిర్ణయం తీసుకోకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందంటున్నారు. విదేశీ మారక నిల్వలు 3.1 బిలియన్ డాలర్లకు అడుగంటాయి. కొత్త అప్పులు పుట్టడం లేదు. తీసుకున్న అప్పులపై వడ్డీలు భారీగా పెరిగిపోతున్నాయి. వాటి చెల్లింపుకూ అప్పులే గతి!

క్రెడిట్ రేటింగ్ దెబ్బ


పాకిస్తాన్‌కు డిసెంబర్‌లో 532 మిలియన్ డాలర్ల రుణం లభించింది. ఇందులో 44 శాతం అంటే.. 231 మిలియన్ డాలర్లను ఆసియన్ అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) రుణంగా ఇచ్చింది. పాక్ ప్రభుత్వం చాలా దేశాలకు చెల్లింపులు చేయాల్సి ఉంది. గత ఏడు రోజుల్లో చైనా ఆర్థిక సంస్థలకు 828 మిలియన్ డాలర్లు చెల్లించింది.



ఢిల్లీలో శనివారం బీటింగ్ రిట్రీట్ వేడుక ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ సందర్భంగా జరిగిన డ్రోన్ షోలో పలు ఆకృతులు ఇలా కనువిందు చేశాయి

మొఘల్ గార్డెన్స్ ఇక... అమృత్ ఉద్యాన్

వ్యతిరేకిస్తున్న విపక్షాలు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వద్ద ఉన్న చారిత్రక మొఘల్ గార్డెన్స్ పేరు మారింది. మొఘల్ గార్డెన్స్ పేరును అమృత్ ఉద్యాన్‌గా ప్రభుత్వం మార్చి వేసింది. అమృత్ ఉద్యాన్ జనవరి 31 నుంచి ప్రజల సందర్శనార్థం తెరచి ఉంటుందని శనివారం రాష్ట్రపతి భవన్ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా రాష్ట్రపతి భవన్‌లోని మొఘల్ గార్డెన్స్ సహా అన్ని గార్డెన్లను కలిపి ఇకపై ‘అమృత్ ఉద్యాన్’గా పిలుస్తారు. ఏటా సాధారణ ప్రజల సందర్శనకు వీలుగా ఈ గార్డెన్స్ (హెర్బల్ గార్డెన్, బోన్సాయ్ గార్డెన్, సెంట్రల్ లాన్, లాంగ్ గార్డెన్, సర్క్యులర్ గార్డెన్) దాదాపు 2 నెలల పాటు తెరిచి ఉంటాయి. కాగా ఈ ఏడాది రాష్ట్రపతి భవన్ ఉద్యానోత్సవ్ –2023ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదివారం ప్రారంభించనున్నారు. అనంతరం జనవరి 31 నుంచి మార్చి 26వ తేదీ వరకు సాధారణ ప్రజానీకానికి, మార్చి 28 నుంచి 31 వరకు కొన్ని ప్రత్యేక వర్గాల వారి కోసం అమృత్ ఉద్యాన్‌ను తెరిచి ఉంచనున్నారు. మార్చి 28న రైతులకు, మార్చి 29న వికలాంగులకు, మార్చి 30న రక్షణ బలగాలు, పారామిలిటరీ బలగాలు, పోలీసు సిబ్బందికి, మార్చి 31న గిరిజన మహిళల స్వయం సహాయక సంఘాలతో సహా మహిళలకు ప్రత్యేక ప్రవేశం కల్పించనున్నట్లు రాష్ట్రపతి కార్యాలయ డిప్యూటీ సెక్రటరీ నావికా గుప్త శనివారం మీడియాకు తెలిపారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండే 6 స్లాట్స్‌లో గంటకు 5 వేల నుంచి 10 వేల మంది సందర్శించేలా ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా అనుమతించనున్నారు. అమృత్ ఉద్యాన్‌లో ప్రత్యేక రంగుల తులిప్స్ మొక్కలతో పాటు, 40 రకాల సువాసనలు వెదజల్లే గులాబీలు, బ్లాక్, గ్రీన్ గులాబీలు సహా రకరకాల పూలు ఉన్నాయి. సందర్శకుల కోసం గార్డెన్స్‌లో 20 మంది గైడ్లు అందుబాటులో ఉంటారని రాష్ట్రపతి కార్యాలయం పేర్కొంది.

పేరు మార్పుపై ప్రతిపక్షాల విమర్శలు..

వలస పాలనకు సంబంధించిన మరో ఆనవాలును చెరిపేసినట్లు అధికార బీజేపీ పేర్కొంది. వలసవాద చిహ్నాలను లేకుండా చేయాలన్న విధానంలో భాగంగానే కొన్ని సంస్థల, ప్రాంతాల పేర్లు మార్చుతున్నట్లు తెలిపింది. ఇప్పటికే ఢిల్లీలోని ప్రఖ్యాత రాజ్‌పథ్‌కు కర్తవ్య పథ్‌గా పేరు పెట్టిన విషయం తెలిసిందే. అయితే, ప్రభుత్వం తీరుపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఇలాంటి విషయాలపై దృష్టి పెట్టడానికి బదులుగా దేశంలో ప్రబలిన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నించాలని ప్రతిపక్షాలు ప్రభుత్వానికి హితవు పలికాయి. ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాతో దేశ చరిత్ర మళ్లీ రాసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని టీఎంసీ, సీపీఎం విమర్శించాయి. ఈడెన్ గార్డెన్స్‌కు మోదీ గార్డెన్స్ అని కూడా పేరు పెడతారేమో, ఎవరికి తెలుసు? అంటూ టీఎంసీ ఎద్దేవా చేసింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం : 29 : జనవరి : 2023

విరగ్గాసిన మామిడి పూత



చింతామణి: చిక్కబళ్లాపుర జిల్లా చింతామణి తాలూకా మామిడి తోటలకు ప్రసిద్ధి చెందింది. ఈసారి మామిడి తోటలు దండిగా పూతతో రైతుల్లో ఆశలు నింపాయి. తోటలు పూతతో నిండిపోవడం వల్ల దిగుబడి బాగా వస్తుందని ఆశాభావంతో ఉన్నారు.

న్యూస్‌రీల్

పార్టీలో అసమ్మతి లేదు: సీఎం

సాక్షి,బళ్లారి: రాష్ట్ర బీజేపీలో ఎలాంటి అసమ్మతి లేదని సీఎం బసవరాజ్ బొమ్మై అన్నారు. ఆయన శనివారం హుబ్లీ–ధారవాడలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. హుబ్లీ, బెళగావి తదితర జిల్లాల నాయకులతో రాష్ట్ర బీజేపీ నాయకుల్లో అభిప్రాయ బేధాలు ఉన్నాయన్న వార్తల్లో నిజం లేదన్నారు. అందరం కలిసికట్టుగా పని చేస్తున్నామన్నారు. బీజేపీని నిషేధించాలని డీకే శివకుమార్ వ్యర్థప్రేలాపనలు చేస్తున్నారన్నారు. కాగా, సీఎం బొమ్మై పుట్టినరోజు సందర్భంగా అమిత్ షాతో పాటు పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సగం అంబులెన్సులు బంద్?

శివాజీనగర: అత్యవసర సేవలు అందించే అంబులెన్స్‌లు మరమ్మతులు కారణంగా సగానికి సగం వాహనాలు బెంగళూరు నగరంలో నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. సిలికాన్ సిటీలో 709 అంబులెన్స్ ఉంటే వాటిలో 340 వాహనాలు నిలిపివేసేందుకు ఆరోగ్య శాఖ సిద్ధమైంది. ఇంతకు ముందు అంబులెన్స్ డ్రైవర్లు వేతనాల పెంపు కోసం సేవలకు బ్రేక్ వేశారు. ఇప్పుడు సాంకేతిక సమస్య పేరుతో వాహనాలు బంద్ చేయనున్నట్లు సమాచారం.

భార్యను హత్య చేసి భర్త ఆత్మహత్య




దినేశ్, శైలజారావ్ దంపతులు (ఫైల్)

యశవంతపుర: మంగళూరు సమీపంలోని కాఫీకాడ్ అపార్ట్‌మెంట్‌లో భార్యను హత్య చేసిన భర్త ఆత్మహత్య చేసుకున్నారు. శైలజా రావ్ (64)ను భర్త దినేశ్ హత్య చేసి అనంతరం తను ఉరి వేసుకున్నాడు. విశ్రాంత బ్యాంకు ఉద్యోగి అయిన దినేశ్ శుక్రవారం రాత్రి శైలజా గొంతు పిసికి హత్య చేశాడు. తరువాత అదే గదిలో ఉరి వేసుకున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నంజనగూడులో స్నాచింగ్

మైసూరు: టిఫిన్ తేవడానికి హోటల్‌కు వెళుతున్న మహిళ మెడలో మాంగళ్యం చైన్‌ను దుండగులు లాక్కొని పారిపోయిన సంఘటన మైసూరు జిల్లాలోని నంజనగూడు పట్టణంలో జరిగింది. తాలూకాలోని దేబూరుకు చెందిన పద్మమ్మ (57) తన కుమార్తెకు అనారోగ్యంగా ఉండడంతో నంజనగూడులోని ఆస్పత్రిలో చేర్పించింది. శనివారం ఉదయం ఆమెకు టిఫిన్ తేవాలని దగ్గరిలోని హోటల్‌కు నడిచి వెళ్తుండగా బైకుపై వచ్చిన దుండగులు ఆమె మెడలో ఉన్న సుమారు 30 గ్రాముల బంగారం మాంగళ్య చైన్‌ను లాక్కొని పారిపోయారు. బాధితురాలు నంజనగూడు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బాలికపై అఘాయిత్యం.. కామాంధునికి 10ఏళ్ల జైలు

యశవంతపుర: నాగదోషం ఉందని నమ్మించి మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కామాంధునికి బెంగళూరు కోర్టు 10 ఏళ్ల కఠిన కారాగారశిక్ష విధించింది. నిందితుడు నగరంలో సింగసంద్రలో మెడికల్ గ్యాస్ సిలిండర్ల వ్యాపారం చేసేవాడు. నిత్యం షాపులో దేవుని ఫోటోలకు స్థానిక మహిళలు, చిన్నారులను పిలిచి ధూపం అంటించేవాడు. 2021 జులై 7న ఉదయం ఓ మహిళ అతని షాపునకు వెళ్లింది. మంజునాథ్ బాలికను చూసి నాగదోషం ఉందని నమ్మించాడు. పరిహారం కోసం పూజా సామాగ్రిని తీసుకురాలని మహిళను బయటకు పంపి మైనర్ బాలికపై లైంగికదాడి చేశాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. కోర్టులో విచారణలో నేరం రుజువు కావడంతో 10 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధించింది.

ప్రతిపక్షాల పరిపాలనలో అధోగతి



బెళగావి వద్ద జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న అమిత్ షా



ధార్వాడ వద్ద అమిత్ షా రోడ్ షోలో జన సందోహం

- కాంగ్రెస్, జేడీఎస్‌లవి కుటుంబ రాజకీయాలు
- బీజేపీతోనే దేశ ప్రగతి సాధ్యం
- ధార్వాడ, బెళగావి సభల్లో కేంద్రమంత్రి అమిత్ షా

సాక్షి, బళ్లారి: కాంగ్రెస్, జేడీఎస్‌లు ఈ రాష్ట్రానికి చేసిందేమీ లేదని, ఆ రెండు పార్టీలు కుటుంబ, అవినీతి పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా అన్నారు. మరో మూడు నెలల్లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగుతుండటంతో ధారవాడ వద్ద కుందగోళ, బెళగావి వద్ద ఎంకే హుబ్లీలో ఆయన శనివారం విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. వరుసగా ప్రారంభోత్సవాలు, రోడ్ షోలు, సభల్లో పాల్గొన్నారు.

రాష్ట్రానికి ద్రోహం చేశారని ధ్వజం

అన్ని సభల్లోనూ ప్రతిపక్ష కాంగ్రెస్, జేడీఎస్‌లపై విరుచుకుపడ్డారు. అమిత్ షా ఏమన్నారంటే.. కాంగ్రెస్ ఈ దేశానికి, రాష్ట్రానికి ఎంతో ద్రోహం చేసింది. ఆ పార్టీకి దేశ వ్యాప్తంగా జనం చరమగీతం పాడారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చి ఏటీఎంలా వాడుకోవాలని చూస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను వారి కలలు సాకారం కాబోవు. పోలీసుల థర్డ్ డిగ్రీలకు కాలం ఎలా చెల్లిపోయిందో అవినీతి, అక్రమాలు, కుటుంబ రాజకీయాలు చేసే పార్టీలకు కాలం కూడా కాలం చెల్లిపోయింది. రాష్ట్రంలో మళ్లీ బీజేపీని అధికారంలోకి తెచ్చి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని బలపరచాలి. మళ్లీ కేంద్రంలో కూడా బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్క కన్నడిగుడు తమ వంతు తోడ్పాటును అందించాలి అని పిలుపునిచ్చారు. ఆర్టికల్– 370ని తొలగించడంతో కశ్మీర్ భారత భూభాగంలో ఒకటి అయ్యిందన్నారు.

మహదాయి నీటిని ఇప్పించాం

రాష్ట్రానికి ప్రతిపక్షాలు చేసింది శూన్యమని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారు చేసిన పాపాలను కడిగి వేస్తున్నామని అమిత్ షా అన్నారు. 2007 గోవాలో సోనియాగాంధీ ప్రసంగంలో కర్ణాటకకు మహదాయి నీరు విడిచేది లేదన్నారు. ఆమె మాటలు కర్ణాటకకు ఎంతో ద్రోహం చేశాయన్నారు. అయితే బీజేపీ రెండు రాష్ట్రాలతో సమన్వయ సాధన చేసి ఇటు కర్ణాటక, అటు గోవాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతులకు నీరు ఇప్పించామన్నారు. కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలకు నేను ఒకటే ప్రశ్న అడుగుతున్నా..మీరు ఈ రాష్ట్రానికి ఎలాంటి మేలు ఒకటి చేసినా చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు కర్ణాటక కాంగ్రెస్ పార్టీ ఏటీఎంలా మారుతుందని, అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో అన్ని వర్గాలకు మేలు జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, సీఎం బసవరాజ్ బొమ్మై, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రోడ్ షోలలో భారీసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



బెళగావి వద్ద ఎంకే హుబ్లీ సభలో అభివాదం

వీడిన రూ.80 లక్షల దోపిడీ మిస్టరీ

- గత డిసెంబరులో బెంగళూరులో నకిలీ పోలీసుల అరాచకం
- ముగ్గురు బడా నేరగాళ్ల ఆటకట్టు
- దుండగులు పాత నేరగాళ్లే



శివాజీనగర: బెంగళూరులో పట్టపగలే కారుతో సహా రూ.80 లక్షలు నగదు దోచుకొన్న కేసులో ముగ్గురు నిందితులను శనివారం అరెస్టు చేసినట్లు విల్సన్‌గార్డన్ పోలీసులు తెలిపారు. నిందితులు శివరామకృష్ణ యాదవ్ (19) షేక్ చింపతి లాల్ బాషా (36), షేక్ చింపతి జాకీర్ (27). నిందితులది కడప జిల్లా అని పోలీసులు చెప్పారు.

కారు, నగదుతో ఉడాయింపు ..

గత ఏడాది డిసెంబర్ 27న తుమకూరులో వక్క మండీ యజమాని మోహన్ తన పనివాళ్లు కుమారస్వామి, చందన్‌లకు రూ. 80 లక్షల నగదు ఇచ్చి బెంగళూరులో ఇవ్వాలని పంపించాడు. మధ్యాహ్నం వారిని బెంగళూరు శాంతినగరలో కేఎహెచ్.రోడ్డు వద్ద పోలీస్ అనే స్టిక్కర్ అతికించిన కారులో వచ్చి దుండగులు అడ్డుకున్నారు. ఇద్దరు దుండగులు కారులో ఎక్కి ముందుకు పోనిచ్చారు. తెలుగులో మాట్లాడుకొని లాఠీ చూపించి కారులో ఉన్నవారిని బెదిరించి దించేసి కారు, అందులోని నగదుతో ఉడాయించారు.

సొమ్ముతో అందర్–బాహర్ జూదం

నిందితులు దోచుకొన్న రూ.80 లక్షల్లో కొంతసొమ్మును అప్పులవారికిచ్చి రెండు రోజుల తరువాత బెంగళూరుకు వెనుతిరిగి వచ్చారు. ఓ హోటల్‌లో రూ. ఐదు లక్షల సొమ్ముతో అందర్ బాహర్ జూదమాడి కోటి రూపాయలను గెలుపొందారు. ఆ తరువాత మరో హోటల్‌లో అందర్ బాహర్ ఆడి వెనుక గెలుచుకున్న రూ. కోటిని కోల్పోయారు. అక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన వారు అక్కడ కూడా అందర్ బాహర్ ఆడి మొత్తం రూ.80 లక్షల నగదును కోల్పోయారు.

ఈలోపు హలసూరు గేట్, విల్సన్ గార్డెన్ పోలీసులు పలు విధాలుగా దర్యాప్తుచేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.37 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. లాల్ బాషా, జాకీర్‌లు అన్నదమ్ములు కాగా, చోరీ, దోపిడీలు, ఎర్ర చందనం స్మగ్లింగ్‌తో పాటు 80కి పైగా కేసులున్నట్లు తెలిసిందని సెంట్రల్ డీసీపీ శ్రీనివాస్‌గౌడ తెలిపారు.

దళపతి కోటలో చిచ్చు

- హాసన్ సీటు తనదేనన్న భవాని రేవణ్ణ
- ఇంకా నిర్ణయించలేదన్న కుమార



(ఇన్‌సెట్) భవాని రేవణ్ణ

సాక్షి బెంగళూరు: హాసన్ విధానసభ నియోజకవర్గం టికెట్ ప్రస్తుతం దళపతి హెచ్‌డీ దేవెగౌడ కుటుంబంలో చిచ్చు రేపుతోంది. ఇక్కడ జేడీఎస్ పార్టీ అభ్యర్థి తానేనని మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ భార్య భవానీ ప్రకటించడంతో విభేదాలు రచ్చకెక్కాయి. మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి ఇక్కడి నుంచి పోటీ చేయాలని అనుకోగా ఆయన ఆశలపై వదిన భవానీ నీళ్లు చల్లారు. ఆమెకు టికెట్‌పై ఇంకా నిర్ణయం తీసుకోలేదని కుమారస్వామి స్పష్టం చేయడంతో వివాదం పెద్దదయింది. అలాగే రాయచూరులో కూడా మీడియాతో మాట్లాడుతూ తాను హాసన్ టికెట్‌పై చెప్పాల్సింది చెప్పానని, ఇంక ఏమి చెప్పేది లేదని కుమారస్వామి ప్రకటించడం ద్వారా భవానీ రేవణ్ణకు టికెట్ ఇచ్చేది లేదన్నట్లు మాట్లాడడంతో ఏ మలుపు తిరుగుతుందోనని ఉత్కంఠ నెలకొంది.

బాబాయ్‌పై అబ్బాయి ఆగ్రహం

బాబాయి కుమార వ్యాఖ్యలపై భవాని తనయుడు, హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ఘాటుగా స్పందిస్తూ ఈ విషయాన్ని కుమారస్వామి కాదు, పార్టీ అధినేత దేవెగౌడ నిర్ణయిస్తారని చెప్పారు. ప్రజ్వల్ వ్యాఖ్యల్లో తప్పేమి లేదని, అభ్యర్థులను పార్టీ పార్లమెంటరీ మండలి తీర్మానిస్తుందని కుమారస్వామి తెలిపారు. అయినా తమ కుటుంబంలో ఎలాంటి భిన్నాభిప్రాయాలు లేవని, ఉన్నా సామరస్యంగా పరిష్కరించుకుంటామని, ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.

ఎయిర్‌పోర్టులో కొకైన్ స్వాధీనం

సాక్షి బెంగళూరు: కొకైన్‌ను తరలిస్తున్న వ్యక్తిని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద బెంగళూరు కస్టమ్స్ అధికారులు అరెస్టు చేశారు. సుమారు 686 గ్రాముల కొకైన్‌ను తరలిస్తుండగా పట్టుకుని ఆ మాదకద్రవ్యాలను సీజ్ చేశారు. నిందితుడు దుబై ద్వారా గినియా నుంచి బెంగళూరుకు విమానంలో వచ్చినట్లు శనివారం కస్టమ్స్ అధికారులు తెలిపారు. విశ్వసనీయ వర్గాల నుంచి అందిన పక్కా సమాచారం మేరకు తాము సోదాలు జరిపి నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈకే 566 విమానం నుంచి ఈ నెల 14న ప్రయాణించి వచ్చిన వ్యక్తి శరీర అంతర్భాగాలలో క్యాప్సుల్స్ రూపంలో ఉన్న 686 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని ఎన్‌డీపీఎస్ కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలించారు.

ఇది అక్రమాల సర్కార్: డీకేశి

శివాజీనగర: కాంగ్రెస్ పార్టీ చేపట్టిన యాత్ర బస్సు యాత్ర కాదని, ప్రజాయాత్ర అని కేపీసీసీ చీఫ్ డీకే శివకుమార్ అన్నారు. శనివారం కల్బుర్గిలో ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ మద్దతు లేనిదే అక్రమాల్లో ఎవ్వరూ కింగ్ పిన్ కాలేరని, ముఖ్యమంత్రి, హోం మంత్రి, డీజీపీతో పాటు అధికారుల ఆశీర్వాదం లేకుండా పీఎస్ఐ నియామక అక్రమాల్లో ఓఎంఆర్ షీట్లను దిద్దటానికి సాధ్యం కాదన్నారు. ఈ కుంభకోణం ప్రభుత్వ మద్దతోనే జరిగిందన్నారు. బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహ విశ్వవిద్యాలయాల్లో వీసీల నియామకానికి రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని ఆరోపించారు. ఇది అవినీతి, అక్రమాల ప్రభుత్వమని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వాన్ని తొలగించమే తమ పార్టీ లక్ష్యమన్నారు.

ఘరానా రౌడీకి జిల్లా బహిష్కారం

మైసూరు: అనేక ఆరోపణలతో పాటు పలు కేసుల్లో నిందితునిగా ఉన్న హుణసూరు రౌడీషీటర్ వీల్ వాసీంను పోలీసులు ఒక ఏడాది పాటు మైసూరు జిల్లా నుంచి బహిష్కరించారు. హుణసూరు ముస్లిం బ్లాక్‌లో నివాసం ఉంటున్న అక్రం షరీఫ్ కొడుకైన వీల్ వాసింపై స్థానిక పోలీసు స్టేషన్లో సుమారు 12 కు పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయి. దోపిడీలు, మహిళల పైన దాడులు, పోలీసుల పైన దాడులు, హత్యాయత్నం, మారణాయుధాలతో పట్టుబడడం నేరాల్లో నిందితుడు. పోలీసులు ఎన్నిసార్లు హెచ్చరించినా కూడా అతనిలో మార్పు రాకపోవడంతో సీరియస్‌గా తీసుకున్న జిల్లా ఎస్పీ సీమా లట్కర్ గూండా చట్టం కింద అతన్ని జిల్లా నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు.

శ్రీసూర్యం ప్రణామామ్యహం



మేలుకోటె ఆలయంలో స్వామి జాతర

- ఆలయాల్లో వైభవంగా రథసప్తమి వేడుకలు

మండ్య: లోకానికి వెలుగును పంచే రథ సప్తమి పర్వదినాన్ని శనివారం రాష్ట్రమంతటా ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో విశేష పూజలు, ఉత్సవాలు కనులవిందుగా సాగాయి. మండ్య నగరంతో పాటు జిల్లాలో ఉన్న వివిధ ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలను ప్రారంభించారు. శ్రీ లక్ష్మి జనార్దన స్వామి దేవాలయంలో, శ్రీరంగ పట్టణంలో ఉన్న శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో, కేఆర్ పేటె తాలూకాలోని హేమగిరిలో ఉన్న శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి మందిరం, మేలుకోటెలోని శ్రీ చెలువ నారాయణ స్వామి దేవాలయాల్లో ఉత్సవాలు జరిగాయి. రథసప్తమి సందర్భంగా మండ్య నగరంలో ఉన్న స్వర్ణసంద్ర లేఔట్‌లో ఉన్న శ్రీ శనేశ్వర స్వామి దివ్య రథోత్సవం వైభవంగా ఆచరించారు. మంగళూరు నగరంలోని రథ వీధిలో కొలువైన వెంకటరమణ స్వామి ఆలయంలో రథోత్సవం జరిగింది. పల్లకీలోని స్వామివారి ఉత్సవమూర్తులను తాకడానికి భక్తులు పోటీలు పడ్డారు.



మంగళూరులో వెంకటరమణ తేరు ఉత్సవం



మండ్య లక్ష్మి జనార్దనస్వామి ఆలయంలో సూర్య వాహనంపై స్వామివారు

ఊడిన ఆర్టీసీ బస్సు చక్రాలు



ఊడి రోడ్డు మీద పడిన బస్సు చక్రాలు

మైసూరు: ప్రయాణికులతో వెళ్తున్న బస్సు వెనుక చక్రాలు ఊడిన ఘటన మైసూరు జిల్లా హుణసూరు సమీపంలో ఉన్న యశోదపురం వద్ద శనివారం చోటు చేసుకుంది. అయితే ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాలు... మైసూరు నగర నుంచి సోమవారం పేటెకు వెళ్తున్న కేఎస్ ఆర్టీసీ బస్సు యశోదపురం వద్ద వెళ్తుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద ఒక్కసారిగా బస్సు వెనుక చక్రాలు పూర్తిగా ఊడిపోయాయి. ఆ సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. విషయాన్ని గమనించిన డ్రైవర్ బస్సును క్రమంగా నియంత్రించాడు. దీంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ప్రయాణికులను మరో బస్సులో పంపించారు.

వార్డెన్ కిరాతకం

- కుక్కను గోనెసంచిలో వేసి కొట్టి చంపేసిన వైనం



ఈ కుక్కనే హతమార్చాడు

యశవంతపుర: ఓ కుక్కను గోనెసంచిలో వేసి కొట్టి కిరాతకంగా చంపిన ఘటన ఉడుపి జిల్లా కాపులో వెలుగుచూసింది. అమానవీయ ఘటన వివరాలు... కాపు తాలూకా శిర్వకు చెందిన ప్రైవేట్ కళాశాలలో రాజేశ్ వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ఓ విద్యార్థి కుక్కతో ఆడుకోవడం చూసి సహించలేని వార్డెన్ రాజేశ్ కుక్కను దగ్గరకు తీసుకుని గోనెసంచిలో వేసి కట్టి కర్రతో కొట్టి చంపేశాడు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీనిపై నెటిజన్లు మండిపడ్డారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంజుల కక్కేర అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వన్యజీవుల స్మగ్లింగ్ ముఠా రట్టు



స్వాధీనం చేసుకున్న అరుదైన పాములు

- బెంగళూరు విమానాశ్రయంలో ముగ్గురు అరెస్టు
- అరుదైన సరీసృపాల స్వాధీనం

యశవంతపుర: అంతర్జాతీయస్థాయి వన్యజీవులను స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయం పోలీసులు అరెస్ట్ చేశారు. అరుదైన జాతికి చెందిన సరీసృపాలను స్వాధీనం చేసుకొని ఒక మహిళతో పాటు ముగ్గురిని పట్టుకున్నారు. ఈ నెల 22న తమిళనాడుకు చెందిన మహిళతో పాటు ముగ్గురు ప్రయాణికులు బ్యాంకాక్ నుంచి బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో దిగారు. అధికారులు వారి లగేజీని పరిశీలించగా వన్యజీవులు బయట పడ్డాయి. 6 కొండ చిలువలు, 14 పాములు , ఇతర జంతువులు ఉన్నాయి.

బ్యాంకాక్ నుంచి తరలింపు

బ్యాంకాక్ విమానాశ్రయంలో వీరు ఒక ప్రత్యేకమైన బ్యాగులో వన్యజీవులను రహస్యంగా పెట్టుకొని విమానం ఎక్కారు. బెంగళూరులో దిగాక పోలీసులకు అనుమానం వచ్చి తనిఖీలు చేయగా వన్యజీవులు బయట పడ్డాయి. నిందితులను విచారించగా బెంగళూరు సమీపంలో ఫాంహౌస్‌లలో ఉంచిన అనేక అరుదైన పాములను కనుగొన్నారు. తెలుపు–పసుపు రంగు ఉన్న అనకొండ పాము, అమెజాన్ చిలుక, నైల్ మానిటర్, తెలుపు తాబేలున్నాయి. 48 జాతులకు చెందిన 139 వన్యజీవులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఊసరవెల్లి, రకూన్ వంటి జంతులువు కూడా ఉన్నాయి. నిందితులు విదేశాలకు వెళ్లి అక్కడి నుంచి అరుదైన వన్యజీవులను తీసుకొచ్చి ఇక్కడ సంపన్నులకు అధిక ధరలకే అమ్మేవారని గుర్తించారు. కేసును విచారణలో ఉంది.

క్లుప్తంగా

విద్యుత్ ఉపకేంద్రం ఉన్నతీకరణ పనులు షురూ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి: ఎమ్మిగనూరులో రూ.16.20 కోట్లతో ఏర్పాటు చేసిన 22 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని 110 కేవీగా ఉన్నతీకరణ చేసే పనులకు శనివారం ఎమ్మెల్యే జేఎన్ గణేష్ భూమిపూజ చేశారు. ఎమ్మిగనూరు మఠాధిపతి వామదేవ శివాచార్యులు కార్యక్రమానికి సాన్నిధ్యం వహించి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండి కూడా ఎమ్మెల్యే గణేష్ మంచి పనితీరు కనబరుస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటిగి–ఎమ్మిగనూరు రోడ్డు, ఎమ్మిగనూరుకు బైపాస్ రోడ్డును తలా రూ.కోటి నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. జీపీ అధ్యక్షురాలు సీ.అంజినమ్మ, సభ్యులు, పీడీఓ తారు లక్ష్మణనాయక్, ప్రముఖులు సదాశివప్ప, నాగలింగస్వామి, ఖాసిం సాబ్, షణ్ముఖప్ప, వెంకట్రామరాజు, ఎల్.శ్రీనివాసులు, రామానాయుడుతో పాటు ఏఈఈ విజయకుమార్ పాల్గొన్నారు.

జిల్లాధికారిపై వేటుకు డిమాండ్

సాక్షి,బళ్లారి: బళ్లారి జిల్లాధికారి ఎం.పవన్ కుమార్‌ని సస్పెండ్ చేయాలని అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు సిద్దరామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తనను బెంగళూరులో విద్యార్థి సంఘం నాయకులు కలుసుకుని బళ్లారి జిల్లాధికారి తీరుపై ఫిర్యాదు చేయడంతో ఆయన పైవిధంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సమస్యలు పరిష్కరించాల్సిన జిల్లాధికారి తీసుకున్న నిర్ణయం ఎంతమాత్రం సమంజసంగా లేదన్నారు. విద్యార్థులకు పిడికెడు అన్నం పెట్టలేని వార్డెన్లపై చర్యలు తీసుకోవాల్సింది పోయి విద్యార్థులను హాస్టల్ నుంచి బయటకు పంపించడంలో ఆంతర్యమేంటని మండిపడ్డారు. తక్షణం బళ్లారి జిల్లాధికారి పవన్‌ను విధుల నుంచి తప్పించాలన్నారు.

పంట నష్టపరిహారం ఏదీ?



మాట్లాడుతున్న చామరస మాలిపాటిల్

రాయచూరు రూరల్: గత ఖరీఫ్ సీజన్‌లో అతివృష్టితో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం అందించాల్సిన నష్టపరిహారం ఇంతవరకు రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి చేరలేదని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు చామరస మాలిపాటిల్ ఆరోపించారు. ఆయన శనివారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. 2019 నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద చెల్లించే నష్టపరిహారం అందలేదన్నారు. అయితే వ్యవసాయ శాఖా మంత్రి బీసీ పాటిల్ రైతులను తప్పుదోవ పట్టించడానికి పరిహారం అందించామనడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో సర్వోదయ పార్టీ తరపున ఈసారి ఎన్నికల్లో ఐదు చోట్ల అభ్యర్థులను బరిలో నిలుపుతామన్నారు.

మంటలకు కారు ఆహుతి

హుబ్లీ: ప్రధాన రద్దీ రోడ్లలో నిలిపి ఉంచిన కారు మంటలకు ఆహుతి అయింది. అదృష్టవశాత్తు కారులో ఉన్న వారు తక్షణమే బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. హుబ్లీ విద్యానగర్ రిలయన్స్ మార్ట్ ఎదురుగా ఈ ఘటన జరిగింది. కారులో ముందుగా పొగలు రావడంతో అందులో ఉన్న వారు తక్షణమే బయటకు వచ్చారు. చివరికి అగ్నిమాపక దళం మంటలను ఆర్పి ప్రమాదాన్ని తప్పించాయి. హుబ్లీ విద్యానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన ఆందోళనకు గురి చేసింది.

వేడుకగా సవితా జయంతి



పాల్గొన్న అధికారులు, సిబ్బంది, సమాజ ప్రముఖులు

కంప్లి: సవితా సముదాయానికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సవితా సమాజ పట్టణ అధ్యక్షులు ఏ.హనుమంతప్ప ఒత్తిడి చేశారు. ఆయన సవితా మహర్షి జయంతిలో పాల్గొని మాట్లాడుతూ సవితా సముదాయానికి రాజకీయ ప్రాతినిథ్యం కల్పించాలన్నారు. ఇందుకోసం అన్ని జాతీయ పార్టీలు ఆసక్తి చూపాలన్నారు. అంతకు ముందు నటరాజ కళామందిరం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శిరస్తేదార్ ఎస్‌డీ.రమేష్, ఆర్ఐ గణేష్, వీఏ లక్ష్మణనాయక్, ప్రముఖులు కారేకల్ మనోహర్, సవితా సమాజ పదాధికారులు శ్రీనివాస్, ఎస్.గోవిందరాజు, ఎస్.శ్రీనివాస్, జీహెచ్.వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

సవితా మహర్షి బాట ఆదర్శం

రాయచూరు రూరల్ : సవితా మహర్షి బాట ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ పిలుపునిచ్చారు. శనివారం కన్నడ భవనంలో ఏర్పాటు చేసిన సవితా మహర్షి జయంతిని ప్రారంభించి చిత్రపటం ఊరేగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నగర సభ అధ్యక్షురాలు లలిత, ఏపీఎంసీ అధ్యక్షులు అచ్యుత్‌రెడ్డి, ఆర్డీఏ అధ్యక్షులు తిమ్మప్ప, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, కన్నడ సంస్కృతి శాఖాధికారిణి మంగళ నాయక్‌లున్నారు.

ఉత్సాహంగా..ఉల్లాసంగా గ్రామీణ క్రీడలు

- హంపీ ఉత్సవాల్లో పాస్‌ల ఎత్తివేత
- తొలి రోజున తగ్గిన జనం రద్దీతో ఈ నిర్ణయం అమలు



ప్రారంభిస్తున్న మంత్రి ఆనంద్‌సింగ్ తదితరులు



రాతి గుండును ఎత్తుతున్న పైల్వాన్



హంపీ ఉత్సవాల్లో కుస్తీ పోటీల దృశ్యం

సాక్షి,బళ్లారి: విజయనగర సామ్రాజ్య గత వైభవాన్ని గుర్తుకు తెచ్చుకునేలా ప్రతి ఏటా నిర్వహిస్తున్న హంపీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సరైన ప్రచారం, నిర్వహణ చేయకపోవడంతో తొలిరోజు ఆశించినంతగా జనం రద్దీ కనిపించలేదు. దీంతో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు జరిగే హంపీ ఉత్సవాల్లో ఎలాంటి పాస్‌లు లేకుండా ప్రతి ఒక్కరూ ఉత్సవాల్లో పాల్గొనవచ్చని ఆదేశాలు జారీ చేయడంతో కొంత జనసందడి కనిపించింది. శనివారం హంపీ ఉత్సవాల్లో రెండో రోజున ఉల్లాసంగా, ఉత్సాహంగా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామీణ కుస్తీ క్రీడా పోటీలను నిర్వహించడంతో జనం ఆసక్తిగా తిలకించారు. గాయత్రీ పీఠం ప్రధాన వేదికలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల వీక్షణకు పాస్‌లు తొలగించడంతో ప్రజలకు కొంత మేలు జరిగింది. హంపీ ఉత్సవాల్లో విధించిన విపరీతమైన నిబంధనలతో జనం రద్దీ తగ్గడంతో తొలిరోజు సీఎం బసవరాజ్ బొమ్మై అక్షింతలు వేసినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లా యంత్రాంగం మేల్కొని రెండు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా జనోత్సవంగా మార్చే పనిలో నిమగ్నమయ్యారు.

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

బళ్లారిఅర్బన్: హంపీ ఉత్సవాల్లో రెండో రోజు శనివారం ఆయా వేదికల వద్ద ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నాయి. కేరళ బృందం బోంబిఫింజన్, బెంగళూరు బృందం సాంస్కృతిక నృత్యాలు, సంగీత రస మంజరి, బాలీవుడ్ నృత్యరూపక రసమంజరి కార్యక్రమాలను గాయత్రి పీఠం వేదికలో మంత్రి ఆనంద్ సింగ్ డోలు కొట్టి ప్రారంభించారు. పర్యాటకులు బోటింగ్, హంపీ బైస్కై, కుస్తీ తదితర గ్రామీణ క్రీడా పోటీల్లో జనం ఉత్సాహంగా పాల్గొన్నారు. హంపీ బైస్కై ద్వారా వీక్షించేందుకు రెండు హెలికాప్టర్లు ఏర్పాటు చేయడంతో జనం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా హంపి బైస్కైకు మంచి స్పందన లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు. హంపీకి విచ్చేసిన విదేశీయులు అందమైన హంపీ కొండల్లో యోగా, కొండలు ఎక్కడం తదితర సాహస క్రీడల్లో పాల్గొంటున్నారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

హొసపేటె: హంపీ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం కుస్తీ పోటీలు సందర్శకులను ఎంతో ఆకట్టుకున్నాయి. హంపీ రోడ్డులోని హొసమలపనగుడి వద్ద ఏర్పాటు చేసిన కుస్తీ పోటీలను మంత్రి ఆనంద్‌సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉత్సవాల్లో కుస్తీ పోటీలతో గ్రామీణ క్రీడా పోటీలకు పెద్ద పీట వేశామన్నారు. ఇలాంటి పోటీలతో కనుమరుగవుతున్న గ్రామీణ క్రీడలను కాపాడుకునేందుకు వీలవుతుందన్నారు. ఈ పోటీల్లో పురుషులు, మహిళలు పాల్గొనడం అభినందనీయం అన్నారు. బళ్లారి, విజయనగర జిల్లాల నుంచి కాకుండా వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోటీదారులు ఉత్తమ ప్రదర్శన నిచ్చారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.5 వేలను అందిస్తున్నట్లు తెలిపారు.

రసవత్తరంగా రాతిగుండు ఎత్తే పోటీలు

హంపీ ఉత్సవాల సందర్భంగా రెండో రోజు శనివారం హంపీ రోడ్డులోని హొసమలపనగుడి వద్ద ఏర్పాటు చేసిన రాతిగుండు ఎత్తే పోటీలు ఎంతో ఆకట్టుకున్నాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన పురుషులు 100 కేజీల బరువు నుంచి 165 కేజీల్లోపు బరువు గల రాతి గుండును ఎత్తే పోటీల్లో పాల్గొన్నారు. పోటీదారులు తమ సామర్థ్యాన్ని బట్టి రాతిగుండు ఎత్తే పోటీల్లో పాల్గొన్నారు.

సాహస క్రీడలు అబ్బురం

సాహస క్రీడల్లో యువత ఆసక్తిగా పాల్గొన్నారు. హంపీలోని సాసివెకాళు గణపతి ఆలయ ముందు భాగంలోని రాతి కొండపై సాహస క్రీడా పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో తాడుతో యువత కొండరాళ్ల పైకెక్కి సత్తా చాటారు. అదే విధంగా విదేశీయులు కూడా రాక్ క్లైంబింగ్ పోటీల్లో పాల్గొన్నారు.

జల క్రీడలు భళా.!

హంపీ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం జలక్రీడా పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువతీ యువకులతో పాటు చిన్నారులు, విదేశీయులు చురుకుగా పాల్గొన్నారు.



హెలికాప్టర్‌లో హంపీ బైస్కైకి వెళ్లి వస్తున్న సందర్శకులు



ఉత్సవాల్లో కూచిపూడి నృత్యకళాకారుల ప్రదర్శన



ఉత్సవాలకు హాజరైన ప్రేక్షకులు

వైభవంగా రథసప్తమి వేడుకలు



రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తులు

గంగావతి రూరల్: రథసప్తమిని పురస్కరించుకొని హిరేజంతకల్ విరూపాక్షేశ్వర ఆలయంలో ఉదయం నుంచి భక్తులు బారులు తీరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం తహసీల్దార్ యూ.నాగరాజ్, సిబ్బందితో కలసి పూజలు చేయగా, సాయంత్రం విరుపాక్షేశ్వర స్వామి రథోత్సవాన్ని ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి రథాన్ని లాగి ప్రారంభించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. భక్తుల కోలాటాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. రథోత్సవంలో వేలాదిగా భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రాఘవేంద్ర శెట్టి, మాజీ కాడా అధ్యక్షులు తిప్పేరుద్రస్వామి, లలితారాణి శ్రీరంగదేవరాయలు, మాజీ కౌన్సిలర్ హుసేనప్ప హంచనాళ్, చౌడ్కి రమేష్, వాసు నవలి, నవీన్ పాటిల్, శివప్ప మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి ఉత్సవం

రాయచూరు రూరల్: నగరంలోని వేంకటేశ్వరాలయంలో రథసప్తమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఉప్పార సమాజ మహాసభ ఆధ్వర్యంలో ఉప్పారవాడి లక్ష్మీ వేంకటేశ్వరాలయంలో లక్ష్మీవేంకటేశ్వరుడికి పూజలు, నగరేశ్వరాలయంలో వైశ్య సమాజం ఆధ్వర్యంలో స్వామివారిని ఊరేగించారు.

సోమనాథేశ్వర సన్నిధిలో..

కోలారు : తాలూకాలోని అరాభికొత్తనూరు గ్రామంలో శనివారం రథసప్తమిని పురస్కరించుకుని ప్రసన్న సోమనాథేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవ వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. రథాన్ని పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు రథం మీదకు పండ్లు, దవనం విసిరి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవంలో మాజీ మంత్రి వర్తూరు ప్రకాష్, జేడీఎస్ నాయకుడు సీఎంఆర్ శ్రీనాథ్, హరీష్, కేయూడీఏ మాజీ అధ్యక్షుడు ఓం శక్తి చలపతి, జీపీ అధ్యక్షుడు రాజణ్ణ, సభ్యుడు నంజుండేగౌడ, రేణుక, కవిత తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ టాయ్‌లెట్లో విద్యార్థిని మృతి

- దక్షిణ కన్నడ జిల్లాలో సంఘటన

యశవంతపుర: బాలిక అనుమానస్పదంగా మృతి చెందిన ఘటన దక్షిణ కన్నడ జిల్లా బెళ్తంగడి తాలూకా గేరుకట్టలో జరిగింది. బాలిక అసీఫా (16) బెళ్తంగడి పట్టణంలోని ప్రైవేట్ కాలేజీలో ఫస్ట్ పీయుసీ చదువుతోంది. శనివారం ఉదయం గేరుకట్ట నుండి బస్‌లో కాలేజీకి వెళ్లింది. మరుగుదొడ్డిలోకి వెళ్లిన ఆమె ఎంతసేపటికీ బయటకు రాలేదు. అనుమానం వచ్చిన కాలేజీ యజమాన్యం తండ్రి అబ్దుల్ కరీంకు ఫోన్ చేసి పిలుపించుకొని చూశారు. ఆరోగ్యం విషమించిన అసీఫాను గురువాయనకెరెలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

బస్ నుంచి పడి డిగ్రీ విద్యార్థి...

ఉడుపి జిల్లా కుందాపురలో బస్ ఫుట్‌బోర్డుపై నిలబడి కాలేజీకి వెళ్తున్న సుదీప్ (20) అనే విద్యార్థి దుర్మరణం చెందాడు. సుదీప్ చివరి ఏడాది బీకాం చదువుతున్నాడు. శనివారం ఉదయం సాగర నుంచి కుందాపురకు బస్‌లో వెళ్తుండగా బస్‌స్టాప్ వద్ద బస్ నిలపకుండానే దిగడానికి యత్నించి జారిపడ్డాడు. గాయాలైన అతడిని ఆస్పత్రిలో చేర్పించగా సాయంత్రం మృతి చెందాడు. బస్‌లో రద్దీ వల్ల స్థలం లేకపోవడంతో ఫుట్‌బోర్డుపై వెళ్తూ ప్రాణాలు కోల్పోయాడు. కుందాపుర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సాగునీటి పథకాలను పూర్తి చేస్తాం

- మాజీ సీఎం కుమారస్వామి



ప్రారంభిస్తున్న మాజీ సీఎం కుమారస్వామి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో జేడీఎస్ పార్టీ అధికారంలోకి వస్తే భారీ సాగునీటి పథకాలకు ప్రాధాన్యత నిచ్చి పూర్తి చేస్తామని మాజీ సీఎం కుమారస్వామి పేర్కొన్నారు. ఆయన శనివారం తాలూకాలోని మిట్టి మల్కాపూర్‌లో ఏర్పాటు చేసిన పంచరత్నయాత్ర ప్రచారసభలో మా ట్లాడారు. కేంద్రంలో అధికారం చెలాయించిన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు మహదాయి పథకంపై నిర్లక్ష్యం వహించాయని ఆరోపించారు. తన హయాంలో రైతు రుణాలను మాఫీ చేశానని గుర్తు చేశారు. గాలి జనార్దన రెడ్డి పెట్టిన పార్టీతో తమ పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు సాగునీటిని అందించి రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. జిల్లాధ్యక్షుడు విరుపాక్షి, ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్, శివశంకర్, నరసింహులు, లక్ష్మిపతి, రామకృష్ణ, యూసుఫ్‌ఖాన్, సన్న నరసింహ నాయక్, వినయ్‌కుమార్, అంజనేయలున్నారు.

నకిలీ విడిభాగాల సీజ్

శివాజీనగర: నకిలీ స్టీల్ థ్రెడ్ సాకెట్లను నిల్వచేసిన గోడౌన్‌పై సీసీబీ పోలీసులు దాడిచేసి నిందితుడిని అరెస్ట్ చేసి రూ.9.69 లక్షలు విలువచేసే వస్తువులను స్వాధీనం చేసుకొన్నారు. సోమనాథ్ బన్సాల్ అరెస్ట్ అయిన నిందితుడు. ఇతని నుండి సుమారు 128 బాక్సుల 3030 థ్రెడ్ సాకేట్‌లను స్వాధీనం చేసుకొన్నారు. రాజ్‌కోట్ నుంచి తీసుకొని వచ్చి నిందితుడు విల్సన్ గార్డన్ పోలీస్ స్టేషన్ వ్యాప్తిలోని లాల్ బాగ్ రోడ్డులోని ఒక గోడౌన్‌లో నిల్వ చేశాడు. వీటిని ప్రముఖ కంపెనీవని విక్రయించేవాడు.

కవిగోష్టులు నిరంతరం సాగాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ వీసీ డాక్టర్ మల్లికా ఘంటి

హొసపేటె: కవిగోష్టిలు కేవలం ఉత్సవాల్లో మాత్రమే కాకుండా నిరంతరంగా కవిగోష్టులు జరగాలని రిటైర్డ్ వైస్ చాన్సలర్ డాక్టర్ మల్లికా ఘంటి తెలిపారు. శనివారం హంపీ ఉత్సవాల్లో రెండో రోజు విరుపాక్షేశ్వరాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కవిగోష్టిని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈసందర్భంగా కవులు పరశురామ్, డాక్టర్ దయానంద కిన్నాళ్, డాక్టర్ రంగనాథ తదితరులు తమ సాహిత్యాన్ని కవిత్వం ద్వారా ఆహుతులకు తెలియపరిచారు.

రెండు బైక్‌లు ఢీకొని యువకుడు మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



ఘటన స్థలంలో మృతి చెందిన సంపత్‌కుమార్

బళ్లారిఅర్బన్: ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అనంతపురం రోడ్డులో మహీంద్ర షోరూం సమీపంలో శనివారం రెండు బైక్‌లు ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బిసిలహళ్లికి చెందిన సంపత్‌కుమార్(20) అనే యువకుడు బళ్లారి నుంచి బిసిలహళ్లికి వెళుతుండగా మీనపల్లి నుంచి బళ్లారి వైపునకు జీ.భాస్కర్, బసవరాజు అనే ఇద్దరు యువకులు వస్తున్న బైక్ రెండూ పరస్పరం ఢీకొనడంతో సంపత్‌కుమార్ ఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి, తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు యువకులను విమ్స్ ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కోలారు వార్తలు...

క్రీడా పోటీలతో ఉద్యోగులకు ఆరోగ్యం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు : నిత్యం ఒత్తిడి మధ్య విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు తరచుగా క్రీడల్లో పాల్గొంటే ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎంపీ ఎస్ మునిస్వామి తెలిపారు. ఆయన శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యాలయానికి వచ్చే ప్రజలతో ఉద్యోగులు సౌజన్యంగా వ్యవహరించాలన్నారు. కోవిడ్ సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహించిన పాత్ర శ్లాఘనీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ, జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సురేష్‌బాబు పాల్గొన్నారు.

వసతి పాఠశాలల్లో ప్రవేశంపై జాతా



జాగృతి జాతా నిర్వహిస్తున్న విద్యార్థులు

శ్రీనివాసపురం : తాలూకాలోని మదనహళ్లి వద్ద ఉన్న మొరార్జీ దేశాయి వసతి పాఠశాలలో స్థానం కోసం 2023–24వ సంవత్సరానికి గాను అర్హతా పరీక్ష రాయడంపై గ్రామంలో శనివారం జాగృతి జాతాను పట్టణంలో ప్రారంభించారు. అంబేడ్కర్ వసతి పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశప్ప మాట్లాడుతూ అర్హతా పరీక్ష దరఖాస్తుకు ఫిబ్రవరి 2 చివరి తేదీ అని, 13న పరీక్ష జరుగుతుందని తెలిపారు. మొరార్జీ దేశాయి, కిత్తూరు రాణి చెన్నమ్మ, అంబేడ్కర్ వసతి పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి ఈ అర్హతా పరీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వసతి పాఠశాల విద్యార్థులు పట్టణ వీధులలో జాతా నిర్వహించారు.

బీజేపీ గెలుపు తథ్యం

శ్రీనివాసపురం : కోలారు నుంచి సిద్దరామయ్యే కాకుండా ఎవరు పోటీ చేసినా బీజేపీ గెలుపు ఖాయమని ఎమ్మెల్సీ ఛలవాది నారాయణస్వామి తెలిపారు. శనివారం రామసంద్రలో రూ. 3.5 లక్షల తన ఎమ్మెల్సీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ దీపాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చాముండేశ్వరిలో ప్రజలకు అన్యాయం చేయడం వల్లనే అక్కడ ప్రజలు సిద్దరామయ్యకు గుణపాఠం చెప్పారన్నారు. ప్రతి వ్యక్తి దేశంలో ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చన్నారు. కోలారులో సిద్దరామయ్యను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సిద్దరామయ్య చాముండేశ్వరిలో మాదిరిగానే కోలారులో కూడా ఓడిపోతారని జోస్యం చెప్పారు. బీజేపీ నాయకుడు నంజుండేగౌడ, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, కెంబోడి నారాయణస్వామి పాల్గొన్నారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

కేజీఎఫ్ : కేంద్రం, రాష్ట్రాల్లో అభివృద్ధి కేవలం బీజేపీ వల్లనే సాధ్యమని తాలూకాలోని కమ్మసంద్ర జీపీ అధ్యక్షుడు బి.సురేష్ తెలిపారు. శనివారం తాలూకాలోని యర్నగానహళ్లిలో నిర్వహించిన విజయసంకల్ప యాత్ర అభియాన్‌ను ప్రారంభించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం బసవరాజ్ బొమ్మై నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. విజయ సంకల్ప యాత్ర ద్వారా ప్రతి కార్యకర్త ప్రభుత్వ సాధనలను ప్రజలకు తెలియజేయాలన్నారు. విజయ సంకల్ప అభియాన్‌ను ప్రతి బూత్ స్థాయిలో నిర్వహించి పార్టీని సంఘటితం చేయాలన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు శివారెడ్డి, సురేష్, నవీన్, రమేష్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులపై నిర్లక్ష్యం వద్దు



వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న సిద్దప్ప

సిరుగుప్ప: తమను సత్ప్రవరులుగా తీర్చిదిద్దడానికి శ్రమించిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేయరాదని తాలూకా బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు ఎం.ఎస్.సిద్దప్ప అన్నారు. ఆయన బైపాస్ రోడ్డులోని యల్లమ్మ స్కూల్ వద్ద దివ్యజ్యోతి గ్రామీణాభివృద్ధి ట్రస్టు స్థాపించిన వృద్ధాశ్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే టి.ఎం.చంద్రశేఖరయ్యస్వామి, కౌన్సిలర్ మేకలి వీరేశ్, ప్రముఖులు శేకప్ప, శంక్రప్ప, నింగప్ప, మంజునాథ, మారెప్ప, వృద్ధాశ్రమ సంస్థాపకులు శివరాజ్, అధ్యక్షులు వినోద్‌కుమార్, కార్యదర్శి హెచ్.నింగయ్య పాల్గొన్నారు.

పల్లెల్లో 'గాలి'కి స్వాగతం



జనార్దన్‌రెడ్డికి గజమాలతో స్వాగతం దృశ్యం

గంగావతి: కేఆర్‌పీపీ సంస్థాపకులు గాలి జనార్దన్‌రెడ్డి ప్రచార కార్యక్రమాన్ని గంగావతి, సింధనూరు తాలూకాల్లో ముమ్మరంగా కొనసాగించారు. ఆయన ఎక్కడకు వెళ్లినా ప్రజల నుంచి ప్రధానంగా యువత నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఇతర పార్టీల నుంచి నేతలు, యువజన బృందాలు ఆయన పార్టీలో వరుసగా చేరుతున్నారు. ఆయా ప్రాంతాల్లోని ఆలయాలను జనార్దన్‌రెడ్డి దర్శిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో జనార్దన్‌రెడ్డిపై పూలవర్షం కురిపించి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.

ధార్మిక ఆచరణలు ఐక్యతకు నాంది



గాలి లక్ష్మీఅరుణ, మేయర్ రాజేశ్వరిలను సత్కరిస్తున్న పద్మశాలి సమాజ నేతలు

బళ్లారిటౌన్: ధార్మిక ఆచరణలు ఐక్యతకు నాంది పలుకుతాయని గాలి జనార్దనరెడ్డి సతీమణి లక్ష్మీ అరుణ అన్నారు. శనివారం పద్మశాలి కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన శ్రీభావనారుషి భద్రావతి దేవి కళ్యాణ మహోత్సవాల్లో పద్మశాలి సంఘం తరపున సన్మానం అందుకుని ఆమె మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాల్లో తాను పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కళ్యాణోత్సవాలకు ఆ సమాజం కాంగ్రెస్ నేత కేసీ కొండయ్య, మంత్రి బీ శ్రీరాములు, నారా భరత్‌రెడ్డి, మేయర్ రాజేశ్వరి, మాజీ ఎంపీ సన్నపక్కీరప్ప, బుడా అధ్యక్షుడు మారుతీ ప్రసాద్, మాజీ అధ్యక్షుడు దమ్మూరు శేఖర్ తదితరులు తరలి వచ్చి దర్శించుకున్నారు. చేనేత సమాజం నేతలు దేవానంద, బ్రహ్మయ్య, అవ్వారు మంజునాథ, మంజుల, కోడి నాగరాజు, రాజు, కంప్లి బ్రహ్మయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సముదాయ భవనం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి

గంగావతి: బసాపట్నలో షిర్డీసాయిబాబా ఆలయంలో నూతన సముదాయ భవనాన్ని ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని దేవస్థానాలను అభివృద్ధి పరిచి భక్తులకు అనుకూలం చేశామన్నారు. వీటిని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ ప్రముఖులు, దేవస్థాన కమిటీ పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పదును పెట్టాలి



మండ్య: కలికా హబ్బలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు ప్రతిభకు పదును పెట్టాలని విద్యాశాఖ అధికారి రేణుక అన్నారు. శనివారం మండ్యలోని అర్కేశ్వర నగరలో కలికా హబ్బను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కరోనా వైరస్ వలన సుమారు రెండు సంవత్సరాల నుంచి విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి ప్రతిభా కార్యక్రమాలకు చాలా దూరంగా ఉండిపోయారన్నారు.

కరాటే శిబిరం: మండ్య నగరంలో ఉన్న హర్డికర్ భవనంలో 2వ గోజు–రియో కరాటె డో సెమినార్, బ్లాక్‌బెల్ట్ డాన్ గ్రేడింగ్ ను కరాటే మాస్టర్ అల్తాఫ్ పాషా ప్రారంభించారు. ఆస్ట్రేలియా నుంచి కరాటే శిక్షకులను తీసుకొచ్చి సుమారు మూడురోజుల పాటు తర్ఫీదునిస్తున్నట్లు తెలిపారు. బాలలు మెళకువలు నేర్చుకుని కరాటేలో రాణించాలని సూచించారు.

ట్రాక్‌సూట్ వితరణ

కోలారు : తాలూకాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం డీసీసీ బ్యాంకు అధ్యక్షుడు బ్యాలహళ్లి గోవిందగౌడ ట్రాక్‌సూట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను దాతల సహకారంతో అభివృద్ధి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం, క్షీరభాగ్య, యూనిఫాం, పాఠ్య పుస్తకాలను అందించాలన్నారు. విద్యార్థులు మొబైల్‌కు బానిస కాకుండా చదువుపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా పాత్రికేయుల సహకార సంఘం అధ్యక్షుడు కెఎస్ గణేష్, ఉపాధ్యాయురాలు కవితా పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

కోలారు : బీజేపీ విజయసంకల్ప యాత్రలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే వర్తూరు ప్రకాష్ మార్గదర్శనంలో నగరంలో అన్ని వార్డులకు వెళ్లి కరపత్రాలను పంచి పెట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు కె ఎస్ సరస్వతి, కాశీ విశ్వనాథ్, రాజేశ్వరి, కుడా అధ్యక్షుడు తిమ్మరాయప్ప, జిల్లా ఉపాధ్యక్షురాలు అరుణమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వచ్చేవారం కుక్కర్ బాంబ్ నిందితుడి డిశ్చార్జ్

యశవంతపుర: బెంగళూరు విక్టోరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంగళూరు కుక్కర్ బాంబ్ నిందితుడు షారిఖ్‌ను వచ్చే వారం డిశ్చార్జ్ చేయనున్నారు. బాంబు పేలుడుతో అతని శరీర భాగాలు కాలిపోయిన విషయం తెల్సిందే. దీంతో మెరుగైన వైద్యం కోసం ఎన్ఐఏ అధికారులు కొద్ది రోజుల క్రితం విక్టోరియాకు తరలించారు. గాయాలు పూర్తిగా నయం కావడంతో వైద్యులు వచ్చే వారం డిశ్చార్జ్ చేయాలని నిర్ణయించారు. డిశ్చార్జ్ కాగానే ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేసే అవకాశం ఉంది.

దూడను బలిగొన్న చిరుతలు


చిరుత దాడిలో మృతి చెందిన దూడ

గౌరిబిదనూరు: నగర సమీపంలోని 25వ వార్డు కల్లూడి వద్ద ఓ పశువుల కొట్టంపై రెండు చిరుతలు దాడి చేసి దూడను చంపివేశాయి. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున కల్లూడి యమహా షోరూమ్ వెనుకభాగంలో జరిగింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి రెండు చిరుతలు వచ్చినట్లు గుర్తించారు. సమాజ సేవకుడు పుట్టస్వామి గౌడ బాధితుడు హరీశ్‌కు ఆర్థిక సాయం చేశారు. చిరుతను వెంటనే పట్టుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. బోను ఏర్పాటు చేసినట్లు అటవీ అధికారి యల్లప్ప తెలిపారు.

మేయర్ కప్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

తుమకూరు: తుమకూరు నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మేయర్ కప్–2023 క్రీడా పోటీలను శుక్రవారం రాత్రి నగర ఎమ్మెల్యే జీబీ జ్యోతి గణేశ్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొద్దిసేపు క్రీడాకారులతో వాలీబాల్ ఆడారు.

క్యాలెండర్ విడుదల



కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర పరిధిలోని బెళ్ళందూరు వార్డు యమలూరు గ్రామంలో శనివారం శ్రీ కెరె అంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారి కొత్త సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే అరవింద లింబావళి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు మిడితసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బాలికల పాఠశాలకు కొత్త హంగులు


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

బాగేపల్లి: బాగేపల్లి పట్టణంలోని బాలికల పాఠశాలను అభివృద్ధి చేయడంతో పాటు నేహ గల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సరికొత్త హంగులు కల్పిస్తామని ఎమ్మెల్యే ఎస్.ఎన్. సుబ్బారెడ్డి అన్నారు. శనివారం రూ. 40 లక్షల వ్యయంతో పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. అదనపు గదులతో పాటు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

ఘనంగా ఫీల్డ్ మార్షల్ కరియప్ప జయంతి


కరియప్ప విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మైసూరు: భారత ఫీల్డ్ మార్షల్, దివంగత కారియప్ప 124వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మైసూరు నగరంలోని మెట్రోపాల్ సర్కిల్‌లో కొడవ సముదాయం, కొడవ సమాజం కల్చరల్ అండ్ స్పోర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో కరియప్ప జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జీటీ దేవెగౌడ, నాగేంద్ర, మేయర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓం నమో సూర్యదేవాయ నమః


ప్యాలెస్ ఆవరణంలో అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు


యోగాసనాలు వేస్తున్న నగర వాసులు

- ప్యాలెస్ ఆవరణంలో రథసప్తమి శోభ
- సామూహిక యోగా, సూర్య నమస్కారాలు

మైసూరు: హిందువులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగల్లో రథసప్తమి ఒకటి. ఈ రోజున సూర్య భగవానుడిని ఆరాధించడ వల్ల సకల సంపదలు, ఆరోగ్యం, సంతోషం చేకూరుతాయి. దీంతో మైసూరు నగరంలో ప్రసిద్ధి అంబా విలాస్ ప్యాలెస్ ఆవరణంలో శనివారం రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్యాలెస్ ఆవరణంలో ఉన్న 17 ఆలయాల్లోని ఉత్సవ మూర్తులకు విశేష పూజలు చేశారు. గాయత్రిదేవి, లక్ష్మీ రమణ, అంబు జవలి, భువనేశ్వరి, ప్రసన్న, లక్ష్మీ ఖిల్లా వెంటకరమణ స్వామి తదితర దేవీ దేవుళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నగర వాసులు పెద్ద ఎత్తున సూర్య నమస్కారాలు, యోగాసనాలు వేశారు.

భాష, సంస్కృతిని రక్షించుకోవాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివశంకరరెడ్డి తదితరులు

గౌరిబిదనూరు: వందల సంవత్సరాల చరిత్ర కలిగిన కన్నడ భాష, సంస్కృతిని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే శివశంకరరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి వరకు వివిధ కార్యక్రమాలతో ప్రా నగరగెరె రమేశ్ అధ్యక్షతన హెచ్ ఎన్ కళా భవనంలో జరిగిన తాలూకా స్థాయి 9వ కన్నడ సాహిత్య పరిషత్తు సమావేశాలను ప్రారంభించి మాట్లాడారు. భువనేశ్వరీ దేవి చిత్ర పటాన్ని వివిధ జానపద కళా బృందాలతో ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆంగ్లభాషపై వ్యామోహంతో కన్నడ భాషను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా సాహిత్య పరిషత్తు అధ్యక్షుడు కోడి రంగప్ప మాట్లాడుతూ... ఇతర రాష్ట్రాల వారు కూడా కన్నడ భాషను నేర్చుకోవాలన్నారు. నగరగెరె రమేశ్ కన్నడ భాష ఔన్నత్యాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు నంజుండప్ప, సీవి సత్యనారాయణ, డా శశిధర్, మరళూరు హనుమంతరెడ్డి, జెడీఎస్ మాజీ అధ్యక్షుడు నరసింహమూర్తి, రవీంద్రనాథ్, చంద్రమోహన్, ప్రదీప్, మద్దిలేటి, హనుమంతరావ్, అమృతకుమార్, కన్నడ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

గౌరిబిదనూరు: వచ్చే శాసనసభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజోపయోగ పథకాలను ప్రజలకు తెలియ చెప్పడమే విజయ సంకల్ప అభియాన్ ఉద్దేశ్యమని నగర బీజేపీ మండల అధ్యక్షుడు, నగరసభ సభ్యుడు మార్కెట్ మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి నగరంలోని వివిధ వార్డులలో సంచరించి బీజేపీ ప్రభుత్వ సాధనల కరపత్రాలను వితరణ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఈ అభియాన్‌కు ఉత్తమ స్పందన లభిస్తూ వుందన్నారు. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపు మేరకు తాలూకాలో బూత్ స్థాయిలో ఈ విజయ సంకల్ప అభియాన్ చేపట్టామన్నారు. మానస ఆస్పత్రి వైద్యులు శశిధర్ మాట్లాడుతూ...ఈ నెల 29తో ఈ అభియాన్ ముగుస్తుందని, ఉత్తమ పాలన కోసం వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలన్నారు. ఉపాధ్యక్షుడు వసంతకుమారగౌడ, మంజునాథ్‌రావ్, జయణ్ణ, వేణుమాధవ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కేశవ, రంజిత తదితరులు పాల్గొన్నారు.

బస్సు కారును, కారు బైకులను ఢీ

- ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు


బీఎంటీసీ బస్, మృతి చెందిన అయూబ్ (ఫైల్)

యశవంతపుర: బెంగళూరులో శుక్రవారం రాత్రి బీఎంటీసీ బస్, కారు కలిసి బైక్‌లను ఢీకొన్న ఘటనలో అయూబ్ (35) అనే వ్యక్తి మరణించగా, రఫీవుల్లాఖాన్, ముసాదిక్, మునావర్‌లు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాత్రి 8 గంటల సమయంలో నాగవార–యలహంక మార్గంలో బెళ్లళ్లి నుంచి హెగ్డేనగరకు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న కారును బస్ ఢీకొట్టగా, ఆ కారు వేగంగా దూసుకెళ్లి ముందు వెళ్లే బైకులను తాకింది. పలు బైక్‌లు బోల్తా పడడంతో నలుగురు గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించగా అయూబ్ చికిత్స పొందుతూ చనిపోయాడు. మిగతా ముగ్గురు గాయపడి చికిత్స పొందుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఫోన్ రావడంతో బైకుపై వెళ్లతున్న అయూబ్ రోడ్డు పక్కలో నిలిపి మాట్లాడుతూ ఉండగా కారు ఢీకొట్టడంతో మరణించాడు.

ప్రజా సహకారంతోనే నేరాల నియంత్రణ

- పోలీస్ కమిషనర్ ప్రతాప్‌రెడ్డి


ప్రజా సంపర్క కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ ప్రతాప్‌రెడ్డి

శివాజీనగర: ప్రజలు సహకరిస్తే నేరాల నియంత్రించి శాంతిభద్రతలను కాపాడవచ్చని నగర పోలీస్ కమిషనర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం పులికేశినగర పోలీస్ స్టేషన్‌లో ప్రజా సంపర్క కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...పోలీసులు 24 గంటల పాటు శ్రమిస్తున్నారని, ప్రతి సమస్య పరిష్కరించటానికి కృషి చేస్తున్నామన్నారు. ఒక్కొక్కరు ఒక్కో సమస్యతో వస్తారని, తమకు అందరి సమస్య ముఖ్యమే అన్నారు.

ట్రాఫిక్ సమస్య ప్రధానం : నగరంలోని కొన్ని రోడ్లలో ట్రాఫిక్ సమస్య ప్రధానంగా ఉందని, దాన్ని నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వినతులు వస్తున్నాయని, స్థానిక సమస్యలను తెలుసుకొని పరిష్కరించే లోగా బదిలీ కావటంతో సమస్యలు అలాగే మిగిలిపోతున్నాని చెప్పారు. పలువురు నగర వాసులు గంజాయి, రౌడీల ఆగడాలపై ఫిర్యాదు చేశారు. సైరన్‌తో వస్తే దొంగలు పారిపోతున్నారని కమిషనర్ దృష్టికి తెచ్చారు. కమిషనర్ స్థానికుల సమస్యలను సావధానంగా విని అన్ని తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తూర్పు విభాగపు డీసీపీ డాక్టర్ భీమాశంకర్ గుళేద్, ఏసీపీ వెంకటేశ్ ప్రసన్న తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి సుధాకర్‌పై ఆరోపణలు చేయడం తగదు

చిక్కబళ్లాపురం: సీఎల్‌పీ నేత సిద్దరామయ్య మంత్రి సుధాకర్‌పై లేనిపోని ఆరోపణలు చేయడం తగదని ఖదీ గ్రామోద్యోగ మండలి అధ్యక్షుడు కేవీ నాగరాజు అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఇన్నేళ్లు రాజకీయాల్లో ఉన్న సిద్దరామయ్య ఇప్పు డు ఎక్కడ నుంచి పోటీ చేయాలో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల చిక్కబళ్లాపురం ప్రజాధ్వని కార్యక్రమంలో మంత్రి సుధాకర్‌పై లేనిపోని అభండాలు వేశారని, ఇక్కడ సుధాకర్‌కు ఎవరూ ఎదురు నిలబడలేరని అన్నారు.

చలో లాల్‌బాగ్




బెంగళూరు లాల్‌బాగ్‌లో గణతంత్ర ఫలపుష్ప ప్రదర్శనను వీక్షించడానికి ప్రజలు తరలివస్తున్నారు. వారాంతం కావడంతో శనివారం కనిపించిన రద్దీ దృశ్యాలు.

దొంగనోట్ల కేసులో విచారణ

శివాజీనగర: బెంగళూరులో పట్టుబడిన నకిలీ నోట్ల కేసులో ఒక నిందితున్ని సుబ్రమణ్య పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతపురం నగరానికి చెందిన పుల్లలరేవు రాజు (36) అరెస్ట్ అయిన వ్యక్తి. ఇతని వద్ద నుంచి భారీ మొత్తంలో రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక గదిని తీసుకుని నకిలీ నోట్లను ముద్రించేవాడు. ఇరుగుపొరుగుకు మాత్రం ఒక షోరూంలో పనిచేస్తున్నట్లు చెప్పేవాడు. రద్దీ ప్రాంతాల్లో అసలైన నోట్లలో నకిలీ నోట్లను కలిపి చెలామణి చేస్తుండేవాడు. ఆన్‌లైన్ ద్వారా నకిలీ నోట్ల తయారీకి ముడిసరుకులను తెప్పించుకునేవాడని పోలీసులు తెలిపారు.

మంగళూరు కమిషనర్‌కు లోకాయుక్త నోటీసు

యశవంతపుర: సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించకపోవడంతో మంగళూరు నగర పోలీస్ కమిషనర్ శశికుమార్‌కు లోకాయుక్త నోటీసులు ఇచ్చారు. దక్షిణ కన్నడ జిల్లా ఉళ్లాల పోలీసుస్టేషన్ ఎస్ఐపై సామాజిక కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించకపోవడంతో ఆయన లోకాయుక్తను ఆశ్రయించాడు. దీంతో లోకాయుక్త మంగళూరు నగర పోలీస్ కమిషనర్‌కు నోటీసులు ఇచ్చారు. ఫిబ్రవరి 14లోపు చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

హోసూరు వార్తలు..

వివాహిత ఆత్మహత్య

కెలమంగలం: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన కెలమంగలం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... కెలమంగలం సమీపంలోని జే. కారుపల్లి గ్రామానికి చెందిన పెరియ స్వామి కూతురు లక్ష్మి (21)కి జాకీర్ శ్రీరామపురం గ్రామానికి చెందిన మునిరాజ్‌తో రెండేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి ఒక కుమార్తె. ఇదిలా ఉంటే లక్ష్మి గత కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ వచ్చింది. ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె శుక్రవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. కెలమంగలం పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

పెండింగ్ రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

హోసూరు: హోసూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వివిధ సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్ కాక నిలువ ఉన్న పత్రాలను తిరిగి పొందేందుకు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. సబ్‌రిజిస్ట్రార్ రఘోత్తమన్, ప్రత్యేక తహసీల్దార్ పాల్గొని పెండింగ్‌లో పత్రాలను పరిశీలించారు. గత కొద్ది సంవత్సరాలుగా వివిధ కారణాల 350కి పైగా పత్రాలు రిజిస్ట్రేషన్‌లు కాక అలాగే ఉన్నాయని గుర్తించారు. భూ యాజమానులు, కొనుగోలుదారులను నేరుగా రప్పించి ఇరువురి వద్ద చర్చించి తక్కువ సుంకంతో పత్రాలను తిరిగి అందజేశారు. పెద్దఎత్తున భూ యాజమానులు, కొనుగోలుదారులు పాల్గొని సద్వినియోగం చేసుకొన్నారు.

ఆకట్టుకున్న కుస్తీపోటీలు


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: రథసప్తమి సందర్భంగా నగరంలో బీటీఎం లేఔట్ అడుగొడిలోని ప్రభుత్వ పాఠశాలలో కుస్తీ పోటీలు నిర్వహించారు. బెంగళూరు నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చిన కుస్తీవీరులు ఇందులో పాల్గొన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి. వాసు దేవరెడ్డి కుస్తీ విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా తేరు ఉత్సవం



బాగేపల్లి: బాగేపల్లి తాలూకా చేలూరులో శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మరథోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సుబ్బారెడ్డి ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేలాది మంది భక్తులు రథాన్ని లాగారు.

కన్నుల పండువగా రథోత్సవం


భక్తజన సంద్రం మధ్య రథోత్సవం



తుమకూరు: తుమకూరు జిల్లా శిర తాలూకాలో ప్రసిద్ధి చెందిన బండి రంగనాథ స్వామి రథోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి రథంపై అధిష్ఠించారు. వేలాది మంది భక్తులు రథాన్ని లాగారు.

ఘనంగా లక్ష్మీకాంత స్వామి రథోత్సవం

తుమకూరు నగరంలోని చిక్కపేటలో వెలసిన శ్రీ లక్ష్మీకాంత స్వామి రథోత్సవం శనివారం కన్నుల పండవగా జరిగింది. వేలాది మంది భక్తులు ఉత్సవంలో పాల్గొని రథంపైకి పండ్లు, పూలు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. మాజీమంత్రి శివణ్ణ తదితరులు పాల్గొన్నారు.

రథ సప్తమి పూజలు


స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

తుమకూరు: తుమకూరు జిల్లా తురువెకెరె తాలూకా ముదిగెరె సమీపంలో ఉన్న శ్రీ కోడిరంగనాథ స్వామి ఆలయంలో రథ సప్తమి వేడుకల సందర్భంగా శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని ఊరేగించారు. పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.



సూర్య నమస్కారాలు

తుమకూరు: తుమకూరు నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం రథసప్తమి సందర్భంగా పతంజలి యోగా సంస్థ ఆధ్వర్యంలో నగర వాసులు సూర్య నమస్కారాలు, యోగాసనాలు చేశారు. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ 108 సూర్య నమస్కారాలు చేశారు.

బోరుబావి పనులు ప్రారంభం


బోరుబావి తవ్వకాలకు భూమిపూజ

కెలమంగలం: తళి నియోజకవర్గంలోని మల్లసంద్రం పంచాయతీ బెణ్ణంగూరు గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై కదలిక వచ్చింది. తాగునీటి కొరతపై ప్రజలు చైర్మన్ శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై స్పందించిన ఆయన సంబంధిత శాఖాధికారులతో కలిసి గ్రామంలో నీటి సమస్యను పరిశీలించారు. కొత్త బోరుబావి ఏర్పాటుకు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. బోరు పూర్తి కాగానే నీటి సరఫరా ప్రారంభిస్తామని తెలిపారు. పంచాయతీ అధ్యక్షులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఖనిజ సంపద తరలింపును ఆపాలి


మాట్లాడుతున్న నాగరాజు

హోసూరు: బీజేపీ క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యకర్తల సమావేశం శనివారం హోసూరులో జరిగింది. క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షులు ఎం. నాగరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సేలం మండల నాయకుడు రామలింగం, మాజీ ఎంపీ నరసింహన్‌లు ముఖ్య అతిథిలుగా పాల్గొని పలు తీర్మానాలు నెరవేర్చారు. వీటిలో ప్రధానంగా హోసూరు నుంచి జోలార్‌పేట వరకు రైలు మార్గ పథకానికి అనుమతిచ్చిన కేంద్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. క్రిష్ణగిరి జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న ఖనిజసంపదను అడ్డుకోవాలని, జిల్లాలో గంజాయి అడ్డుకట్టకు అధికారులు చర్యలు చేపట్టాలని, అందివాడి ఆటల మైదానాన్ని క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని పలు తీర్మానాలు చేశారు.

ఘనంగా రథసప్తమి ఊరేగింపు


శ్రీ చంద్రచూడేశ్వరస్వామి ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న భక్తులు

హోసూరు: రథ సప్తమి సందర్భంగా హోసూరు తేరుపేటలో ప్రసిద్ధి పొందిన మరకతాంబ సమేత శ్రీ చంద్రచూడేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు గావించి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి తిరువీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు.

బైక్ ప్రమాదంలో మహిళ మృతి

క్రిష్ణగిరి: బైక్ ప్రమాదంలో మహిళ మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జిల్లా కేంద్రం క్రిష్ణగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు క్రిష్ణగిరి సమీపంలోని పెద్దనపల్లి ప్రాంతానికి చెందిన వళర్మతి (37), బంధువు మాదు (29)తో కలిసి ద్విచక్ర వాహనంలో క్రిష్ణగిరిలో తమిళనాడు హోటల్ ముందు వెళ్తుండగా అదుపుతప్పి బైక్ కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన ఇరువురిని స్థానికులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫలితం లేక వళర్మతి మృతి చెందింది. మాదు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. క్రిష్ణగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో పడి కార్మికుడు మృతి

హోసూరు: చెరువులో పడి కార్మికుడు మృతి చెందిన ఘటన హోసూరు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... హోసూరు సమీపంలోని జొనబండ గ్రామానికి చెందిన మునిక్రిష్ణ (35) కార్మికుడు. శుక్రవారం సాయంత్రం అదే ప్రాంతంలోని చెరువులో చేపలు పడుతూ ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందాడు. హోసూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

కారు బోల్తాపడి డ్రైవర్ మృతి

మైసూరు: వేగంగా వెళుతున్న కారు పల్టీలు కొట్టగా, డ్రైవర్ మృతి చెందిన సంఘటన చామరాజనగర జిల్లాలోని కొళ్ళెగాలలోని దాసనపురలో జరిగింది. మండ్యకు చెందిన సవాజ్ పాష (19) కారు తీసుకుని కొళ్ళెగాల పట్టణంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. మితిమీరిన వేగం వల్ల కారు కారు అదుపు తప్పి పల్టీలు కొట్టడంతో తీవ్ర గాయాలతో మృత్యువాత పడ్డాడు. కొళ్ళెగాల పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏనుగు దాడిలో రైతుకు గాయాలు

మైసూరు: చామరాజనగర జిల్లాలో అడవి ఏనుగుల బెడద పెచ్చుమీరుతోంది. నిన్నటి వరకు పంట పొలాలను నాశనం చేస్తున్న ఏనుగులు ఇప్పుడు రైతులపై దాడి చేస్తున్నాయి. తాజాగా జిల్లాలోని గుండుపేటె తాలూకా కుణహళ్లి గ్రామంలో ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన మహాదేవప్ప (65) తన పొలంలో ఉండగా ఆహారం కోసం వచ్చిన ఏనుగు అతనిపై దాడి చేసింది. మహాదేవప్పకు కాలు విరిగిపోయింది. వృద్ధుడిని మైసూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు.

కొత్త బంగారు లోకం

14–18 క్యారెట్ల బంగారు ఆభరణాలకు పెరుగుతున్న డిమాండ్



తేలికపాటి ఆభరణాల వైపు మొగ్గు చూపుతున్న నేటి తరం

- దేశంలో ఏటా 611 టన్నుల బంగారు ఆభరణాల అమ్మకాలు
- కొనుగోళ్లలో గ్రామీణ మధ్యతరగతి ప్రజల వాటా 58 శాతం
- పెళ్లి ఆభరణాల అమ్మకాల వాటా 55 శాతం
- విక్రయాల్లో గాజులు, గొలుసుల వాటా 60 నుంచి 80 శాతం
- బంగారం ధర పెరుగుతున్నా, పెరగని కుటుంబ బడ్జెట్లు

సాక్షి, అమరావతి: నిన్నా మొన్నటి వరకు 22 క్యారెట్ల బంగారు ఆభరణాల కొనుగోలుకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన ప్రజల అభిరుచిలో గణనీయమైన మార్పు వచ్చింది. ప్రస్తుతం 14–18 క్యారెట్ల బంగారంతో చేసిన ఆభరణాల వైపు మొగ్గు చూపుతున్నారు. బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడం వల్లే ప్రజలు ఇలా నిర్ణయం మార్చుకున్నారని స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో వారి బడ్జెట్‌కు తగినట్టుగా తక్కువ క్యారెట్లతోనే ఆభరణాలు తయారు చేస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. 2021లో దేశ వ్యాప్తంగా 611 టన్నుల బంగారు ఆభరణాలు అమ్ముడైనట్టు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యూజీసీ) తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా అమ్ముడవుతున్న బంగారు ఆభరణాల్లో 25 శాతం భారతీయ పెళ్లి కూతుళ్ల కోసమే కొంటున్నట్లు ఆ నివేదిక స్పష్టం చేసింది. మరోవైపు యువత మోడ్రన్ దుస్తులు ఎక్కువగా ధరిస్తుండటంతో వాటికి అనుగుణంగా ఆభరణాలను తయారు చేస్తున్నట్టు దేశీయ బంగారం వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికీ బంగారం అమ్మకాల్లో 80 శాతం 22 క్యారెట్ల ఆభరణాలే ఉన్నప్పటికీ.. తక్కువ క్యారెట్ల ఆభరణాలకు క్రమంగా డిమాండ్ పెరుగుతున్నట్టు పేర్కొంటున్నారు.

గాజులు హారాలదే హవా

దేశంలో అమ్ముడవుతున్న బంగారు ఆభరణాల్లో గాజులు, హారాల వాటాయే అత్యధికం. మొత్తం అమ్మకాల్లో 30–40 శాతం వాటా గాజులు ఆక్రమించగా.. హారాల వాటా 30–40 శాతం ఉంటోంది. ఆ తర్వాత స్థానంలో నెక్లెస్‌లు 15–20 శాతం వాటా ఉంటే.. చెవిదిద్దులు, చేతి ఉంగరాల అమ్మకాలు 5–15 శాతం చొప్పున ఉంటున్నాయి. ఒక్కొక్క నెక్లెస్ కోసం సగటున 30 నుంచి 60 గ్రాములను వినియోగిస్తుంటే.. గాజుల కోసం 10 నుంచి 15 గ్రాములు, చెయిన్ల కోసం 10 నుంచి 20 గ్రాములు, ఉంగరాలు, చెవిదిద్దుల కోసం 3నుంచి 8 గ్రాముల వరకు బంగారాన్ని వినియోగిస్తున్నారు.

ఆభరణాల అమ్మకాల శాతాలు ఇలా..

విభాగం	రిటైల్ అమ్మకాల వాటా	సగటున వినియోగిస్తున్న గ్రాములు
నెక్లెస్‌లు	15-20%	30-60
గాజులు	30-40%	10-15
హారాలు	30-40%	10-20
చెవి దిద్దులు	5-15%	3-8
ఉంగరాలు	5-15%	3-8

2021లో బంగారు ఆభరణాల విక్రయం ఇలా (టన్నుల్లో)

చైనా	673
ఇండియా	611
మిడిల్ ఈస్ట్	241
అమెరికా	149
తూర్పు ఆసియా	146
యూరప్	95



పెళ్లి ఆభరణాల వాటా 55 శాతం

దేశీయ ఆభరణాల అమ్మకాల్లో వివాహాల సందర్భంగా వినియోగించే ఆభరణాల వాటా 55 శాతం వరకు ఉంది. దేశంలో ఏటా సగటున 1.10 కోట్ల నుంచి 1.30 కోట్ల పెళ్లిళ్లు జరుగుతున్నట్టు అంచనా. ఆ తర్వాత పంటలు చేతికి వచ్చినప్పుడు, అక్షయ తృతీయ, ధన్‌తేరాస్ వంటి పర్వదినాల్లో బంగారం అమ్మకాలు అధికంగా జరుగుతున్నాయి. ఆ రోజుల్లో 60 టన్నుల బంగారం అమ్ముడవుతోంది. కాగా.. పట్టణ ప్రజలతో పోలిస్తే.. గ్రామీణులే అత్యధికంగా బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారని వెల్లడైంది. మొత్తం బంగారం అమ్మకాల్లో 58 శాతం గ్రామీణ మధ్యతరగతి ప్రజలే కొంటున్నారు. రోజువారీ ధరించే నగల కొనుగోళ్ల వాటా 35 నుంచి 40 శాతం ఉండగా.. ఫ్యాషన్ జ్యూవెలరీ వాటా 5–10 శాతం వరకు ఉంది. దక్షిణాది ప్రజలు అత్యధికంగా ఇష్టపడే టెంపుల్ జ్యూవెలరీ, కుందన్ వంటి భారీ మోడల్స్‌ను ఇప్పుడు ఉత్తరాది వారు కూడా ధరించడానికి ఇష్టపడుతున్నట్టు సర్వే వెల్లడించింది. పెళ్లిలకు సగటున 35 నుంచి 250 గ్రాముల బరువుండే ఆభరణాలు కొనుగోలు చేస్తుంటే.. రోజువారీ ధరించేందుకు 5 నుంచి 30 గ్రాముల బరువుండే ఆభరణాలను కొంటున్నారు. ఫ్యాషన్ జ్యూవెలరీ అయితే.. 5 నుంచి 20 గ్రాములలోపు వినియోగిస్తున్నారని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ పేర్కొంది.

బీమా పరిహారం చెల్లింపుపై

హైకోర్టు కీలక తీర్పు

- పరిహారం పెంచే అధికారం హైకోర్టుకు ఉందన్న న్యాయమూర్తి
- రూ.1.79 లక్షల బీమా పరిహారం రూ.5.89 లక్షలకు పెంపు

సాక్షి, అమరావతి: ప్రమాద బీమా పరిహారం పెంపు విషయంలో హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై బాధిత కుటుంబం అప్పీల్ దాఖలు చేయకపోయినప్పటికీ, ఆ తీర్పుపై బీమా కంపెనీ దాఖలు చేసే అప్పీల్‌లో సైతం పరిహారం మొత్తాన్ని పెంచుతూ తీర్పు ఇచ్చే అధికారం తమకు ఉందని హైకోర్టు తేల్చి చెప్పింది. ఇదే సమయంలో కోరిన మొత్తం కంటే ఎక్కువ పరిహారంగా నిర్ణయించే అధికారం కూడా తమకు ఉందని స్పష్టం చేసింది. ఈ విషయంలో ఎలాంటి నిషేధం లేదని స్పష్టం చేసింది. ఓ ప్రమాదంలో బాధితుని కుటుంబానికి రూ.1.79 లక్షల పరిహారం చెల్లించాలన్న ట్రిబ్యునల్ ఉత్తర్వులను సవరించింది. పరిహారం మొత్తాన్ని రూ.5.89 లక్షలకు పెంచింది. ఇందులో ఇప్పటికే చెల్లించిన రూ.1.79 లక్షలకు అదనంగా రూ.4.10 లక్షలను బాధిత కుటుంబానికి చెల్లించాలని బీమా కంపెనీతో పాటు, ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్‌ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ ఇటీవల తీర్పు వెలువరించారు.

కేసు పూర్వాపరాలివీ

గుంటూరు జిల్లా అమరావతికి చెందిన లలూనాయక్ అనే వ్యక్తిని 2005లో ఆటో అతి వేగంగా ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో లలూనాయక్ మరణించగా.. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే అతడు చనిపోయాడని పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, రూ.2 లక్షలను పరిహారంగా ఇప్పించాలని మృతుని కుటుంబ సభ్యులు ప్రమాద బీమా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన ట్రిబ్యునల్ బాధిత కుటుంబానికి రూ.1.79 లక్షలను పరిహారంగా చెల్లించాలని బీమా కంపెనీని, ఆటో డ్రైవర్‌ను ఆదేశిస్తూ 2007లో తీర్పునిచ్చింది. అయితే, ఈ తీర్పును సవాల్ చేస్తూ నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ గుంటూరు డివిజనల్ మేనేజర్ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయగా.. జస్టిస్ దుప్పల వెంకటరమణ విచారణ జరిపారు. బీమా కంపెనీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ట్రిబ్యునల్ ఇచ్చిన పరిహారాన్ని రద్దు చేయాలని కోరారు. వాహనం నడిపే సమయంలో ఆటో డ్రైవర్‌కు సరైన లైసెన్స్ లేదన్నారు. మృతుడి భార్య తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ట్రిబ్యునల్ ఇచ్చిన పరిహారాన్ని పెంచాలని కోరారు. మృతుని ఆదాయాన్ని నెలకు రూ.1,200గా పరిగణిస్తూ ట్రిబ్యునల్ బీమా పరిహారాన్ని నిర్ణయించిందన్నారు. మృతుడి ఆదాయాన్ని నెలకు రూ.4,500గా తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన పలు సుప్రీంకోర్టు తీర్పులను ఉదహరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ట్రిబ్యునల్ తీర్పుపై బాధిత కుటుంబం అప్పీల్ దాఖలు చేయకపోయినా పరిహారం మొత్తాన్ని పెంచవచ్చని స్పష్టం చేశారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి చనిపోవడంతో ఆ కుటుంబానికి జరిగే నష్టాన్ని ట్రిబ్యునల్ సరైన కోణంలో పరిశీలించలేదని ఆక్షేపించారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ట్రిబ్యునల్ నిర్ణయించిన రూ.1.79 లక్షల పరిహారాన్ని రూ.5.89 లక్షలకు పెంచుతున్నట్టు తీర్పులో పేర్కొన్నారు.

స్టార్టప్‌లకు అంతర్జాతీయ నెట్‌వర్క్

- జీ–20 స్టార్టప్ 20 సమావేశాల్లో కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ సూచన

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక మాంద్యం మొదలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన వరకూ ప్రపంచస్థాయి సమస్యలను పరిష్కరించేందుకు స్టార్టప్‌లు అవసరమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖల మంత్రి పీయూష్ గోయల్ అభిప్రాయపడ్డారు. ఔత్సాహికులు, పెట్టుబడిదారులు, మెంటర్లతో కూడిన నెట్‌వర్క్ ద్వారా స్టార్టప్‌లకు అన్నివిధాలుగా సాయం అందించేందుకు ప్రయత్నించాలని ఆకాంక్షించారు. భారత్ అధ్యక్షతన ఈ ఏడాది జరగనున్న జీ–20 సదస్సు సన్నాహకాల్లో భాగంగా శనివారం హైదరాబాద్‌లో స్టార్టప్ -20 సమావేశాలు మొదలయ్యాయి. కేంద్ర పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, జీ–20 షేర్పా అమితాబ్ కాంత్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశాన్ని ఉద్దేశించి గోయల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. స్టార్టప్‌లకు అనుకూల వాతావరణం ఏర్పాటు, అందరికీ అవకాశాలు, మద్దతు లభించేలా చేయడం జీ–20 దేశాల ఉమ్మడి బాధ్యత అని అన్నారు. భారతదేశంలో ఆవిర్భవించిన కోవిన్, యూపీఐ వంటి టెక్నాలజీలు, ఈ-కామర్స్ కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ నెట్‌వర్క్(ఓఎన్‌డీసీ)లు ప్రపంచంలోని అనేక దేశాల సమస్యలను పరిష్కరించగలవని, అందుకే జీ–20 సదస్సు ద్వారా ఈ 'ఇండియా స్టాక్'ను ప్రపంచానికి ఎగుమతి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని గోయల్ తెలిపారు.

అనుకూల విధానాలతోనే వృద్ధి: కిషన్ రెడ్డి

స్టార్టప్‌లకు అనుకూల విధానాలను రూపొందించి అమలు చేస్తున్న కారణంగానే భారత్ అతితక్కువ కాలంలోనే ప్రపంచంలోనే అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా రూపాంతరం చెందిందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి చెప్పారు. 'ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఫర్ స్టార్టప్స్', 'స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్'లను కేంద్రం తీసుకొచ్చిందని తెలిపారు.

తెలంగాణ

ఎమ్మెల్సీ కవితతో నటుడు

శరత్‌కుమార్ భేటీ

సాక్షి, హైదరాబాద్: సినీ నటుడు, ఆల్ ఇండియా సమతావ మక్కల్ కచ్చి అధ్యక్షుడు శరత్ కుమార్ శనివారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని కవిత నివాసంలో జరిగిన ఈ భేటీలో దేశ రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు. బీఆర్ఎస్ పార్టీ స్థాపన ఉద్దేశాలు, లక్ష్యాలు, ఎజెండా తదితర అంశాలపై కవితతో శరత్‌కుమార్ చర్చించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాల విస్తరణ ప్రణాళికలో భాగంగా వివిధ రాష్ట్రాలకు చెందిన నేతలు సీఎం కేసీఆర్‌తో పాటు ఎమ్మెల్సీ కవిత, పలువురు మంత్రులతో సమావేశమవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కవితతో శరత్‌కుమార్ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

ఒబెరాయ్ హోటల్‌కు 20 ఎకరాల కేటాయింపు

- లీజ్ కమ్ రెంట్ విధానం
- ఏపీ టూరిజం ఎండీ కన్నబాబు

తిరుపతి అలిపిరి/ జమ్మలమడుగు/మధురపూడి (రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా తిరుపతి అలిపిరి రోడ్డులో టూరిజం స్థలం 20 ఎకరాలను ఒబెరాయ్ హోటల్‌కు లీజ్ కమ్ రెంట్ విధానంలో కేటాయించే విషయమై ఒప్పంద పత్రాలను మార్చుకున్నట్టు టూరిజం ఎండీ కన్నబాబు తెలిపారు. శనివారం మధ్యాహ్నం స్థానిక అలిపిరి రోడ్డులోని దేవలోక్ వద్ద ఒబెరాయ్ హోటల్ ప్రతినిధులతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. దాదాపు రూ.100 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నారని తెలిపారు.

గండికోటలో స్థలం పరిశీలన

వైఎస్సార్ జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో ఒబెరాయ్ బృందం పర్యటించింది. ఒబెరాయ్ హోటల్ సీఈవో, ఎండీ విక్రమ్ ఒబెరాయ్, కార్పొరేట్ అఫైర్స్ ప్రెసిడెంట్ శంకర్, ఫైనాన్స్ ఆఫీసర్ కల్లోల్ కుందా,ఎంఏఎల్ రెడ్డి, మహిమాసింగ్ ఠాగూర్ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా నాలుగు వందల ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. గతేడాది ఒబెరాయ్ హోటల్ యాజమాన్యం గండికోటలో రిసార్టులను ఏర్పాటు చేస్తామని, భూమిని కేటాయించాలని కోరడంతో.. రాష్ట్ర ప్రభుత్వం ఒబెరాయ్ యాజమాన్యానికి 50 ఎకరాల భూమిని కేటాయించింది. దీంతో రూ.250 కోట్లతో 120 విల్లాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దాదాపు 40 నిమిషాల పాటు ఒబెరాయ్ బృందం గండికోటలోని వివిధ ప్రాంతాలను పరిశీలించింది. పెన్నానదిలోయ అందాన్ని తిలకించారు.



లీజ్ కమ్ రెంట్ ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్న ఒబెరాయ్ హోటల్ సీఈవో తదితరులు

పిచ్చుక లంక, హేవలాక్ బ్రిడ్జి అభివృద్ధిపై ఒబెరాయ్ ప్రతినిధులతో కలెక్టర్ల చర్చ

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ప్రసిద్ధి గాంచిన హేవలాక్ బ్రిడ్జి, పర్యాటక కేంద్రమైన పిచ్చుక లంక అభివృద్ధిపై ఒబెరాయ్ గ్రూప్ ప్రతినిధులతో తూర్పు గోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్లు కె.మాధవీలత, హిమాన్షుశుక్లా, ఎంపీ మార్గాని భరత్‌రామ్ చర్చించారు. తిరుపతి నుంచి విశాఖపట్నం వెళ్తూ మధురపూడి విమానాశ్రయంలో ఆగిన ఒబెరాయ్ గ్రూప్ ప్రతినిధులతో శనివారం రాత్రి సమావేశమై పిచ్చుక లంక, హేవలాక్ బ్రిడ్జి అభివృద్ధి ద్వారా పర్యాటక రంగాన్ని విస్తరించవచ్చని వివరించారు. భేటీలో రాష్ట్ర ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.

వీరాపురానికి విదేశీ అతిథి

- సైబీరియా టు వీరాపురం
- మూడు శతాబ్దాలుగా పెనువేసుకున్న అనుబంధం
- ఏటా ఫిబ్రవరి మొదటి వారంలో పక్షుల రాక
- సంతానం వృద్ధి చెందాక స్వదేశానికి పయనం
- ఆరు నెలలు సందడి చేయనున్న ఎర్రకొంగలు

ఎక్కడ సైబీరియా...ఎక్కడ చిలమత్తూరు మండలంలోని వీరాపురం. దాదాపు 5 వేల కిలో మీటర్ల దూరం. ఎందులోనూ పొంతన ఉండదు. కానీ ఈరెండు ప్రాంతాలను ఓ పక్షి కలిపింది. అతిథిగా వచ్చి ఇక్కడి ప్రజల మనస్సు గెలుచుకుంది. ఈ ప్రాంతానికి గుర్తింపు తెచ్చింది. అందుకే ఏటా జనవరి నుంచి ఫిబ్రవరిలోపు ఇక్కడ వచ్చి సందడి చేసే ఆ అతిథిగా కోసం వీరాపురం ఎదురుచూస్తోంది.



వీరాపురంలో చెట్లపై సైబీరియన్ పక్షులు

సాక్షి, పుట్టపర్తి: వీరాపురం.. శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో కర్ణాటక సరిహద్దున ఓ మారుమూల గ్రామం. కానీ ఆ గ్రామానికి అంతర్జాతీయంగా గుర్తింపు వచ్చింది. అదీ ఓ అతిథి వల్ల. అందుకే ఆ అతిథికి గ్రామస్తులు రాచమర్యాదలు చేస్తారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటారు.

వేడిని వెతుక్కుంటూ

రష్యా దేశం సైబీరియన్ ప్రాంతానికి చెందిన స్టార్క్ పెయింటెడ్ పక్షులు (ఎర్రముక్కు కొంగలు). సమశీతోష్ణస్థితి కలిగిన ప్రాంతాల్లో జీవిస్తాయి. ఈ క్రమంలోనే వచ్చే ఫిబ్రవరి నుంచి సైబీరియాలో చలికాలం ప్రారంభమవుతుంది. ఉష్ణోగ్రత మైనస్ డిగ్రీలకు పడిపోతుంది. దీంతో వేడిని వెతుక్కుంటూ ఈ పక్షులు మైళ్ల దూరం ప్రయాణించి నుంచి ఏటా వీరాపురం వస్తుంటాయి. ముందుగా జనవరిలోనే కొన్ని పక్షులు వచ్చి ఇక్కడి వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తాయి. అనుకూలంగా ఉందని నిర్ధారించుకున్న తర్వాత తమ దేశానికి వెళ్లి మిగతా పక్షులతో తిరిగి వస్తాయి. ఇలా మన రాష్ట్రంలోని కొల్లేటి సరస్సు, తేలినీలాపురం, పులికాట్ సరస్సు, నేలపట్టుతో పాటు మన జిల్లాలోని చిలమత్తూరు మండలం వీరాపురం గ్రామానికి ఏటా సైబీరియన్ పక్షులు రావడం మూడు దశాబ్దాలుగా ఆనవాయితీగా కొనసాగుతోంది.

ఆరు నెలల పాటు సందడి

వీరాపురంలోని 188 ఎకరాల విస్తీర్ణంలో పురాతనమైన చెరువు ఉంది. దీని కింద 80 ఎకరాల ఆయకట్టుంది. దీని చుట్టూ వందలాది చెట్లు ఉండటంతో మూడు దశాబ్దాలుగా సైబీరియా నుంచి వేల సంఖ్యలో ఈ పక్షులు ఫిబ్రవరిలో ఇక్కడకు వస్తున్నాయి. ఇక్కడే గుడ్లు పొదిగి పిల్ల పక్షులు ఎగిరే దశకు చేరుకున్నాక (సెప్టెంబర్ నుంచి అక్టోబర్ లోపు) తిరిగి స్వస్థలానికి వెళ్లిపోతాయి. వీటిని స్థానికులంతా ప్రేమగా ఎర్రముక్కు కొంగలంటారు. కొన్నేళ్లుగా వీరాపురంతో ఈ పక్షులు మమేకమయ్యాయి. అందువల్లే సీజన్‌లో పక్షులను చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తుండగా... వీరాపురం కళకళలాడుతుంది.

బంధువుల్లా ఆదరణ

తమ గ్రామానికి ఖ్యాతి తెచ్చిన ఈ కొంగలను వీరాపురం వాసులు ప్రత్యేకంగా చూస్తారు. ఇళ్ల మధ్య చెట్లపైనే ఉంటూ 24 గంటలూ అరుస్తూ ఉన్నా వాటికి ఎలాంటి ఇబ్బంది కలగనివ్వరు. అంతేకాకుండా వీరాపురం చెరువును చారిత్రక సంపదగా ప్రకటించారు. చెరువు కింద 80 ఎకరాల ఆయకట్టు ఉన్నా... ఈ చెరువు నీటితో వ్యవసాయం చేస్తే నీరు తగ్గిపోయి మత్స్యసంపద అంతరిస్తుందని, అప్పుడు సైబీరియన్ పక్షులకు ఆహారం లేకుండా పోతుందన్న భయంతో ఏకంగా చెరువు కింద ఆయకట్టులో వ్యవసాయం చేయడమే మానేశారు.

మేలు జరుగుతుందని నమ్మకం

ఈ కొంగల రాకతో ఊరికి మేలు జరుగుతుందని వీరాపురం వాసులు నమ్ముతారు. ఎవరైనా వాటికి హాని తలపెడితే అందరూ ఒక్కటవుతారు. వారిని పట్టుకుని గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ చేసి జరిమానా విధిస్తారు. కేసులు పెడతారు. సైబీరియా నుంచి సుమారు ఐదు వేల కిలోమీటర్లు ప్రయాణించి ఈ కొంగలు వీరాపురం చేరుకుంటుండడం విశేషం.

పోషణ భారం ఆడ కొంగలదే

పెయింటెడ్ స్టార్క్ పక్షి చూడముచ్చటగా ఉంటుంది. సికొనిడే జాతికి చెంది ఈ పక్షి శాస్త్రీయ నామం 'మిక్టీరియాలూకోసిఫల'. ఎత్తు 3 నుంచి 3.5 అడుగులు. ఎగరడానికి రెక్కలు విప్పినప్పుడు ఐదు అడుగుల వెడల్పు ఉంటుంది. బరువు సుమారు 3.5 కిలోల నుంచి 4 కిలోల వరకు ఉంటుంది. ఈ పక్షులు నీళ్లను గొంతు వరకు నింపుకొని పిల్ల పక్షులకు అందించేందుకు మొత్తం నీరు బయటకు తీసి ఇవ్వడం ఆశ్చర్యంగా ఉంటుంది. ఆహారం కోసం ఊరికి 50 కిలోమీటర్ల దూరంలోపు ఉండే చెరువులు, పంట పొలాల వైపు వెళ్లి తిరిగి సాయంత్రం గూటికి చేరుకుంటాయి. ఒక గూడులో జంట పక్షులుంటాయి. గుడ్లు పెట్టి పిల్లలు వచ్చాక వాటి సంరక్షణను మగపక్షి చూసుకుంటుంది. ఆడకొంగలు బయటకు వెళ్లి చెరువుల్లో వేటాడి చేపలు, నీళ్లు తీసుకొచ్చి పిల్లలకు అందిస్తాయి.



అనువైన వాతావరణం

సైబీరియాతో పోలిస్తే వీరాపురంలో వేడి వాతావరణం ఉండటం, వేసవిలోనూ దగ్గరలోని చెరువుల్లో నీళ్లుండటంతో పక్షులు మా ఊరికే వస్తుంటాయి. కేవలం చేపలను మాత్రమే ఆహారంగా తీసుకుంటాయి. తమ పిల్లలకు కూడా మేత తీసుకొస్తాయి.

– ఎల్.లక్ష్మీపతి, వీరాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్

పక్షులతో విడదీయరాని బంధం



ఒంటరిగా వచ్చే ఈ పక్షులు గుడ్లు పెట్టి పొదిగి పిల్లలతో పాటే తిరిగి సైబీరియా వెళ్లిపోతాయి. మా తాతల కాలం నుంచి ఈ పక్షులు వస్తున్నాయి. పక్షులతో మా గ్రామానికి విడదీయరాని అనుబంధం. ఏటా పక్షుల సీజన్ కోసం ఎదురు చూస్తుంటాం.

– నరసింహారెడ్డి, వీరాపురం

డాబాపై డ్రాగన్ తోట

- కోవిడ్ తెచ్చిన కొత్త ఆలోచన
- గతేదాది నుంచి పూత
- వందకుపైగా మొక్కలు
- ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీరు వినూత్న సాగు
- ఆదర్శంగా నిలుస్తున్న సుదర్శనం అధికారి



మొక్కలు నిండి ఇలా పూత



రెండో అంతస్తుపై డ్రాగన్ తోట

రాజాం: ఆయనొక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వ్యవసాయమంటే మక్కువ. కోవిడ్ సమయంలో ఖాళీగా ఉన్న సమయంలో తల్లిదండ్రుల సాయంతో విదేశాల్లో బాగా కలిసివస్తున్న డ్రాగన్ పంట సాగుపై దృష్టిసారించాడు. ఆ పంటకు ఇక్కడ ఉన్న డిమాండ్ గుర్తించాడు. వేసిన పంట ద్వారా ఫలసాయం పొందాలని భావించాడు. ఏకంగా తన ఇంటి డాబానే వ్యవసాయ క్షేత్రంగా మలిచాడు. వందకుపైగా మొక్కలు నాటాడు. సస్యరక్షణ చర్యలు చేపట్టాడు. డ్రాగన్ తోట ఏపుగా పెరిగి దిగుబడి ఆరంభం కావడంతో... కష్టం ఫలించిందంటూ సంబరపడుతున్నాడు. ఆయనే రాజాం పట్టణం పరిధిలోని డోలపేట గ్రామానికి చెందిన సుదర్శనం అధికారి.

ఆరు సెంట్ల విస్తీర్ణంలో...

సుదర్శనం అధికారి విశాఖపట్నంలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆయనకు చిన్నప్పటి నుంచి రకరకాల పంటలు సాగుచేయడమంటే ఇష్టం. తల్లిదండ్రులు నర్సమ్మ, శాంతిమూర్తిల ప్రోత్సాహంతో కొంత పొలాన్ని కొనుగోలుచేసి మామిడితోటలు, జీడితోటలతో పాటు పొలాలు, ఇంటి ఆవరణలో వివిధ రకాల మొక్కలు సాగు చేస్తుంటాడు. అదే క్రమంలో కోవిడ్ సమయంలో ఇంటి డాబాపై డ్రాగన్ పంట సాగుకు పూనుకున్నాడు. 25 స్తంభాలు ఏర్పాటుచేసి ఆరుసెంట్లు విస్తీర్ణంలో ఉన్న డాబాపై వందకుపైగా డ్రాగన్ మొక్కలు 2020లో నాటాడు. గతేడాది జూలై నెలలో పూతకు వచ్చాయి. ఒక్కో మొక్కకు 12 నుంచి 15 వరకూ డ్రాగన్ పండ్లు దిగుబడి రావడంతో పాటు నాలుగు నెలలు పాటు పూత సాగింది. ఒక్కొక్కటి 800 గ్రాముల నుంచి 900 గ్రాముల బరువు ఉన్న పండ్లు దిగుబడి వస్తున్నాయి. పోషకాలు మెండుగా ఉన్న డ్రాగన్ పండ్ల కొనుగోలుకు ప్రస్తుతం అధికమంది ఆసక్తిచూపుతున్నారు.

నిరంతరం ఇద్దరు..

పొలం, ఇంటి వద్ద మొక్కల సంరక్షణకు ఇద్దరు రైతు కూలీలను నియమించాడు. ప్రతీ రెండు రోజులకు డ్రాగన్ మొక్కలకు నీరు పెట్టడం, ఏపుగా పెరిగిన కొమ్మలు తొలగించడం, పేడ గత్తం, వేప ఆకులతో సేంద్రియ ఎరువు తయారుచేసి మొక్కలపై పిచికారీ చేయడం వంటి పనులను వారు చక్కబెడుతున్నారు. డ్రాగన్ తోట సాగుతో ఇల్లు కూడా చల్లగా ఉంటోందని ఆయన చెబుతున్నారు.

అభిరుచితోనే...



మా ఇంటిపై ఏవో మొక్కలు వేద్దామని అనుకున్నాను. కోవిడ్ సమయంలో వర్క్‌ఫ్రమ్ హోమ్ కావడంతో ఆలోచన వచ్చింది. నెట్‌లో చెక్‌చేసి డ్రాగన్ తోటలపై దృష్టిసారించారు. ఖమ్మం నర్సరీతో పాటు రేగిడి మండలం కాగితాపల్లి వద్ద దూబ రమేష్ నర్సరీ నుంచి మొక్కలు తెచ్చాం. రూ.2 లక్షలు వెచ్చించి తోట వేశాం. ఇప్పుడు ఇవి అందంగా ఉండడంతో పాటు సీజన్‌లో మంచి పూత వస్తోంది. గతేడాది రూ.1.50 లక్షల వరకు ఆదాయం వచ్చింది.

– సుదర్శనం అధికారి, దోలపేట

సందడిగా విశాఖవ్యాలీ వార్షికోత్సవం



విద్యార్థుల నృత్య ప్రదర్శన

విశాఖపట్నం: విశాఖ వ్యాలీ స్కూల్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లాలని స్కూల్ చైర్మన్, కలెక్టర్ మల్లికార్జున అన్నారు. శనివారం స్కూల్ వార్షికోత్సవాన్ని గురజాడ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు హాయిగా విద్యనభ్యసించే వెసులుబాటు కలిగించే విధంగా పాఠశాల విద్యా విధానం ఉండడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులతో సమయాన్ని గడపాలన్నారు. వివిధ పోటీల్లో జాతీయ స్థాయిలో విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. స్కూల్ విస్తరణలో భాగంగా 42 గదులతో భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గడచిన విద్యా సంవత్సరంలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల సౌకర్యార్థం పాఠశాల ఆంగ్ల పత్రిక విక్యూబ్‌తో పాటు ఎంసీబీ కొత్త యాప్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

రికార్డ్

రంగోలి రవితేజం



స్కూల్లో ఇంకో రెండు రోజుల్లో ఫంక్షన్ జరగబోతోంది... 'సుధా రవికి చెప్పారా?' అనే ప్రశ్న చెవులకు వినిపిస్తుంది. మూడురోజుల్లో పెళ్లి జరగబోతుంది... 'సుధా రవికి తెలియజేశారా' అనే ప్రశ్న ఎదురు వస్తుంది. ఇంతకీ ఎవరీ సుధా రవి? ఒక్కమాటలో చెప్పాలంటే 'రంగోలి స్పెషలిస్ట్' ఎవరి రంగోలి ద్వారా శుభకార్యాల వేదికలకు కొత్తకళ వస్తుందో...ఆమె పేరే సుధా రవి. తాజాగా కూతురు రక్షితతో కలిసి రూపొందించిన రంగోలితో 'సింగపూర్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లోకి ఎంటర్ అయిందామె...

సుధా రవి తన కూతురు రక్షితతో కలిసి 26,000 ఐస్‌క్రీమ్ పుల్లలను ఉపయోగించి రూపొందించిన రంగోలి ఆర్ట్ వర్క్ 'సింగపూర్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లోకి ఎంటర్ అయింది. సింగపూర్‌లోని లిటిల్ ఇండియా షాప్‌కీపర్స్ అండ్ హెరిటేజ్ అసోసియేషన్(లిషా) ఆధ్వర్యంలో జరిగిన పొంగల్ వేడుకల్లో భాగంగా ఈ సిక్స్ బై సిక్స్ మీటర్ ఆర్ట్ వర్క్‌కు శ్రీకారం చుట్టింది సుధా రవి.


మామూలుగానైతే బియ్యంగింజలు, సుద్దముక్కలు... మొదలైనవి ఉపయోగించి రంగోలి వేసే సుధా ఈసారి మాత్రం ఐస్‌క్రీమ్ స్టిక్స్‌ను మాత్రమే ఉపయోగించింది. ఈ రంగోలిలో తమిళ కవులు తిరువళ్లువర్, అవ్వైయార్, భారతీయార్ చిత్రాలు ఆకట్టుకుంటాయి.

ఆశ్చర్యంగొలిపే అందమైన ఆర్ట్‌వర్క్‌లను రూపొందించడం రవికి కొత్తేమీ కాదు.

2016లో 3,200 చదరపు అడుగుల రంగోలీని రూపొందించి రికార్డ్ సృష్టించింది.

'సింగపూర్‌లో తమిళ సంప్రదాయాలు, కళలను ముందుకు తీసుకువెళ్లడానికి, ఈతరానికి చేరువ చేయడానికి సుధా రవి పనిచేస్తున్నారు' అంటున్నారు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకులు.

బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం చేస్తున్న సుధా రవి 'రంగోలి స్పెషలిస్ట్'గా పేరు తెచ్చుకుంది. వందల సంవత్సరాల చరిత్ర ఉన్న రంగోలి కళకు మరింత ప్రాచుర్యాన్ని కల్పించడానికి తన వంతుగా ప్రయత్నిస్తోంది.



భూమిని ప్రేమగా ముద్దాడే రంగోలిని కాన్వాస్‌పైకి కూడా తీసుకువచ్చి కనువిందు చేయడంలో సుధా రవి విజయం సాధించింది.

'అందరు పిల్లల్లాగే నాకు చిన్నప్పటి నుంచి రంగులు అంటే చాలా ఇష్టం. వాటిని చూస్తే చాలు ఎంతో సంతోషం కలిగేది. ఆ సంతోషమే నన్ను రంగోలి కళ వైపు నడిపించింది. రకరకాల ప్రయోగాలు చేసేలా చేసింది. ఎమోషన్స్ విత్ కలర్స్ కాన్సెప్ట్‌తో కూడా రంగోలి రూపొందించాను. సింగపూర్‌లో దశాబ్ద కాలంగా ఉంటున్నాము. మా జీవితంలో రంగోలి భాగం అయింది. నాలాగే నా కూతురు రక్షితకు రంగోలిపై ఆసక్తి ఉండడం సంతోషకరమైన విషయం' అంటుంది సుధా రవి.

భూమిని ప్రేమగా ముద్దాడే రంగోలిని కాన్వాస్ పైకి కూడా తీసుకువచ్చి కనువిందు చేయడంలో సుధా రవి విజయం సాధించింది.

ఇంటిప్స్



బట్టల మీద పడిన కూర, కాఫీ, టీ మరకలు పోవాలంటే..

- పసుపుపడిన వస్త్రాన్ని ముందు నీటితో కడిగి, తరువాత బేకింగ్ సోడా, బట్టల సబ్బుతో రుద్దాలి. ఇలా చేస్తే పసుపు రంగు కనిపించదు.
- కాఫీ టీ మరకలు పడిన వస్త్రాన్ని సోడా, సర్ఫ్ వేసి ఒక గంటపాటు నానపెట్టి తరువాత బ్రష్‌తో రుద్దితే మరకలు పోతాయి.
- ఆయిల్ పడిన బట్టలను వెనిగర్, బేకింగ్ సోడా, టాల్కం పౌడర్ వేసి అరగంటపాటు నానపెట్టి తరువాత బ్రష్‌తో రుద్దితే ఆయిల్ మచ్చలు మాయమవుతాయి.

బ్యూటిప్స్

గులాబి రేకులాంటి అధరాల కోసం!








- ఆర్గానిక్ తేనె, కొబ్బరి నూనె, చక్కెర.. ఒక్కోటీ టేబుల్ స్పూను చొప్పున తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదవులపై రాసి ఐదు నిమిషాలపాటు మర్దన చేసి నీటితో కడగాలి.
- కాఫీ పొడి, తేనెలను టేబుల్ స్పూన్ చొప్పున తీసుకుని పేస్టులా కలుపుకోవాలి.ఈ పేస్టును పెదవులకు రాసుకుని రెండు నిమిషాలు మర్దనా చేసి నీటితో కడిగేయాలి.
- గుప్పెడు గులాబిరేకులు, అర కప్పు పాలను మిక్సీజార్‌లో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు రాసి ఆరిన తరువాత నీటితో శుభ్రపరుచుకోవాలి.
- ఆలివ్ ఆయిల్, ఆరెంజ్ జ్యూస్, బీట్‌రూట్ రసం.. వీటిలో ఏదో ఒకటి రోజూ పెదాలకు రాసి మర్దనా చేసి తరువాత గోరు వెచ్చని నీటితో కడగాలి.

వీటిలో ఏఒక్కటి పాటించినా గులాబి రేకులాంటి పింక్ రంగు పెదాలు మీ సొంతమవుతాయి.



హ్యాపీ జర్నీ



సంక్రాంతి సెలవులు పూర్తయ్యాయి. స్కూళ్లు తిరిగి మొదలయ్యాయి. వేసవి సెలవుల కోసం ఎదురు చూపులూ మొదలయ్యాయి. పరీక్షలు పూర్తవడమే తరువాయి, ఓ వారమైనా ఎటైనా వెళ్లి వస్తే తప్ప మనసు రీచార్జ్ కాదు. కొత్త ఏడాదికి సిద్ధం కాదు. ఇదిలా ఉంటే కరోనా వచ్చింది, వెళ్లింది, మళ్లీ వచ్చింది, వెళ్లింది. వేవ్‌ల నంబరు పెరుగుతోంది. మరో వేవ్‌కి సిద్ధంగా ఉండమనే సూచనలు షురూ అవుతున్నాయి. ఇలాంటప్పుడు 'క్షేమంగా వెళ్లి, సంతోషంగా రావాలి' అంటే ఏం చేయాలి? దేశవిదేశాల్లో విస్తృతంగా పర్యటించిన హైదరాబాద్, సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పర్ట్ నీలిమ... కరోనా జాగ్రత్తల గురించి సాక్షితో పంచుకున్న వివరాలివి.

వర్క్ ఫ్రమ్ వెకేషన్!

''కరోనా నా ట్రావెల్ లైఫ్‌ను పెద్ద మలుపు తిప్పింది. నేను 2015 నుంచి కరోనా లాక్‌డౌన్ వరకు 60 దేశాల్లో పర్యటించాను. ఇండియా టూర్ వార్ధక్యం వచ్చిన తర్వాత అనుకునేదాన్ని. లాంగ్ వీకెండ్ వస్తే ఏదో ఒక దేశానికి వెళ్లిపోయేదాన్ని. కరోనాతో విదేశాలకు విమాన సర్వీసులు నిలిపి వేయడంతో మనదేశంలో పర్యటించడం మొదలుపెట్టాను. ఈశాన్య రాష్ట్రాలు, రాజస్థాన్ మినహా ఇండియాని దాదాపుగా చూసేశాను. ఈ సంక్రాంతికి కూడా ఓ వారం అనుకుని వెళ్లిన పాండిచ్చేరి వెకేషన్‌ని నెలకు పొడిగించుకున్నాను. వర్క్ ఫ్రమ్ హోమ్‌ని వర్క్ ఫ్రమ్ వెకేషన్‌గా మార్చుకున్నాను. నేను చూసినంత వరకు జనంలో కరోనా భయం దాదాపుగా పోయిందనే చెప్పాలి. దేశంలో 99 శాతం వ్యాక్సిన్ వేయించుకున్నారు. కో మార్బిడ్ కండిషన్ ఉన్న వాళ్లు డాక్టర్ సలహా తీసుకుని బూస్టర్ డోస్ కూడా వేయించుకున్న తర్వాత మాత్రమే టూర్‌లు ప్లాన్ చేసుకోవడం మంచిది. ఈ సమస్యలు లేని వాళ్లయితే ఏ మాత్రం సందేహం లేకుండా పర్యటనలు చేస్తున్నారు. అనేక పర్యాటక ప్రదేశాల్లో మాస్క్ లేకపోతే ప్రవేశం లేదనే బోర్డులున్నాయి, కానీ మాస్క్ నిబంధన మీద పట్టింపుగా కనిపించలేదు. అలాగని నిర్లక్ష్యం చేయకుండా రద్దీ ఉన్న చోట్ల తప్పనిసరిగా మాస్క్ ధరించాల్సిందే.

ప్రకృతి పిలుస్తోంది!

కరోనా భయం ఓ పక్క వెంటాడుతూనే ఉంది, కాబట్టి పర్యటనలకు ప్రకృతి ఒడినే ట్రావెల్ డెస్టినేషన్‌గా మార్చుకోవడం మంచిది. జలపాతాలు, సముద్ర తీరాలు, నదీతీరాలు, ట్రెకింగ్, స్కీయింగ్ జోన్‌లను ఎంచుకోవాలి. ఈ ప్రదేశాల్లో మనుషుల రద్దీ తక్కువగా ఉంటుంది. మాస్కు లేకుండా హాయిగా విహరించగలిగిన ప్రదేశాలివి. హిమాలయాల్లో ట్రెకింగ్‌కి మంచి లొకేషన్‌లున్నాయి. స్పితి వ్యాలీ, త్రియుండ్ కుండ్, కీర్‌గంగ, రూప్‌కుండ్, బ్రిబ్లింగ్, ఛషర్ మషర్ ట్రెక్, బ్రమ్‌తాల్, పిన్ పార్వతి, హమ్‌తా పాస్ ట్రెక్‌లను దాదాపుగా అందరూ చేయవచ్చు. యూత్‌కి హిమాలయాల్లో పన్నెండు రోజులపాటు సాగే సర్‌పాస్ ట్రెక్ మంచి థ్రిల్‌నిస్తుంది. నేను కశ్మీర్-గుల్‌మార్గ్, ఉత్తరాఖండ్-ఔలిలలో ఐస్‌స్కీయింగ్, ఆరోవిల్లెలో సర్ఫింగ్ కరోనా విరామాల్లోనే చేశాను. చార్‌ధామ్ యాత్రలో నాకు ఎలాంటి అసౌకర్యం కలగలేదు, కానీ యాత్ర ముగించుకుని ఫ్లయిట్ ఎక్కిన తర్వాత భయం వేసింది. ఆ టూర్ అంతటిలో తుమ్ములు, దగ్గులు వినిపించింది ఫ్లయిట్‌లోనే.




శాంతియాత్ర

లాక్‌డౌన్ విరమించిన తర్వాత నా ట్రావెల్ లిస్ట్‌లో ఈజిప్ట్, టర్కీ దేశాలు చేరాయి. పాండిచ్చేరి బీచ్‌లో సర్ఫింగ్, ఆరోవిల్లెలో మెడిటేషన్ నాకు అత్యంత సంతోషాన్నిచ్చాయి. జీవితంలో శాంతికంటే మరేదీ ముఖ్యంకాదని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. అందుకే అరోవిల్లెకి మరో లాంగ్ వెకేషన్ ప్లాన్ చేస్తున్నాను. ఆ తర్వాత యూఎస్‌కి వెళ్లి నా వందదేశాల టార్గెట్‌ని పూర్తి చేయాలనేది కోరిక'' అని చెప్పారు గమనంలోనే గమ్యాన్ని వెతుక్కుంటున్న నీలిమ. వర్క్ చేస్తూ వెకేషన్‌ని ఎంజాయ్ చేస్తున్నారామె. ఇలాంటి పర్యాటక ప్రియుల వల్లనే 'వర్కేషన్' అనే పదం పుట్టింది.

– వాకా మంజులారెడ్డి

కేర్‌ఫుల్‌గా వెళ్లిరండి!

కరోనా జాగ్రత్తలు పాటిస్తూ చేతులను తరచు శానిటైజర్‌తో శుభ్రం చేసుకుంటూ, ఆహారపానీయాల పరిశుభ్రత పాటిస్తూ హాయిగా పర్యటించవచ్చనేది నా అభిప్రాయం. అయితే పర్యాటక ప్రదేశాల్లో షాపింగ్ కోసం మార్కెట్‌లలో ఎక్కువ సేపు గడపకపోవడమే శ్రేయస్కరం. నేను గమనించిన ఆసక్తికరమైన సంగతి ఏమిటంటే... కాశీ అనగానే అది అరవై దాటిన తర్వాత వెళ్లే ప్రదేశం అనుకునే దాన్ని, ఇటీవల అది యూత్ ట్రావెల్ డెస్టినేషన్ అయింది. అక్కడ డిఫరెంట్ వైబ్స్ ఉన్నాయి.

– పానుగోటి నీలిమారెడ్డి, ట్రావెలర్



కంటి చూపుకు రెటీనా తెర ఆరోగ్యంగా ఉండటం ఎంత అవసరమో తెలిసిందే. వయసు పెరగడంతో వచ్చే కొన్ని కంటి సమస్యలతో రెటీనా దెబ్బతిని చాలామంది కనుచూపు కోల్పోవడం పరిపాటి. అయితే చాలా తొందర్లోనే మానవులకు 'ల్యాబ్'లో నిర్మించిన రెటీనా సాకారం కానుందా? దాన్ని మనుషుల్లో ప్రయోగించి చూశాక... అది విజయవంతమైతే... త్వరలోనే చూపు లేని ఎంతో మందికి చూడటం సాధ్యపడనుందా? అవుననే అంటున్నారు యూఎస్‌ఏలోని యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్‌సిన్-మేడిసన్‌కు చెందిన పరిశోధకులు. ఆ వివరాలేమిటో చూద్దాం.

మానవ నిర్మిత రెటీనా త్వరలోనే సాధ్యం కానుందా?!



కాంతి వల్ల కంటి వెనక ఉండే పలుచని పొర అయిన 'రెటీనా' వల్లనే దృష్టిజ్ఞానం కలుగుతుందన్న విషయం తెలిసిందే. ప్రమాదాల్లో రెటీనా ఊడిపోవడం, వయసు పెరుగుతున్న కొద్దీ కంటి జబ్బుల కారణంగా రెటీనా బలహీనపడి చూపు మందగించడం... ఇలాంటి కారణాలతో చాలా మంది అంధత్వానికి లోనవుతున్నారు. వీళ్లందరికీ దృష్టిజ్ఞానం ఇవ్వడం కోసం చాలా పరిశోధనలే చోటు చేసుకుంటున్నాయి. అందునా పరిశోధనశాల (ల్యాబ్)లో రెటీనాను రూపొందించడానికీ అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కొందరు శాస్త్రవేత్తలు 'ఆర్గనాయిడ్స్' అనే తరహా కణాలను 2014లోనే రూపొందించారు. ఇవి అచ్చం రెటీనా పనే చేస్తాయి. అంటే తమపై '3-డి' ఇమేజ్‌ను ప్రతిబింబించేలా చేయగల కణాల సమూహాలివి. మనిషి చర్మం నుంచి 'మూలకణాల్లా'ంటి (స్టెమ్‌సెల్స్‌లాంటి) వాటిని సేకరించడంతో ఈ ప్రయత్నం సాకారమైంది. అటు తర్వాత మరో అడుగు ముందుకేసి రకరకాల రెటీనాలను రూపొందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

పై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తల బృందాలే.. ల్యాబ్‌లో రూపొందించిన రెటీనా కణాలు వివిధ వేవ్‌లెంత్ గల కాంతి కిరణాలకు స్పందిస్తున్నాయనీ, అవి పొరుగున ఉన్న ఇతర కణాలతోనూ అనుసంధానమవుతున్నాయంటూ గతేడాది (2022)లో నిరూపించగలిగారు.

''మేము ఆర్గనాయిడ్స్ నుంచి కొన్ని కణాలను సేకరించి, వాటిని రకరకాల జబ్బుల కారణంగా దెబ్బతిన్న రెటీనాలోని మృతకణాల స్థానంలో అమర్చాడానికి ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతం ఇదే మాముందున్న సవాలు'' అంటున్నారు ఈ పరిశోధనకు నేతృత్వం వహిస్తున్న ఆఫ్తాల్మాలజిస్టు డాక్టర్ డేవిడ్ గామ్.

తమ ముందున్న ప్రతిబింబాన్ని తీసుకున్న ఆ కణాలు యాగ్జాన్స్ అనే పురికొసలాంటి కణాల ద్వారా... వెనక ఉన్న 'సైనాప్స్' అనే ఓ సిగ్నల్ బాక్స్ లాంటి దాన్నుంచి వెలువడాలి. ఆ సమాచారాన్ని ఎట్టకేలకు మెదడుకు చేరవేయాలి. కణాల్లోంచి వేరు చేసి అమర్చాక కూడా అవి రెటీనా నుంచి బయల్దేరి యాగ్జాన్స్ ద్వారా మెదడు కేంద్రం వరకు చక్కగా అనుసంధానితమవుతూనే (రి-కనెక్ట్ అవుతూనే) ఉండాలి. ఈ మధ్యలో ఎక్కడా సిగ్నల్స్‌ను కోల్పోకూడదు. అప్పుడే 'చూడటం' అనే ప్రక్రియ (విజన్ ప్రాసెస్) పూర్తవుతుంది.

శాస్త్రవేత్తలు ఇక్కడో విచిత్రాన్ని చేసి చూశారు. ఎక్కడా సిగ్నల్స్ కోల్పోని విధంగా అంతటా అనుసంధానం చక్కగా జరుగుతోందా, లేదా అనే విషయాన్ని పరిశీలించడం కోసం ఈ రెటీనా కణాలకు కావాలనే 'రేబీస్ వైరస్'ను అంటించారు. ఇది న్యూరోవైరస్ కావడం వల్ల దీన్ని ఎంచుకుని, వారం రోజుల వ్యవధిలో ఈ వైరస్ చివరి కణం వరకూ చేరిందంటే అన్ని కణాలూ చక్కగా అంటుకుని, అనుసంధానితమై ఉన్నాయని అర్థం.

''ల్యాబ్‌లో కొనసాగిన ఈ ఫలితాలన్నీ పరిశోధనశాల వరకైతే చక్కగానే ఉన్నాయి. ఇక చివరి టాస్క్ ఏదైనా ఉందంటే... అది మానవులపై పరిశోధనలు (హ్యూమన్ ట్రయల్స్) సాగించడమే. ఈ కణాల అమరిక బాగా జరిగి అవి రెటినాలోని కణాలుగా మనగలుగుతూ, రెటినల్ గ్యాంగ్లియాన్ సైనాప్సెస్ అమరికతో మనకు దృష్టిజ్ఞానాన్నిచ్చే 'ఆప్టిక్ నర్వ్'తో చక్కగా అనుసంధానమైతే చాలు! అదే జరిగితే రెటినైటిస్ పిగ్మెంటోజా, ఏజ్ రిలేటెడ్ మాక్యులార్ డీజనరేషన్, గ్లకోమా వంటి అనేక జబ్బుల కారణంగా చూపుకోల్పోయిన / చూపు మందగించిన వారికి చూపును ఇవ్వగలిగే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి'' అంటూ ఎంతోమందిలో ఓ ఆశాభావాన్ని రేకెత్తించే చల్లటి కబురు చెబుతున్నారు ఆఫ్తాల్మాలజిస్ట్ డాక్టర్ డేవిడ్ గామ్.

ఈ అధ్యయన ఫలితాలన్నీ 'పీఎన్ఏఎస్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

హెల్త్

చిన్నపిల్లల్లోనూ జుట్టురాలుతోందా?

చిన్నపిల్లల్లో అంటే ఐదేళ్ల మొదలుకొని... ఎనిమిది, తొమ్మిదేళ్ల పిల్లల్లో జుట్టు రాలిపోవడం కాస్తంత తక్కువే అయినా మరీ అంత అరుదేమీ కాదు. నిజానికి ఆ వయసులో క్రమంగా జుట్టు దట్టమమవుతూ ఉంటుంది. అలాంటి వయసులోనూ పిల్లల్లో జుట్టు రాలుతుండటానికి కారణాలు, వాటి నివారణ మార్గాలు తెలిపే కథనమిది.



జుట్టు రాలడం అనే కండిషన్‌ను వైద్యపరిభాషలో 'టీలోజెన్ ఎఫ్లువియమ్' అంటారు. పిల్లల్లో ఇలా జుట్టు రాలడం అనేది నిర్దిష్టంగా ఒక భాగంలో (లోకల్‌గా) జరగవచ్చు దీన్ని 'అలోపేషియా ఏరేటా' అంటారు. నిజానికి వెంట్రుకలు పాటించే సైకిల్ కారణంగా జుట్టులో కాస్త భాగం నిద్రాణంలోకి వెళ్లడం, మరికొంత రాలిపోవడం రోజూ సాధారణంగా జరిగే ప్రక్రియే. ఇలా పిల్లల్లో రోజూ 30 నుంచి 40 వరకు వెంట్రుకలు రాలిపోతూ ఉంటే... దాన్ని పెద్దగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. కానీ అంతకు మించి అంటే 80 – 100 వరకు వెంట్రుకలు రాలుతుంటే మాత్రం దాన్ని కాస్త సీరియస్‌గా జుట్టురాలడం (సిగ్నిఫికెంట్ హెయిర్ లాస్)లాగే పరిగణించాలి.

సాధారణ కారణాలు : అన్నిటికంటే పిల్లల్లో జుట్టు రాలడానికి ప్రధాన కారణం పోష్టిక ఆహార (ప్రోటీన్ మాల్ న్యూట్రిషన్, ఐరన్, జింక్‌తో పాటు ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్) లోపాల వల్ల కావచ్చు. ఇదే కారణమైతే పిల్లలకు ఐరన్, జింక్, ప్రోటీన్లు పుష్కలంగా ఉండే మంచి సమతులాహారంతో పరిస్థితి చక్కబడుతుంది. అలా కాకుండా కొన్ని మెకానికల్ సమస్యల (అంటే... జడలు బిగుతుగా వేయడం, బిగుతైన క్లిప్పులు పెట్టడం)వంటి కారణాలతోనూ జుట్టు రాలవచ్చు. ఆ వయసు పిల్లల్లో మరీ బిగుతుగా కాకుండా కాస్త తేలిగ్గా ఉండేలా జడలల్లడం వల్ల ఈ సమస్యని చాలా తేలిగ్గా నివారించవచ్చు.

కొంతమంది పిల్లల్లో జ్వరాలు (డెంగీ, మలేరియా, కోవిడ్ వంటివి) వచ్చి తగ్గాక కూడా మూడు నుంచి నాలుగు నెలల తర్వాత జుట్టు రాలడం కూడా జరగవచ్చు. దీన్ని పోస్ట్ వైరల్ ఫీవర్ ఎఫెక్ట్‌గా పరిగణించాలి.

కొన్ని నిర్దిష్ట కారణాలు : పైన పేర్కొన్న సాధారణ కారణాలు మినహాయిస్తే... చిన్న వయసు పిల్లల్లో జుట్టు రాలడానికి అనేక కారణాలు ఉంటాయి. ఉదాహరణకు పుట్టుకతోనే వచ్చే కారణాలు (కంజెనిటల్ కాజెస్), ఇన్ఫెక్షన్లు (అంటే... కొన్ని రకాల ఫంగల్ ఇన్ఫెక్షన్లు, పయోడెర్మా లాంటివి), తలలో పేలు పడటం, ఇతర అనారోగ్యాల కారణంగా మందులు వాడుతున్నప్పుడు అవి వారికి సరిపడక కూడా జుట్టు రాలిపోవచ్చు.

ఇక మరికొందరు పిల్లల్లో హార్మోన్ల అసమతౌల్యత (హైపోథైరాయిడ్, హైపర్‌థైరాయిడ్, చైల్డ్ డయాబెటిస్) లాంటి సమస్య వల్ల కూడా జుట్టు రాలవచ్చు. వీటిని పక్కన పెడితే పిల్లలు కూడా కొన్ని సందర్భాల్లో ఒత్తిడికి గురవుతారు. ఇలా పిల్లల్లో మానసిక ఒత్తిడి వల్ల కూడా జట్టు రాలిపోవచ్చు.

మంచి పోష్టికాహారం ఇవ్వడం, పిల్లలు బాగా ఆడుకునేలా చూస్తూ... మానసిక ఒత్తిడి నుంచి దూరంగా ఉండేలా చేయడం వంటి సాధారణ చర్యలతోనూ సమస్య చక్కబడకపోతే, అప్పుడు డాక్టర్‌ను సంప్రదించడం అవసరం.



డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

అత్యంత ఈజీగా అల్జైమర్స్ నివారణ!

వృద్ధాప్యంలో తామెవరో తమకే తెలియకుండా పోవడం... తమ సొంతవాళ్లను మాత్రమే కాదు... సొంత ఇంటినీ మరచిపోవడం ఎంత దురదృష్టకరం. అయితే ముందునుంచీ జాగ్రత్తపడితే అలాంటి దురవస్థ రాకుండా కాపాడుకోవడం అంత కష్టం కాదు. చాలా ఈజీగా అనుసరించదగిన ఈ కింది సూచనలు పాటిస్తే చాలు...



- బ్లడ్‌ప్రెషర్‌ను తరచూ చెక్ చేయించుకోవడం మంచిది. ఎందుకంటే సుదీర్ఘకాలం పాటు రక్తపోటు ఎక్కువగా ఉండటం అన్న అంశం మతిమరపు(డిమెన్షియా)ను పెంచుతుంది. అది పరోక్షంగా అల్జైమర్స్‌కూ దారితీయవచ్చు. అందుకే నిత్యం మన బీపీని అదుపులో ఉంచుకోవడం మేలు.
- బ్లడ్ ప్రెషర్ నియంత్రణతో పాటు అల్జైమర్స్ నివారణకూ ఆహారంలో ఉప్పు తగ్గించడం చాలా ఉపకరిస్తుంది.
- కండరాల కదలికలు చురుగ్గా ఉన్న వారితో పోలిస్తే... మందకొడి కదలికలు ఉన్న వారిలో అల్జైమర్స్ వచ్చే అవకాశాలు 60 శాతం వరకు ఎక్కువగా ఉంటాయని ఓ అధ్యయనంలో తెలిసింది. రోజూ 30 – 45 నిమిషాల పాటు నడక అల్జైమర్స్‌నే కాదు... ఆరోగ్యానికి అన్ని రకాలుగా మంచి చేస్తుంది. అందుకే ఇమ్యూనిటీని పెంచి ఎన్నో వ్యాధుల నివారణలతో పాటు పూర్తి ఆరోగ్యానికి దోహదం చేసే నడకను రోజూ కొనసాగించడం చాలా మంచిది.
- వ్యాయామం శరీరానికి మాత్రమే కాదు... మనసుకు కల్పించడం కూడా అల్జైమర్స్ నివారణకు తోడ్పడుతుంది. అందుకే రోజూ పత్రికల్లో లేదా సోషల్ మీడియాలో కనిపించే పజిల్స్, సుడోకూ, గళ్లనుడికట్టు వంటి మెదడుకు మేత కల్పించే అంశాలు ప్రాక్టీస్ చేస్తుండటం మేలు.
- సృజనాత్మకంగా ఆలోచించేవారికి అల్జైమర్స్ అవకాశం కాస్త తక్కువ. అందుకే మంచి ఊహాకల్పనలతో సృజనాత్మకంగా ఆలోచిస్తూ ఉండటం... ఆహ్లాదంగా, ఆనందంగా ఉంచడంతో పాటు అల్జైమర్స్‌నూ నివారిస్తుంది. అందుకే ఇష్టమైన, అభిరుచి ఉన్న కళలను ప్రాక్టీస్ చేస్తుండటం ఎంతో మేలు.

మలబద్ధకం నివారణ... మరికొన్ని ప్రయోజనాలు!!

మలబద్ధకం అన్నది ఉదయాన్నే చాలా మందిని బాధపెడుతుంది. సాఫీగా విరేచనం జరగకపోతే పొద్దున్నే లేచింది మొదలు రోజంతా ఇబ్బందికరంగానే గడుస్తుంది. అయితే మన రోజు వారీ ఆహారంలో కొన్ని మార్పులు చేసుకుని, కొన్ని రకాల ఆహారాలను తీసుకుంటుంటే మలబద్ధకం సమస్య చాలా సులువుగానే దూరమవుతుంది. అయితే ఈ మార్గాలతో కేవలం మలబద్ధకం నివారణ మాత్రమే కాకుండా అనేక అదనపు ప్రయోజనాలూ ఒనగూరతాయి.



- పీచు మోతాదు ఎక్కువగా ఉండే ఆహారాలు, పండ్లు క్రమం తప్పకుండా తీసుకుంటూ ఉంటే మలబద్ధకం సమస్య దరిచేరదన్న విషయం తెలిసిందే. ఆ ఆహారాలు కేవలం మలబద్ధకాన్ని నివారించడం మాత్రమే కాదు... పూర్తి జీర్ణాశయం మార్గాన్నీ శుభ్రంగా ఉంచుతాయి. ఇందుకోసం భోజనంలో ఎక్కువ మొత్తంలో ఆకుకూరలు, కాయగూరలు, ఫైబర్ ఎక్కువగా ఉండే కాయధాన్యాలతో పాటు, పీచు మోతాదులు పుష్కలంగా ఉండే పుచ్చకాయలు, బొప్పాయి, నారింజ వంటి పండ్లు తీసుకోవాలి. వీటితో మరో అదనపు ప్రయోజనం ఏమిటంటే... అవి తేలిగ్గా విరేచనమయ్యేలా చేయడంతో పాటు రక్తంలోని కొలెస్ట్రాల్‌నూ, చక్కెర మోతాదుల్ని నియంత్రణలో ఉంచడానికీ తోడ్పడతాయి.
- చిక్కుడు కాయల వంటి కూరల్లో ప్రోటీన్‌తో పాటు ఫైబర్ కూడా ఎక్కువే. చిక్కుళ్లు కండరాల రిపేర్లకూ, శక్తికీ, ఆరోగ్యకరమైన కండరాలకూ దోహదపడతాయి. అలాగే వాటిలోని పీచుపదార్థాలూ జీర్ణవ్యవస్థకు మేలు చేస్తాయి. క్యారట్, బీట్‌రూట్ వంటి వాటిల్లోనూ ఫైబర్ ఎక్కువే. వీటిని కూరలుగా తీసుకోవచ్చు. అయితే కొంతమందికి అవి కూరలుగా అంతగా నచ్చకపోవచ్చు. అలాంటివారు సలాడ్స్ రూపంలో లేదా సూప్‌గానూ తీసుకోవచ్చు.
- పీచుపదార్థాలుండే ఆహారాలతో పాటు తగినన్ని నీళ్లు తాగడం వల్ల కూడా విరేచనం సాఫీగా అవుతుంది. జీర్ణ వ్యవస్థ మార్గమూ శుభ్రపడుతుంది. దేహం హైడ్రేటెడ్‌గానూ ఉంటుంది. ఫలితంగా మలబద్ధక నివారణే కాదు చర్మానికి మంచి నిగారింపుతో కూడిన మెరుపును ఇవ్వడంతో పాటు మరెన్నో జబ్బుల నివారణకూ ఈ అంశం తోడ్పడుతుంది

ఇక్కడ పేర్కొన్న మార్గాలు కేవలం మలబద్ధకం నివారణ కోసం మాత్రమే కాకుండా... దాదాపు ప్రతి ఒక్కటి మన వ్యాధి నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడం, జీర్ణవ్యవస్థలోని పిండి పదార్థాలను (కార్బోహైడ్రేట్స్‌ను) రక్తంలోకి ఆలస్యంగా వెలువడేలా చేయడం ద్వారా మధుమేహాన్ని నివారించడం, మరెన్నో వ్యాధుల నుంచి రక్షణ కల్పించడం వంటి పనులూ చేస్తాయి.



స్నేహిత్‌కు రజతం

జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ మిక్స్‌డ్ డబుల్స్‌లో హైదరాబాద్ ఆటగాడు ఎస్. స్నేహిత్ రజత పతకం సాధించాడు. సూరత్‌లో జరుగుతున్న ఈ టోర్నీ ఫైనల్లో స్నేహిత్–దియా (మహారాష్ట్ర) జోడి 2–3 తేడాతో పాయస్ జైన్ (ఢిల్లీ) – యశస్విని ఘోర్పడే (కర్నాటక) చేతిలో ఓడింది. సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో కామన్వెల్త్ పతక విజేత సానిల్ శంకర్ (పీఎస్‌పీబీ)పై సంచలన విజయం సాధించిన స్నేహిత్... క్వార్టర్స్‌లో మానుష్ షా (గుజరాత్) చేతిలో పరాజయం పాలయ్యాడు.

గుజరాత్ జెయింట్స్ మెంటార్‌గా మిథాలీ రాజ్

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో అహ్మదాబాద్ జట్టు 'గుజరాత్ జెయింట్స్'కు భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ మెంటార్‌గా వ్యవహరించనుంది. మిథాలీ లాంటి స్టార్‌ను తమ బృందంలోకి ఆహ్వానించడం సంతోషంగా ఉందని డైరెక్టర్ ప్రణవ్ అదానీ చెప్పారు. డబ్ల్యూపీఎల్ కోసం ఆమె రిటైర్మెంట్‌ను పక్కన పెట్టి తొలి టోర్నీలో ఆడవచ్చని వినిపించింది. అయితే తాజా ప్రకటనతో మిథాలీ ప్లేయర్‌గా ఆడే అవకాశాలు లేవని తేలిపోయింది.



సబలెంకా కల తీరగా...



- ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంప్‌గా బెలారస్ స్టార్
- తొలి గ్రాండ్‌స్లామ్ అందుకున్న సబలెంకా
- ఫైనల్లో రిబాకినాపై విజయం

ఒకరు 195 కిలోమీటర్ల వేగంతో సర్వీస్ చేస్తున్నారు.... మరొకరు ఏమాత్రం తగ్గకుండా 192 కిలోమీటర్ల వేగంతో జవాబిస్తున్నారు... ప్రతీ పాయింట్ కోసం హోరాహోరీ సమరం... వీరి షాట్లతో బంతి పగిలిపోతుందేమో అనిపించింది... ఒకరు ఇప్పటికే గ్రాండ్‌స్లామ్ చాంపియన్ కాగా, మరొకరు తొలి టైటిల్ వేటలో పోరాడుతున్నారు...దూకుడు ఎలా ఉందంటే తొలి 13 పాయింట్లలో 7 ఏస్‌ల ద్వారానే వచ్చాయి... చివరి వరకు కూడా అదే ధాటి కొనసాగింది... గత కొన్నేళ్లుగా ఏకపక్షంగా జరుగుతున్న మహిళల గ్రాండ్‌స్లామ్ ఫైనల్ మ్యాచ్‌లతో పోలిస్తే పోటీపోటీగా, అత్యుత్తమ స్థాయిలో ఈ తుది పోరు సాగింది. చివరకు 2 గంటల 28 నిమిషాల ఆట తర్వాత విజేత అవతరించింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ కొత్త చాంపియన్‌గా అరైనా సబలెంకా నిలిచింది.

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో చాంపియన్‌గా నిలిచిన 29వ క్రీడాకారిణిగా అరైనా సబలెంకా గుర్తింపు తెచ్చుకుంది. శనివారం జరిగిన తుది పోరులో సత్తా చాటిన 24 ఏళ్ల ఈ బెలారస్ స్టార్ తన కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్‌ను అందుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో 22వ సీడ్ సబలెంకా 4–6, 6–3, 6–4 స్కోరుతో ఐదో సీడ్ ఎలెనా రిబాకినా (కజకిస్తాన్)ను ఓడించింది. మ్యాచ్‌లో సబలెంకా 17 ఏస్‌లు కొట్టగా, రిబాకినా 9 ఏస్‌లు బాదింది. ప్రత్యర్థితో పోలిస్తే 51–31 విన్నర్లతో ఆమె పైచేయి సాధించింది. విజేతగా నిలిచిన సబలెంకాకు 29 లక్షల 75 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు (సుమారు రూ. 17.34 కోట్లు), రన్నరప్ రిబాకినాకు 16 లక్షల 25 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు (సుమారు రూ. 9.47 కోట్లు) ప్రైజ్‌మనీగా లభించాయి. తాజా గెలుపుతో సబలెంకా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరే అవకాశం ఉంది.

హోరాహోరీగా...

ఫైనల్‌కు ముందు బలాబలాలు చూస్తే ఇద్దరు సమ ఉజ్జీలుగానే కనిపించారు. ఇప్పటికే గ్రాండ్‌స్లామ్ గెలిచిన అనుభవంతో పాటు ఈ టోర్నీలో ముగ్గురు గ్రాండ్‌స్లామ్ విజేతలు స్వియాటెక్, ఒస్టాపెంకో, అజరెంకాలను ఓడించిన ఘనతతో రిబాకినా బరిలోకి దిగగా, ఈ ఏడాది ఓటమి ఎరుగని రికార్డుతో సబలెంకా నిలిచింది. తొలి సెట్‌లో రిబాకినా ఆధిక్యం ప్రదర్శిస్తూ 3–1తో ముందంజ వేసినా, ఆపై కోలుకొని ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన బెలారస్ ప్లేయర్ 4–4తో స్కోరు సమం చేసింది. అయితే బ్రేక్ సాధించిన రిబాకినా ఆపై సర్వీస్ నిలబెట్టుకొని తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్‌లో తన ఫోర్‌హ్యాండ్ పదును ప్రదర్శించిన సబలెంకా 4–1 వరకు వెళ్లింది. ఆపై కజక్ ప్లేయర్ ఎదురుదాడి చేసే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. రెండు వరుస ఏస్‌లతో సబలెంకా సెట్ ముగించింది. మూడో సెట్‌లో ఇద్దరూ తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో స్కోరు 3–3కు చేరింది. అయితే ఫోర్‌హ్యాండ్ విన్నర్‌తో కీలకమైన ఏడో గేమ్‌ను బ్రేక్ చేసిన సబలెంకాకు మళ్లీ వెనక్కి చూడాల్సిన అవసరం లేకపోయింది.

'నేను టైగర్‌ను'

ఐదేళ్ల క్రితం సబలెంకా తొలిసారి ఆస్ట్రేలియా ఓపెన్ బరిలోకి దిగింది. మొదటి రౌండ్ మ్యాచ్‌లోనే ఆమె స్థానిక స్టార్ యాష్లీ బార్టీతో తలపడాల్సి వచ్చింది. అయితే షాట్ ఆడే సమయంలో సబలెంకా చేస్తున్న అరుపులు వివాదాన్ని రేపాయి. ప్రేక్షకులు ఆమెను బాగా ఎగతాళి చేశారు. చివరకు ఓటమితో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించాల్సి వచ్చింది. ఇప్పుడు అదే గడ్డపై ఆమెపై అభినందనల వర్షం కురుస్తోంది. సబలెంకా దూకుడైన ఆట, పదునైన ఏస్‌లు తప్ప ఆమె అరుపులు ఎవరికీ వినిపించడం లేదు. సబలెంకా ఎడమ చేతిపై పెద్దపులి టాటూ ఉంటుంది. 'నేను నాలాగే ఉంటాను. ఎవరినీ లెక్క చేయను. నేను టైగర్‌ను' అంటూ తనకు తాను చెప్పుకునే సబలెంకా అలాంటి ధీరోదాత్త ఆటను ప్రదర్శించింది. ఆరడుగుల ఎత్తు ఉన్న సబలెంకా బలం వేగవంతమైన సర్వీస్‌లో ఉంది. అయితే అదే



బలం బలహీనతగా మారి గత టోర్నీలో నాలుగు రౌండ్లలోనే 56 డబుల్‌ఫాల్ట్‌లు చేసింది. ఈ సారి తన కోచింగ్ బృందంతో కలిసి ప్రత్యేక దృష్టి పెట్టిన ఆమె ఇప్పుడు 7 మ్యాచ్‌లలో కలిపి 29 డబుల్ ఫాల్ట్‌లే చేసింది. సబలెంకా టెన్నిస్‌ను చాలా ఆలస్యంగా మొదలు పెట్టింది. హాకీ ఆటగాడైన తండ్రి సెర్గీ ప్రోత్సాహంతో ఆటలోకి అడుగు పెట్టిన ఆమె 15 ఏళ్ల వయసు వరకు ఎలాంటి జూనియర్ టోర్నీలు ఆడనే లేదు. 16 ఏళ్ల వయసులో నేషనల్ టెన్నిస్ అకాడమీలో చేరిన తర్వాత ఆమె కెరీర్ మలుపు తిరిగింది. 2019లో తండ్రి ఆకస్మిక మరణం సబలెంకాను కలచివేసింది. 'మా నాన్న నన్ను వరల్డ్‌నంబర్ వన్‌గా చూడాలనుకున్నారు' అని ఆమె గుర్తు చేసుకుంది. ఓపెన్ ఎరాలో గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన 58వ మహిళా ప్లేయర్‌గా నిలిచి రెండో ర్యాంక్‌కు చేరిన సబలెంకా నంబర్‌వన్ కావడానికి మరెంతో దూరం లేదు!

పాండ్యా సేనకు పరీక్ష

- నేడు న్యూజిలాండ్‌తో రెండో టి20
- గెలిస్తేనే సిరీస్ రేసులో
- పట్టుదలతో కివీస్
- రా.గం.7 నుంచి 'స్టార్‌స్పోర్ట్స్–1'లో ప్రత్యక్ష ప్రసారం

లక్నో: ఈ కొత్త ఏడాది జోరుమీదున్న భారత్ తొలి సారి కఠిన పరీక్ష ఎదుర్కొంటోంది. వన్డేల్లో క్లీన్‌స్వీప్ చేసిన కివీస్‌తోనే టి20 సిరీస్ ఆరంభ పోరులో కఠిన సవాలు ఎదురైంది. ఇప్పుడు సిరీస్‌లో తప్పక గెలిచి నిలవాల్సిన పరిస్థితిలో టీమిండియా ఉంది. ఈ నేపథ్యంలో ఒత్తిడంతా ఆతిథ్య జట్టుపైనే ఉంది. మరోవైపు న్యూజిలాండ్ ఆల్‌రౌండ్ ప్రతిభతో పుంజుకొని మనకు షాక్ ఇచ్చింది. దీంతో టీమిండియా మరోసారి ఆదమరిస్తే ఈ సారి మ్యాచ్‌ను కాదు... సిరీస్‌నే కోల్పోవాల్సి వుంటుంది. ముఖ్యంగా టాపార్డర్ మెరిపించాలి. శుబ్‌మన్ గిల్ గత మ్యాచ్‌లో విఫలం కాగా, ఇషాన్ కిషన్ అటు వన్డే, ఇటు టి20ల్లో తీవ్రంగా నిరుత్సాహపరుస్తున్నాడు. ఇటీవల దీపక్ హుడాకు టీమ్ మేనేజ్‌మెంట్ చెప్పుకోదగ్గ అవకాశాలిస్తున్నా... తను మాత్రం సద్వినియోగం చేసుకోవడం లేదు. ఈ మ్యాచ్‌లో ఇషాన్,



హుడా నిరూపించుకోవాల్సిన అవసరం వచ్చింది. బౌలింగ్‌లో ఉమ్రాన్ మలిక్ పేస్‌తో పాటు వైవిధ్యం కనబర్చాలి. సుందర్‌తో పాటు కుల్దీప్ కూడా స్పిన్‌తో కట్టడి చేస్తే భారత్‌కు ఏ ఇబ్బంది ఉండదు. తొలి మ్యాచ్‌లో ఓడినా నేడు తుది జట్టులో మార్పులేమీ ఉండకపోవచ్చు.

పిచ్–వాతావరణం

వాజ్‌పేయి స్టేడియం బ్యాటింగ్ పిచ్. ఇక్కడ భారత్ గతంలో రెండు మ్యాచ్‌ల్లో 190 పైచిలుకు పరుగులు చేసి గెలిచింది. ఉత్తరాది వేదిక కావడంతో మంచు ప్రభావం మరింత ఎక్కువ.

తుది జట్లు (అంచనా)

భారత్: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), గిల్, ఇషాన్, త్రిపాఠి, సూర్యకుమార్, సుందర్, దీపక్ హుడా, శివమ్ మావి, కుల్దీప్, అర్ష్‌దీప్, ఉమ్రాన్.

న్యూజిలాండ్: సాన్‌ట్నర్ (కెప్టెన్), అలెన్, కాన్వే, చాప్‌మన్, ఫిలిప్స్, మిచెల్, బ్రేస్‌వెల్, ఇష్‌సోధి, ఫెర్గూసన్, డఫీ, టిక్నర్.

భారత్ 9వ స్థానంతో ముగింపు

- 5–2తో దక్షిణాఫ్రికాపై గెలుపు
- ప్రపంచకప్ హాకీ

భువనేశ్వర్: సొంత గడ్డపై జరుగుతున్న ఎఫ్‌ఐహెచ్ ప్రపంచ కప్ హాకీలో క్వార్టర్ ఫైనల్ కూడా చేరలేక నిరాశపరిచిన భారత జట్టు చివరకు విజయంతో మెగా టోర్నీని ముగించింది. శనివారం 9 నుంచి 12వ స్థానాల కోసం



జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో భారత్ 5–2తో దక్షిణాఫ్రికాపై గెలుపొందింది. అయితే మరో మ్యాచ్‌లో అర్జెంటీనా 6–0 స్కోరు తేడాతో వేల్స్‌ను చిత్తు చేయడంతో భారత్, అర్జెంటీనాలు సంయుక్తంగా 9వ స్థానంలో నిలిచాయి. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ తరఫున అభిషేక్ (4వ ని.), హర్మన్‌ప్రీత్ సింగ్ (11వ ని.), షంషేర్ సింగ్ (44వ ని.), ఆకాశ్‌దీప్ సింగ్ (48వ ని.), సుఖ్‌జీత్ సింగ్ (58వ ని.) తలా ఒక గోల్ చేశారు. సఫారీ జట్టులో సంకెలో ఎంవింబి (48వ ని.), ముస్తఫా కాసిమ్ (59వ ని.) చెరో గోల్ చేశారు. ఆట ఆరంభమైన నాలుగో నిమిషంలోనే అభిషేక్ ఫీల్డ్‌గోల్‌తో భారత్‌కు శుభారంభమిచ్చాడు. ఈ క్వార్టర్‌లోనే హర్మన్‌ప్రీత్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచి 2–0తో ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. ఇదే స్కోరుతో తొలి అర్ధభాగాన్ని (రెండు క్వార్టర్లు) ముగించిన భారత్ ఆఖరి క్వార్టర్‌లో మరో రెండు ఫీల్డ్ గోల్స్‌ను ఆకాశ్‌దీప్, సుఖ్‌జీత్ సాధించడంతో విజయం సులువైంది.

ఫైనల్ సమరానికి సిద్ధం

- నేడు మహిళల అండర్–19 వరల్డ్ కప్ తుది పోరు
- ఇంగ్లండ్‌తో భారత అమ్మాయిల ఢీ

పాచెఫ్‌స్ట్రూమ్: మహిళల క్రికెట్‌లో ఇప్పటి వరకు ఒక్క ఐసీసీ టోర్నీ కూడా గెలవని భారత జట్టు ఆ ఘనతకు అడుగు దూరంలో ఉంది. సీనియర్ అమ్మాయిల జట్టు మూడు ప్రపంచకప్ (రెండు వన్డే, ఒకటి టి20) ఫైనల్లో ఆడినా... రన్నరప్‌గానే సరిపెట్టుకుంది. ఇప్పుడు ఈ జూనియర్ జట్టు ఫైనల్ విజయంతో వస్తే... భారత మహిళల క్రికెట్ ప్రగతి మరో దశకు చేరుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. షఫాలీ వర్మ సారథ్యంలోని భారత జట్టు ఆదివారం ఇంగ్లండ్‌తో అమీతుమీకి సిద్ధమైంది. శనివారమే పుట్టినరోజు జరుపుకున్న షఫాలీకి వున్న అంతర్జాతీయ అనుభవం, జట్టు ఈ టోర్నీలో కనబరిచిన ప్రదర్శనను బట్టి చూస్తే భారతే ఫేవరెట్‌గా కనిపిస్తోంది. పైగా రెండు ప్రపంచకప్ ఫైనల్స్ ఆడిన షఫాలీ తన నైపుణ్యంతో జట్టును విజయతీరాలకు చేర్చితే ఆమె ఖాతాలో అరుదైన రికార్డు చేరుతుంది. సెమీఫైనల్లో షఫాలీ సేన న్యూజిలాండ్‌పై అలవోక విజయం సాధించింది. మొదట బౌలర్లు, తర్వాత బ్యాటర్లు కివీస్ అమ్మాయిలపై ఆధిపత్యం చలాయించారు. ఫైనల్లోనూ ఇదే పట్టుదల కనబరిస్తే ప్రపంచకప్ చేతికందుతుంది. మరో వైపు సెమీస్‌లో హోరాహోరీ సమరంలో చిరకాల ప్రత్యర్థి ఆస్ట్రేలియాను ఓడించడంతో ఇంగ్లండ్ జట్టులో ఆత్మవిశ్వాసం పెరిగింది. భారత జట్టుకు తగిన పోటీ ఇవ్వగల సత్తా ఇంగ్లండ్‌కు ఉంది.



సా.గం.5.15 నుంచి 'ఫ్యాన్‌కోడ్' యాప్‌లో ప్రసారం

నేడు ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల ఫైనల్
జొకోవిచ్ (సెర్బియా) X సిట్సిపాస్ (గ్రీస్)
మ.గం. 2 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం

నేడు హాకీ ప్రపంచకప్ ఫైనల్
జర్మనీ X బెల్జియం
రా.గం. 7 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

సినిమా

- బర్త్‌డే సెలబ్రేషన్‌లో శంతను, అక్షర, కాజోల్‌తో శ్రుతీహాసన్



ఈసారి బర్త్‌డేకి అలా కోరుకున్నా!

'నిన్ను నిన్నుగా నువ్వు ప్రేమించుకోవడాన్ని మర్చిపోకు'' అంటున్నారు శ్రుతీహాసన్. శనివారం (జనవరి 28) ఆమె పుట్టినరోజు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేశారు శ్రుతి. ''నా జీవితం ఎంత గొప్పగా సాగుతోందో, మాటల్లో వర్ణించలేని ప్రేమను ఎంతగా పొందగలుగుతున్నానో (కుటుంబ సభ్యులు, ఫ్యాన్స్, ఫ్రెండ్స్‌ని ఉద్దేశించి) అనే ఆనందమైన ఆలోచనలతో నిద్ర లేచాను. ప్రతి ఏడాదీ నా బర్త్ డే కేక్‌పై ఉన్న కొవ్వొత్తులను ఆర్పిన తర్వాత కొన్ని నిర్ణయాలు తీసుకుంటాను. కానీ ఈ ఏడాది మాత్రం నా కోసమే కాదు.. అందరి కోసం కోరుకున్నాను. అందరూ ఎంతో సంతోషంగా జీవితాన్ని గడపాలని, వారు కోరుకున్నది వారికి దక్కేలా పరిస్థితులు అనుకూలించాలని కోరుకుంటున్నాను. నిజం చెప్పాలంటే... ఎవరికి దక్కాల్సింది వారికి దక్కుతూనే ఉంటుంది. ప్రతి బర్త్ డేకి వయసు సంఖ్య పెరగడం సహజం. ఆ అనుభవం రీత్యా కాస్త తెలివైనవాళ్ళం కూడా అవుతుంటాము (సరదాగా..). అలాగే ఈ ప్రపంచమనే యుద్ధంలో ప్రతిసారీ ఒంటరి సైనికుడిలా నెగ్గుకురాలేమని కూడా అర్థం అవుతోంది. అయితే నా చుట్టూ ఉన్న ప్రపంచంలో ఎంతో తెలివైనవారు, సానుకూల దృక్పథంతో ఉన్నవారు ఉన్నందుకు నేనే వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇక ఈ ప్రపంచంలో నువ్వు చాలా ప్రత్యేకమైన వ్యక్తివి. సో.. నీ ప్రత్యేకతను నువ్వు ప్రేమిస్తూనే ఉండాలి'' అని రాసుకొచ్చారు శ్రుతీహాసన్. కాగా ఈ బర్త్ డేని శ్రుతీహాసన్ చాలా సందడిగా జరుపుకున్నట్లుగా ఫొటోలు చెబుతున్నాయి. ఈ వేడుకల్లో శ్రుతీ తల్లి సారిక, చెల్లి అక్షరాహాసన్‌లతో పాటు ఆమె బాయ్‌ఫ్రెండ్ శంతను హజారికా, బాలీవుడ్ నటి కాజోల్ కూడా పాల్గొన్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. ఈ బ్యూటీ ప్రస్తుతం ప్రభాస్ సరసన 'సలార్'లో హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే 'ది ఐ' అనే ఇంగ్లిష్ ఫిల్మ్‌లో శ్రుతి ఓ లీడ్ రోల్ చేస్తున్నారు.


- అల్లు అర్జున్

ఆమె ప్రేమే నన్ను మార్చింది!

- రజనీకాంత్

సూపర్ స్టార్ రజనీకాంత్ ఏ వేడుకలో పాల్గొన్నా సినిమాల గురించే ఎక్కువగా మాట్లాడతారు. వ్యక్తిగత విషయాలు మాట్లాడిన దాఖలాలు దాదాపు లేవు. అలాంటిది ఇటీవల తన వ్యక్తిగత అలవాట్ల గురించి, తన భార్య లత కారణంగా తాను మారిన విషయం గురించి చెప్పి ఆశ్చర్యపరిచారు. రజనీకాంత్ మాట్లాడుతూ – ''నేను బస్ కండక్టర్‌గా ఉద్యోగం చేస్తున్న సమయంలో మద్యం సేవించేవాడిని. ధూమపానం బాగా అలవాటు. మాంసాహారం కూడా కాస్త ఎక్కువగానే తీసుకునేవాడిని. మద్యం–మాంసాహారం–సిగరెట్.. ఈ మూడూ మంచి కాంబినేషన్. అయితే ఈ చెడు అలవాట్లు ఉంటే 60 ఏళ్లకు పైన బతకరు. ఈ అలవాట్లు ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదని, కొంతకాలం తర్వాత ఇవి మన అనారోగ్యానికి కారణమవుతాయని అనిపించింది. నా భార్య లత వల్లే నా చెడు అలవాట్లకు నేను దూరం కాగలిగాను. ఆమె తన ప్రేమతో నన్ను మార్చింది. లత ప్రేమ వల్లే ఇప్పుడు వీటికి దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడుపుతున్నాను. 73ఏళ్లలోనూ నేనింత ఆరోగ్యంగా ఉండటానికి కారణం తనే. అందుకే నా భార్య లతకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. అలాగే లతను నాకు పరిచయం చేసిన మహేంద్రన్ (లత బావ, నటుడు, రచయిత వైజీ మహేంద్రన్‌ని ఉద్దేశించి)కూ రుణపడి ఉంటాను'' అని చెప్పుకొచ్చారు రజనీకాంత్. వైజీ మహేంద్రన్ రూపొందించిన 'చారుకేశి' నాటికకు సంబంధించిన వేడుకలో పాల్గొన్న రజనీ తన అలవాట్ల గురించి ఈ విధంగా చెప్పుకొచ్చారు. ఇక ప్రస్తుతం రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో 'జైలర్' సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే.


- రజనీకాంత్,లత

డ్యాన్స్ పుష్ప డ్యాన్స్

వైజాగ్ పోర్టులో అదిరిపోయే డ్యాన్స్ మూమెంట్స్ చేస్తున్నారు అల్లు అర్జున్. 'పుష్ప' చిత్రంలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' సక్సెస్ తర్వాత మలి భాగం 'పుష్ప: ది రూల్'తో బిజీగా ఉన్నారు ఈ చిత్రం హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ వైజాగ్‌లోని పోర్టు లొకేషన్స్‌లో జరుగుతోంది. అల్లు అర్జున్ పై ఓ పాట చిత్రీకరిస్తున్నట్లుగా తెలిసింది. ఇది హీరో ఇంట్రడక్షన్ సాంగ్ అట. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో నటిస్తున్నారు అల్లు అర్జున్. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ఆరంభంలో రిలీజ్ కానున్నట్లు తెలిసింది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

పగ సాధిస్తా!

పగ తీర్చుకోవడానికి పక్కా ప్రణాళిక వేస్తున్నారు బాలీవుడ్ నటి రవీనా టాండన్. అమెరికన్ టెలివిజన్ మిస్టరీ థ్రిల్లర్ సిరీస్ 'రివెంజ్' హిందీ రీమేక్‌లో రవీనా టాండన్ నటించనున్నట్లుగా వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ వార్త నిజం అని నిర్ధారిస్తూ.. ''ఈ ప్రాజెక్ట్‌లో భాగమవ్వడం చాలా స్పెషల్‌గా అనిపిస్తోంది'' అని పేర్కొన్నారు రవీనా. ఇక ఈ 'రివెంజ్' వెబ్ సిరీస్ హిందీ అడాప్షన్‌కు దర్శకుడు ఇంకా ఖరారు కాలేదు. కాగా 2021లో వచ్చిన 'ఆర్యాంక్' వెబ్ సిరీస్ తర్వాత రవీనా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రాజెక్ట్ ఇదే. ఇక 'రివెంజ్' కథ విషయానికి వస్తే... కొందరి స్వార్థపరుల ఆత్యాశ వల్ల హత్య చేయబడిన తన తండ్రి కోసం ఓ యువతి చేసే పోరాటం నేపథ్యంలో కథ సాగుతుంది. ఈ సంగతి ఇలా ఉంచితే... జనవరి 26న వెలువడిన 'పద్మ' అవార్డుల్లో రవీనాకు పద్మశ్రీ పురస్కారం వరించిన సంగతి తెలిసిందే.


- రవీనా టాండన్


- దివ్యాంశా కౌశిక్, సందీప్ కిషన్

మా నమ్మకం నిజమైంది

- సందీప్ కిషన్

''మైఖేల్' కథని, దర్శకుడు రంజిత్‌ని బలంగా నమ్మాం. ట్రైలర్‌కి వచ్చిన అద్భుతమైన స్పందన మా నమ్మకాన్ని నిజం చేసింది. కథ, కంటెంట్, మేకింగ్ పరంగా 'మైఖేల్' యూనివర్సల్‌గా రీచ్ అయ్యే సినిమా'' అని హీరో సందీప్ కిషన్ అన్నారు. రంజిత్ జయకొడి దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా రూపొందిన చిత్రం 'మైఖేల్'. విజయ్ సేతుపతి, వరలక్ష్మీ శరత్ కుమార్, దివ్యాంశా కౌశిక్, వరుణ్ సందేశ్, గౌతమ్ మీనన్ కీలక పాత్రల్లో నటించారు. నారాయణ్ దాస్ కె. నారంగ్ సమర్పణలో భరత్ చౌదరి, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 3న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రంజిత్ జయకొడి మాట్లాడుతూ– ''నేను తమిళ్‌లో మూడు సినిమాలు తీశాను. తెలుగులో 'మైఖేల్' నా మొదటి చిత్రం. యాక్షన్, రొమాన్స్, ఎమోషన్.. ఇలా అన్ని అంశాలున్న చిత్రమిది'' అన్నారు. ''సందీప్ కిషన్‌కి సినిమా తప్ప మరో తపన ఉండదు. ఈ మూవీ కోసం ఆయన ఎంత కష్టపడ్డారో ట్రైలర్‌లోనే తెలుస్తోంది. 'మైఖేల్'తో సక్సెస్ కొడతామనే నమ్మకం ఉంది'' అన్నారు భరత్ చౌదరి. ''రంజిత్ 'మైఖేల్' కథ చెప్పిన వెంటనే మరో ఆలోచన లేకుండా సినిమా చేద్దామని చెప్పాం'' అన్నారు పుస్కూర్ రామ్మోహన్ రావు. ''మైఖేల్' లాంటి మంచి సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉంది'' అన్నారు దివ్యాంశా కౌశిక్, వరుణ్ సందేశ్.

అది నా అదృష్టం

- ఆషికా రంగనాథ్

''తెలుగు సినిమాలంటే చాలా ఇష్టం. తెలుగులో నటించాలని కొన్నేళ్లుగా అనుకుంటున్నాను. గతంలో కొన్ని కథలు నచ్చక పోవడం, మరికొన్ని నా డేట్స్ కుదరక చేయలేదు. కానీ 'అమిగోస్' కథ వినగానే నచ్చేసింది. మైత్రీ మూవీ మేకర్స్ వంటి పెద్ద ప్రొడక్షన్‌లో నా తొలి చిత్రం చేయడం నా అదృష్టం. 'అమిగోస్' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని ఆషికా రంగనాథ్ అన్నారు. ''బింబిసార' వంటి హిట్ చిత్రం తర్వాత కల్యాణ్ రామ్ హీరోగా నటించిన చిత్రం 'అమిగోస్'. రాజేంద్ర రెడ్డి దర్శకత్వం వహించారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 10న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ద్వారా తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయమవుతున్న కన్నడ హీరోయిన్ ఆషికా రంగనాథ్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ– ''అమిగోస్'లో నేను రేడియో జాకీ పాత్ర చేశాను. నేటితరం అమ్మాయిలకు నా పాత్ర బాగా నచ్చుతుంది. స్క్రీన్‌పై నా పాత్ర నిడివి తక్కువగానే ఉన్నప్పటికీ నటనకు ఆస్కారం ఉన్న పాత్ర. ఇక తెలుగులో అల్లు అర్జున్, ఎన్టీఆర్‌గార్ల డ్యాన్స్ అంటే ఇష్టం. రాజమౌళిగారు తీసిన 'బాహుబలి' లాంటి సినిమాలో నటించాలనేది నా కల. ప్రస్తుతం కన్నడ, తమిళంలో కొన్ని సినిమాలు చేస్తున్నాను. తెలుగులో కొన్ని కథలు చర్చల్లో ఉన్నాయి'' అన్నారు.



మన ఆలోచనలే మన బలం

- సమంత

సినిమాలు, వ్యక్తిగత విషయాలతో పాటు తన జిమ్ వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ, ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉంటారు సమంత. అయితే మయోసైటిస్ వ్యాధి కారణంగా కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో పెద్దగా యాక్టివ్‌గా లేరు సమంత. ఆ వ్యాధి నుంచి కోలుకుంటున్న సమంత తిరిగి రొటీన్ లైఫ్‌లోకి వస్తున్నారు. తాజాగా జిమ్‌లో వర్కవుట్స్ చేస్తున్న ఓ వీడియోను షేర్ చేశారు సమంత. ''క్లిష్టమైన టైమ్‌లో నాకు తోడుగా నిలిచి, నాలో స్ఫూర్తి నింపిన 'హూ ఈజ్ గ్రావిటీ' బ్యాండ్‌కి కృతజ్ఞతలు. ఆరోగ్యం కోసం మనం పాటించే కఠినమైన డైట్ వల్ల మాత్రమే మనకు బలం రాదు.. అది మన ఆలోచనా విధానంపై ఆధారపడి ఉంటుంది అనేది నా అభిప్రాయం'' అని రాసుకొచ్చారు సమంత. కాగా సమంత లీడ్ రోల్‌లో గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన 'శాకుంతలం' ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. ప్రస్తుతం 'సిటాడెల్' అనే హిందీ వెబ్ సిరీస్‌లో నటిస్తున్నారామె.




- సమంత

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

తిరుమలలో వైభవంగా రథ సప్తమి



సూర్యప్రభ వాహన సేవలో పాల్గొన్న ఏపీ సీఎస్ జవహర్ రెడ్డి



సూర్యప్రభవాహన సేవలో పాల్గొన్న భక్తజనం

- ఏడు వాహనాలపై ఊరేగిన మలయప్ప స్వామి
- విశేషంగా తరలివచ్చిన భక్తులు

తిరుమల: సూర్య జయంతిని పురస్కరించుకుని తిరుమలలో శనివారం రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమ, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై మలయప్ప స్వామి విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. అందుకే దీన్ని ఒకరోజు బ్రహ్మోత్సవంగా భక్తులు భావిస్తారు. మధ్యాహ్నం చక్రస్నానం నిర్వహించారు. కోవిడ్ తర్వాత మొదటిసారి ఆలయ మాడవీధుల్లో జరుగుతున్న రథసప్తమి, వాహన సేవలకు విశేషంగా భక్తులు తరలివచ్చారు. ఈ వాహన సేవల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి దంపతులు, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్ కుమార్, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్, ఎఫ్‌ఏసీఏవో బాలాజి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఆలయ డిప్యూటీ ఈవో రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. నాలుగు మాడ వీధులతోపాటు, క్యూల్లో వేచి ఉన్న భక్తులకు నిరంతరం అన్న పానీయాలను టీటీడీ అందజేసింది.

సూర్యప్రభ వాహన సేవకు ప్రత్యేకత

రథసప్తమి వాహన సేవల్లో అత్యంత ప్రధానమైనది సూర్యప్రభ వాహన సేవ. శ్రీమలయప్పస్వామి వారు సూర్యప్రభ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. సర్వలోకాలకు చైతన్యాన్ని కలిగిస్తూ ఉదయించే శ్రీసూర్య భగవానుడు తన ఉషారేఖలను ఉదయం 6.50 నిమిషాలకు శ్రీవారి పాదాలపై ప్రసరించి నమస్కరించారు. ఈ వాహన సేవ అపురూప దృశ్యాన్ని తిలకించేందుకు ఎంతో ఆసక్తితో నిరీక్షిస్తున్న లక్షలాదిమంది భక్తిపారవశ్యంతో పులకించారు. గోవింద నామస్మరణ మధ్య స్వామివారి వాహనసేవ వైభవంగా జరిగింది. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కనులవిందుగా ఆదిత్యుడి నిజరూప దర్శనం



స్వామివారి దర్శనం కోసం వేచిఉన్న భక్తులు

శ్రీకాకుళం జిల్లాలోని ప్రఖ్యాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో రథసప్తమి వేడుకలు శనివారం కూడా కొనసాగాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి క్షీరాభిషేకాలు ప్రారంభించి శనివారం ఉదయం వరకు జరిపారు. ఆ తర్వాత స్వామివారు నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు.

– అరసవల్లి

• తెలంగాణ

యాదాద్రిలో ఘనంగా రథసప్తమి



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రథసప్తమి పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీస్వామి, అమ్మవార్లను సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. యాదాద్రి క్షేత్రంలో రథసప్తమి సందర్భంగా సూర్యప్రభ వాహన సేవను నిర్వహించడం ఇదే తొలిసారి.


మనదీ కలర్‌ఫుల్ పాస్‌పోర్టే!

ఉద్యోగం కోసమో లేదా విహారం కోసమే విదేశాలకు వెళ్లాలంటే పాస్‌పోర్టు కావాల్సిందే. ఇది అందరికీ తెలిసిందే. అవును.. మీకు పాస్‌పోర్ట్ ఉందా? ఉంటే.. అది ఏ రంగుది? అదేంటి అందరికీ ఒకటే ఉండదా అనేగా మీ డౌటు.. ఉండదు. మన దేశంలో రకరకాల రంగుల పాస్‌పోర్టులు ఉన్నాయి. ఈ మధ్యే ప్రపంచంలోని పవర్‌ఫుల్ పాస్‌పోర్టుల జాబితా విడుదలైన నేపథ్యంలో మనదేశంలోని పాస్‌పోర్టుల్లోని రకాలపై ఓ లుక్కేద్దామా..

– సాక్షి సెంట్రల్ డెస్క్

ముఖ్యంగా మూడు రంగుల్లో..

మన దేశంలో ప్రధానంగా నీలం, తెలుపు, ఎరుపు రంగుల్లో పాస్‌పోర్టులను జారీ చేస్తారు. ఆ పాస్‌పోర్టులపై ప్రయాణించే వ్యక్తుల ప్రత్యేకత/ ప్రాధాన్యతలను, ప్రయాణ అవసరాన్ని వాటితో సులువుగా గుర్తించవచ్చు.



నీలి రంగు: దేశంలోని సాధారణ పౌరులందరికీ నీలి రంగులో ఉండే పాస్‌పోర్టులను జారీ చేస్తారు. మనలో చాలా మంది దగ్గర ఉండేది ఈ రంగుదే. ఉద్యోగం, వ్యాపారం, పర్యాటకంతోపాటు ఏవైనా వ్యక్తిగత, ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లేవారికి ఈ పాస్‌పోర్టులు ఉంటాయి.



తెలుపు రంగు: భారత ప్రభుత్వ అధికారులు విదేశాలకు అధికారిక పర్యటనల నిమిత్తం వెళ్లేందుకు తెలుపు రంగు పాస్‌పోర్టులు జారీ చేస్తారు. మన దేశంతోపాటు విదేశాల్లోని ఎయిర్‌పోర్టుల్లో, ఇమ్మిగ్రేషన్ విభాగాల్లో.. ప్రభుత్వ అధికారులను, అధికారిక పర్యటనలపై వెళ్లేవారిని సులువుగా గుర్తించేందుకు ఇది వీలు కల్పిస్తుంది.



ఎరుపు రంగు: వీటిని దౌత్యపరమైన పాస్‌పోర్టులని కూడా పిలుస్తారు. మన దేశ ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత హోదా పాస్‌పోర్టులు ఇవి. భారత దౌత్యవేత్తలు, రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్/ ఐపీఎస్/ఐఎఫ్ఎస్ వంటి అఖిల భారత సర్వీసు అధికారులు(అధికారిక పర్యటనలు), విదేశాంగశాఖ అధికారులకు ఈ ఎరుపు రంగు పాస్‌పోర్టులు ఉంటాయి. ఈ పాస్‌పోర్టులు ఉన్నవారికి భారత ప్రభుత్వ అధికార ప్రతినిధులుగా విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. వీసా రహిత ప్రయాణం, వేగంగా ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ పూర్తిచేయడం, విమానాశ్రయాల నుంచి త్వరగా రాకపోకలు సాగించడానికి ప్రత్యేక మార్గాల్లో అనుమతి వంటి సదుపాయాలు ఉంటాయి.



నారింజ రంగు: కనీసం పదో తరగతి పూర్తిచేయని వారు, విద్యార్హత ధ్రువప త్రాలు లేని వారి కోసం 2018లో ఈసీఆర్ (ఇమిగ్రేష న్ చెక్ రిక్వైర్డ్) కేటగిరీ కింద నారింజ రంగు పాస్‌పోర్టుల ను అమల్లోకి తెచ్చారు. దీనిపై విమర్శలు రావడంతో విదే శాంగ శాఖ కొద్దినెలల్లోనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenahalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

MARUTI SUZUKI

NEXA

THEY TELL MANY TALES ABOUT THE JIMNY.

Some speak of a Jimny that once climbed the 5 highest peaks of Africa, including Mt. Kilimanjaro. Others talk about a Jimny that once rescued a newborn baby in Madrid's worst snowstorm. Some even say that a Jimny helped archaeologists dig up 900,000 years of history at The Pit of Bones. There are many such legends about this off-roader. **All true.**

What stories will they tell about you?

BOOKINGS OPEN

Jimny

INSPIRED BY

#TRUESTORIES




Scan for Jimny's #TrueStories

CREATE. INSPIRE.



ALLGRIP PRO



3 LINK RIGID AXLE SUSPENSION



HEADLAMP WASHERS



6 AIRBAGS



WIRELESS ANDROID AND APPLE CARPLAY CONNECTIVITY

Contact us at
1800-200-[6392]
1800-102-[NEXA]
www.nexaexperience.com
NOW YOU CAN ALSO BOOK ONLINE

NORTH BANGALORE: NEXA HEBBAL ORR (VARUN MOTORS PVT. LTD. PH: 9513838777), **NEXA YELAHANKA** (MANDOVI MOTORS PVT. LTD. PH: 9916805500), **WEST BANGALORE: NEXA NAGARBHAVI** (BIMAL AUTO AGENCY PH: 08030693069), **NEXA RAJAJINAGAR** (VARUN MOTORS PVT. LTD. PH: 8884000042), **NEXA RR NAGAR** (KALYANI MOTORS PH: 9590990011), **EAST BANGALORE: NEXA ORR MARATHALLI** (BIMAL AUTO AGENCY PH: 08030693069), **NEXA BANASWADI** (KALYANI MOTORS PH: 9590990011), **CENTRAL BANGALORE: NEXA MUSEUM ROAD** (PRATHAM MOTORS PH: 9880006006), **NEXA PALACE** (MANDOVI MOTORS PH: 7022623068), **SOUTH BANGALORE: NEXA ELECTRONIC CITY** (SURAKSHAA CAR CARE PVT. LTD. PH: 080-25732229, 8884442229), **NEXA JP NAGAR** (KALYANI MOTORS PH: 9590990011), **NEXA SARJAPUR ROAD** (PRATHAM MOTORS PH: 9008455550), **NEXA KORAMANGALA** (KATARIA AUTOMOBILES PVT. LTD. PH: 080-46837002).

Scan to book

Creative visualization. Achievements of global model of Jimny. Black glass on the vehicle is due to lighting effect. Trademarks used belong to respective trademark owners.
For details on functioning of safety features, including airbags, kindly refer to the Owner's Manual.